ఆదివారం SUNDAY 30.6.2024

హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+ 32 పేజీల ఆదివారం అనుబంధం | Pages: 12+4+ 32 Pages SUNDAY supplement

సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 25 | వెల (Price) రూ.8.00

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

ఆదివారం, సూర్యోదయం: 5-45, సూర్యాస్తమయం: 6-54. శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం కృష్ణ పక్షం తిథి: నవమి పగలు 12-19 వరకు. నక్షత్రం: రేవతి ఉదయం 7-34 వరకు, తదుపరి అశ్వని. వర్జ్యం: రాత్రి 2-38 నుంచి తెల్లవారుజామున 4-09 వరకు. రాహుకాలం: సాయంత్రం 5-14 నుంచి సాయంత్రం 6-53 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 5-08 నుంచి సాయంత్రం 6-00 వరకు. అమృతకాలం: రాత్రి 11-34 నుంచి రాత్రి 1-06 వరకు.







దక్షిణాఫ్రికాపై ఉత్కంఠ విజయం

- విరాట్ కోహ్లీ, హార్దిక్ పాండ్యా విజృంభణ
- సూర్యకుమార్‌యాదవ్ సంచలన క్యాచ్
- క్లాసెన్, డికాక్ పోరాటం వృథా
- మరోమారు సఫారీలకు నిరాశ
- సంబురాల్లో యావత్ దేశం
- ప్రముఖుల ప్రశంసల వెల్లువ

టీ 20లకు రిటైర్మెంట్ ప్రకటించిన విరాట్‌కోహ్లీ

జయహో భారత్

టీ20 ప్రపంచకప్ మనదే.. రెండోసారి విశ్వవిజేత

ఎన్ని గుండెకోతలు! ఎంత వేదన!! ఒకటా రెండా? దశాబ్దకాలంగా అందినట్టే అందుతూ చేజారుతున్న ఐసీసీ ట్రోఫీ ఎట్టకేలకు భారత్ సొంతమైంది. గత ఏడాది కాలంలో మూడుసార్లు ఐసీసీ టోర్నీల్లో ఫైనల్ వరకు వెళ్లినా అన్నిసార్లు నిరాశే ఎదురైంది. నియదు స్వదేశంలో జరిగిన వన్డే ప్రపంచకప్‌లో చేతులదాకా వచ్చిన ట్రోఫీని కంగారూలు పట్టుకుపోతుంటే హృదయం ముక్కలవని క్రికెట్ అభిమాని లేడంటే అతిశయోక్తి లేదు. 2011లో ధోనీ సారథ్యంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన తర్వాత మళ్లీ ఐసీసీ టోర్నీ మన దరిచేరలేదు. ఆ తరువాత ఐదు సార్లు ఫైనల్ వరకూ చేరినా కప్పు దక్కలేదు. కానీ ఈసారి కరీబియన్ గడ్డ మీద మాత్రం 140 కోట్ల అభిమానుల కల నెరవేరింది. కోట్లాది అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. 17 ఏండ్ల (2007) తర్వాత టీ20 వరల్డ్ కప్‌ను భారత్ ముద్దాడింది. గత రెండు ప్రపంచకప్‌లలో తమను దెబ్బకొట్టిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌ను ఇంటికి పంపిన రోహిత్ సేన.. ఫైనల్‌లో సమిష్టి ఆటతీరుతో సఫారీలను మట్టికరిపించింది. పురుషుల క్రికెట్‌లో భారత్ ఐసీసీ కప్‌ను అందుకోవడం ఇది నాలుగోసారి. వన్డే క్రికెట్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత్, పొట్టి ఫార్మాట్‌లో కూడా దానిని సమం చేసింది.

వెస్టిండీస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. చివరి ఓవర్ వరకూ నరాలుతెగే ఉత్కంఠతో హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో భారత్ 7 పరుగుల తేడాతో సఫారీలను మట్టికరిపించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. పొట్టి ఫార్మాట్ ఫైనల్ మ్యాచ్‌లో ఇంతవరకు ఇదే అత్యధిక స్కోరు. ఆ తరువాత బ్యాటింగ్‌కు దిగిన సఫారీలు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 169 పరుగులు మాత్రమే చేయగలిగారు.

భారత్ గ్రూప్ మ్యాచ్‌ల నుంచి సూపర్-8లో కూడా ఓటమి ఎరుగకుండా ఫైనల్ చేరింది. సెమీఫైనల్స్‌లో ఇంగ్లండ్‌ను సునాయాసంగానే ఓడించిన భారత్‌కు ఫైనల్‌లో దక్షిణాఫ్రికా గట్టి పోటీనిచ్చింది. అయితే గత33 ఏండ్లుగా క్రికెట్ వరల్డ్ కప్ సఫారీలకు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.

> 12



డీ శ్రీనివాస్ కన్నుమూత

- జూబ్లీహిల్స్ స్వగృహంలో గుండెపోటుతో మృతి
- నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం
- పీసీసీ అధ్యక్షుడిగా, రాష్ట్ర మంత్రిగా సేవలు
- ప్రధాని మోదీ, సీఎం రేవంత్, కేసీఆర్ సంతాపం
- మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు నివాళులు
- నిజామాబాద్‌కు భౌతికకాయం తరలింపు > 5
- అధికారిక లాంఛనాలతో నేడు అంత్యక్రియలు

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ హఠాన్మరణం



ఉదయం అస్వస్థత.. హైదరాబాద్ తరలిస్తుండగా గుండెపోటు

జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు

> 5

ఏకపక్ష విచారణ

- వాదనలు వినకుండా వేలకోట్ల నష్టమని ఎలా అంటారు?
- ఇద్దరు ముఖ్యమంత్రుల సమక్షంలో ఒప్పందం జరిగింది
- ప్రభుత్వరంగ సంస్థలకు ప్రభుత్వాలు లంచాలిస్తాయా?
- పవర్ ప్లాంట్లకు బొగ్గు కేటాయించేది కేంద్ర ప్రభుత్వం
- రాష్ట్రానికి జరిగిన మేలును కమిషన్ పరిగణించడం లేదు
- ఒకపక్షం వాదనతో కమిషన్ ఏకీభవించడం బాధాకరం
- కేసీఆర్‌ను బద్నాం చేసేందుకే విచారణ జరుగుతున్నట్టున్నది
- పవర్ కమిషన్‌పై విద్యుత్తుశాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- జస్టిస్ నర్సింహారెడ్డికి అన్ని అంశాలు లేఖ రాశానని వెల్లడి

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు ఒప్పందాలు, పవర్‌ప్లాంట్ల నిర్మాణం విషయంలో జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని విద్యుత్తు శాఖ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఇరుపక్షాల వాదనలు పూర్తిగా వినకుండానే వేలకోట్ల నష్టం వాటిల్లిందని కమిషన్ ఎలా నిర్ధారిస్తుందని ప్రశ్నించారు. శనివారం ఆయన తెలంగాణభవన్‌లో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషన్‌కు తాను రాసిన లేఖను జగదీశ్‌రెడ్డి విడుదల చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి యూనిట్ విద్యుత్తును రూ.3.90 చొప్పున కొనుగోలు చేసిన నాటి పరిస్థితులను వివరించారు. ఆ సమయంలో ప్రభుత్వరంగ సంస్థల నుంచి విద్యుత్తును యూనిట్‌కు రూ.17 చొప్పున కొనుగోలు చేస్తున్న పరిస్థితి ఉన్నదని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన వెంటనే ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణను ఇబ్బందిపెట్టాలని చూశారని ఆరోపించారు. భద్రాచలంలోని ఏడు మండలాలు, సీలేరు పవర్ ప్రాజెక్టును ఏపీలో కలిపిన విష



యాన్ని గుర్తుచేశారు. వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కేసీఆర్‌పై నింద వేయాలనే ఉద్దేశంతోనే కమిషన్ ఆరోపణలు చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్తు డిమాండ్ మేరకు విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్‌తో కుదుర్చుకున్న ఒప్పందంలో కేసీఆర్‌తోపాటు నాడు ఆ రాష్ట్ర సీఎంగా రమణ్‌సింగ్ కూడా ఉన్నారని గుర్తుచేశారు. విద్యుత్తు ఒప్పందాలు, పవర్ ప్లాంట్ల నిర్మాణాలు ప్రభుత్వరంగ సంస్థల మధ్య జరిగాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలు..

> 2వ పేజీలో

భద్రాద్రి థర్మల్ ప్లాంట్‌పై పిడుగు



- యూనిట్-1లో అగ్నిప్రమాదం
- నిలిచిన విద్యుత్తు ఉత్పత్తి
- కోట్లలో నష్టం జరిగే అవకాశం

> 2




సర్కారు తప్పిదం.. దివ్యాంగులకు శాపం!

- నాడు మెడికల్ పోస్టులు లేకుండానే ఎంపిక
- నేడు అనర్హులంటూ పోస్టింగ్ నిరాకరణ
- హెచ్‌హెచ్ విభాగంలోనే 35 మందికిపైగా రిజెక్ట్
- వీహెచ్, ఓహెచ్ ఇతర విభాగాల్లో మరెన్నో?
- తుదిదశ మెరిట్ అభ్యర్థులకైనా ఇవ్వని వైనం
- కాంగ్రెస్ సర్కారుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

> 8

జీహెచ్ఎంసీలోకి కంటోన్మెంట్ బోర్డు



- విలీనానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- సివిల్ ఏరియా ఆస్తులు, వసతులు గ్రేటర్ హైదరాబాద్‌కు బదిలీ
- కేసీఆర్ ప్రభుత్వ కృషికి ఫలితం

> 3




హస్తినాపురంలో శనివారం జరిగిన సాయిచంద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, వర్ధంతిసభలో ప్రసంగిస్తున్న కేటీఆర్, చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్క సుమన్, దేశపతి శ్రీనివాస్, సాయిచంద్ సతీమణి రజని, పిల్లలు

సాయిచంద్ లోటు పూడ్చలేనిది

- సాయి కుటుంబానికి అండగా ఉంటాం
- మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు
- హస్తినాపురంలో మొదటి వర్ధంతి సభ

వనస్థలిపురం, జూన్ 29: కవి, గాయకుడు వేద సాయిచంద్ లేనిలోటు పూడ్చలేనిదని, ఆయన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సాయిచంద్ మొదటి వర్ధంతి సభను హస్తినాపురంలోని జీఎస్సార్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సాయిచంద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో, నిర్మాణంలో సాయిచంద్ పాట ఎంతో ప్రభావం చూపిందని చెప్పారు. ఎక్కడ కేసీఆర్ సభ జరిగినా అక్కడ సాయిచంద్ పాట ఉండేదని గుర్తు చేశారు. గొప్ప కళాకారుడిని బీఆర్‌ఎస్ పార్టీ, తెలంగాణ సమాజం కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రవహించే నదిలా సాయి మాట, పాట

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ సాయి పాట, మాట ప్రవహించే నదిలా ఉండేదని అన్నారు. ప్రతి సభలోనూ సాయి తన మాట, పాటలతో చైతన్యం నింపేవారని చెప్పారు. చల్లనికి ఆయనుపెట్టాలన్న కోరిక సాయికి ఉండేదని, ఆ కోరికను కేసీఆర్ తీరుస్తారని తమతో అనేవారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బాల్క సుమన్, రసమయి బాలకిషన్, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, దేవీ ప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఉద్విగ్నంగా రజనీ ప్రసంగం

సాయిచంద్ వర్ధంతి సభలో ఆయన సతీమణి రజనీ ప్రసంగం ఉద్విగ్నంగా సాగింది. గుండె నిండా దుఃఖంతో ఆమె సాయిచంద్ జ్ఞాపకాలను వివరించారు. అనంతరం సాయిచంద్ తండ్రి తన కొడుకుపై పాడిన పాట సభికులను కంటతడి పెట్టించింది. కవులు, కళాకారులు సాయిచంద్‌పై రూపొందించిన సీడీని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆవిష్కరించారు.




ములుగు జిల్లా మల్లంపల్లిలో జగదీశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా, ఇతరులు

జగదీశ్వర్‌కు ఘన నివాళి

ములుగురూరల్, జూన్ 29 : ములుగు జిల్లా తొలి జడ్పీచైర్మన్, బీఆర్‌ఎస్ ఉద్యమ నాయకుడు కుసుమ జగదీశ్వర్ ప్రథమ వర్ధంతిని శనివారం నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ టీఎస్‌పీఎస్సీ దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, శంకర్ నాయక్, తాటికొండ రాజయ్య తదితరులు జగదీశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి సీతక్క సైతం మల్లంపల్లికి చేరుకొని జగదీశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సొంత ఆదాయంపైనే కాంగ్రెస్ దృష్టి

- బీఆర్‌ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు వారి ఆదాయం పెంచుకుంటున్నారే తప్ప రాష్ట్ర ఆదాయం, అభివృద్ధి విషయాన్ని పట్టించుకోవడంలేదని బీఆర్‌ఎస్ నేత, అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం దివాలా అంచుల్లోకి వెళ్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రానికి ప్రతి నెలా రూ.13 వేల కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, గత నెలలో రూ.10 వేల కోట్లు మాత్రమే వచ్చిందని ఉదహరించారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 32 వేల కోట్ల అప్పులు తెచ్చి ఒక్క ప్రాజెక్టూ కానీ, ఒక్క కొత్త పథకాన్ని కానీ అమలు చేయలేదని మండిపడ్డారు.



మీడియా సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత శ్రీశైల్‌రెడ్డి

విలువలు ఉంటే రాజీనామా చెయ్..

- ఎమ్మెల్యే కాలె యాదయ్యకు మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్ రెడ్డి సవాల్
- పార్టీ మారిన వారిపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్య వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆనంద్ మాట్లాడుతూ రాజకీయ విలువల గురించి మాట్లాడే యాదయ్య ఇప్పుడు పార్టీ ఎందుకు వీడారో చెప్పాలని నిలదీశారు. నమ్ముకున్న కార్యకర్తలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. కేసీఆర్ దయవల్లే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని గతంలో యాదయ్య చెప్పారని గుర్తుచేశారు. చేవెళ్ల అభివృద్ధికి గతంలో కేసీఆర్ పెద్ద ఎత్తున నిధులు ఇచ్చారని, 111 జీవో కూడా ఎత్తేశారని పేర్కొన్నారు. తన ఇంట్లో నాలుగు పదవులు అనుభవిస్తున్న యాదయ్య, బీఆర్‌ఎస్ క్యాడర్‌కు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కోరారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కే మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కన పెట్టి, బీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలను చేర్చుకుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ నేత పంజుగుల శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్ పాలనలో రాష్ట్రం ప్రమాదంలో పడిందని చెప్పారు.

ఏకపక్ష విచారణ

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వాల మధ్య ఎక్కడైనా లంచం తీసుకునే అవకాశం ఉంటుందా? అని ప్రశ్నించారు. జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్‌కు రాసిన లేఖలో పలు కీలక అంశాలను సోదాహరణంగా జగదీశ్‌రెడ్డి వివరించారు.

ఒప్పందాలకు ఇదీ నేపథ్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్తు రంగ పరిస్థితిని కమిషన్‌కు రాసిన లేఖలో జగదీశ్‌రెడ్డి వివరించారు. రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్ర ప్రభుత్వం అప్పటికే అందుబాటులో ఉన్న విద్యుత్తులో 53.89% తెలంగాణకు, 46.11% ఏపీకి కేటాయించిందని, అదే దామాషాలో పవర్‌ప్లాంట్ల విద్యుత్తును వినియోగించుకోవాలని నిర్ణయించిందని వివరించారు. 2014 జూన్ 2 నాటికి రాష్ట్రానికి 2700 మెగావాట్ల విద్యుత్తు కొరత ఉండేదని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి వచ్చిన 400 మెగావాట్ల సీలేరు జలవిద్యుత్తు కేంద్రాన్ని ఏపీ ప్రభుత్వం కేంద్రంలో లాబీయింగ్ చేసి బలవంతంగా గుంజుకున్నదని పేర్కొన్నారు. దీంతో తెలంగాణ విద్యుత్తు పరిస్థితి మరింత దిగజారడమే కాకుండా విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావలసిన విద్యుత్తును ఇవ్వకుండా ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆరోపించారు. పరిశ్రమలకు మూడు రోజులు పవర్ హాలిడేస్‌తోపాటు, భారీగా విద్యుత్తు కోతలు ఉండేవని చెప్పారు. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన కేసీఆర్ ప్రభుత్వం మొదట విద్యుత్తు రంగంపై దృష్టిపెట్టి 24 గంటల నాణ్యమైన విద్యుత్తును అందించే చర్యలకు ఉపక్రమించిందని తెలిపారు. కొత్త విద్యుత్తు ప్రాజెక్టులను వేగంగా నిర్మించాలని, తక్షణమే సంక్షోభం నుంచి బయటపడేందుకు దేశంలో అందుబాటులో ఉన్న విద్యుత్తును త్వరితగతిన కొనుగోలు చేయాలని విద్యుత్తు సంస్థలను ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తును తెచ్చుకొనేందుకు ఉన్న అవకాశాలపై ఆ రాష్ట్రంతో తెలంగాణ ప్రభుత్వం, విద్యుత్తు సంస్థల అధికారులు చర్చించినట్టు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును తీసుకొనిరావడానికి ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. ఆ సమయంలోనే కేంద్ర ప్రభుత్వ సంస్థ పీజీసీఐఎల్‌తో మన విద్యుత్తు సంస్థల అధికారులు సంప్రదింపులు జరిపిన విషయాన్ని ఆ లేఖలో సోదాహరణంగా వివరించారు. ఆ సమయంలో ఉత్తరాది రాష్ట్రాలతో అనుసంధానం చేసుకోవడానికి దక్షిణాది రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ నెలకొన్నదని వివరించారు.

ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో తెలంగాణకు మేలే...

తెలంగాణ విద్యుత్తు సంస్థలు విద్యుత్తు కొనుగోలు కోసం ఓపెన్ బిడ్డింగ్‌కు ఆహ్వానిస్తే, ఏపీ



మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి

ఇరు రాష్ట్రాల సీఎంల సమక్షంలో..

పీజీసీఐఎల్ నిబంధనల ప్రకారం మొదట వచ్చినవారికే మొదటి అవకాశం ఇచ్చే వీలున్నదని, ఏదో ఒక ప్రాజెక్టు నుంచి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం ఉండి తీరాలన్న నిబంధన కూడా ఉన్నదని జగదీశ్‌రెడ్డి వివరించారు. విద్యుత్తు అవసరాలు, దక్షిణాది రాష్ట్రాల మధ్య నెలకొని ఉన్న పోటీ వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని పీజీసీఐఎల్ నిబంధనలకు లోబడి ఛత్తీస్‌గఢ్‌తో ఇరురాష్ట్రాల సీఎంల సమక్షంలో ఇరు రాష్ట్రాల అధికారుల మధ్య ఎంవోయూ కుదిరిందన్నారు. తెలంగాణ ఈఆర్సీ ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసే విద్యుత్తు ధర రూ.3.90గా నిర్ణయించిందని గుర్తుచేశారు. ఆ సమయంలో రాష్ట్రం వివిధ సంస్థల నుంచి తీసుకుంటున్న విద్యుత్తుకు యూనిట్‌కు రూ.5 నుంచి రూ.17 వరకు చెల్లించిందని ఉదహరించారు. అదే సమయంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు టెండరు పద్ధతిలో యూనిట్‌కు రూ.4.94లు చొప్పున కొనుగోలు చేయడానికి పీపీఏ(ఒప్పందం)లు చేసుకున్నాయని పేర్కొన్నారు. రామగుండం ఎన్టీపీసీ ద్వారా జనవరి 2024 నుంచి మన రాష్ట్రానికి ఇస్తున్న 1600 మెగావాట్ల విద్యుత్తుకు యూనిట్‌కు రూ.5.60 పైగా చెల్లిస్తున్న విషయాన్ని కమిషన్ దృష్టికి తెచ్చారు.

విద్యుత్తు సంస్థలు చట్టప్రకారం తెలంగాణకు ఇవ్వాల్సిన విద్యుత్తును ఇవ్వకపోవడమే కాకుండా, ఆ టెండర్‌లో పాల్గొని యూనిట్ ధరను రూ. 5.85 కోట్ చేశాయని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయాలన్నీ పరిశీలించినప్పుడు పీజీసీఐఎల్ లైన్లో వాటా కొనుగోలు వల్ల కానీ, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు వల్ల కానీ తెలంగాణకే మేలు జరిగిందని, ఎటువంటి నష్టం జరగలేదన్నారు.

రికార్డు సమయంలో కొత్తగూడెం ప్రాజెక్టు పూర్తి

సబ్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం ఆనాడున్న చట్టాలకు, నిబంధనలకు లోబడే జరిగిందని జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్తు విషయంలో ఆనాడున్న సంక్షోభ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని జెన్‌కో ఆధ్వర్యంలోనే విద్యుత్తు ప్రాజెక్టులను త్వరితగతిన నిర్మించాలని నిర్ణయించినట్టు తెలిపారు. బీహెచ్‌ఈఎల్ అతి తక్కువ కాలంలో నిర్మాణం పూర్తి చేసేందుకు ముందుకొచ్చిందని వివరించారు. అనేక చర్చలు, సంప్రదింపుల్లో భాగంగా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా 800 మెగావాట్ల ప్లాంటు నిర్మాణానికి కేవలం నాలుగేండ్లు పడుతుందని, తాము రెండేండ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి 1080 మెగావాట్ల విద్యుత్తును అందిస్తామని, 2017 మార్చిలోపే నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. నాడు ఎన్టీపీసీ వంటి ప్రభుత్వరంగ సంస్థలతోపాటు దేశంలో తయారయ్యే విద్యుత్తు 90 శాతంపైగా సబ్ క్రిటికల్ టెక్నాలజీతోనే నిర్మితమయ్యాయనే విషయాన్ని కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. దేశంలో అప్పటికే 17 విద్యుత్తు ప్రాజెక్టులు సబ్ క్రిటికల్ టెక్నాలజీతోనే నిర్మాణంలో ఉన్నాయని ఉదహరించారు. వాటి కన్నా ముందే మణుగూరు ప్రాజెక్టు పూర్తి చేస్తామని బీహెచ్‌ఈఎల్ ముందుకొచ్చిందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలకు నామినేషన్‌పై పనులు అప్పగించే అవకాశం ఉన్నందున ఆలస్యం చేయకుండా కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్రాజెక్టు, మణుగూరులో నాలుగు 270 మెగావాట్ల ప్రాజెక్టుల నిర్మాణానికి బీహెచ్‌ఈఎల్, జెన్‌కో ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. కొత్తగూడెం ప్రాజెక్టును బీహెచ్‌ఈఎల్ 48 నెలల్లోనే పూర్తి చేసిందన్నారు. మణుగూరు విషయంలో ఎన్జీటీ స్టే విధించడం, కోవిడ్ వల్ల కొంత ఆలస్యమైందని వివరించారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ప్లాంట్లను కూడా 50% పీఎల్‌ఎఫ్‌తో నడపాలని కేంద్రం ఇచ్చిన మెమోతో సూపర్ క్రిటికల్, సబ్ క్రిటికల్ టెక్నాలజీల వాదానికి అర్థమే లేకుండా పోయిందని పేర్కొన్నారు.

సిమెంట్ కంపెనీలు ముందుకు రావడంతో...

రైతులకు కూడా 24 గంటల విద్యుత్తును అందించాలనే లక్ష్యంతో వేగంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లా దామరచర్లలో 4000 మెగావాట్ల అల్ట్రా మెగా పవర్ ప్లాంటు (యూఎంపీపీ) నిర్మాణం చేపట్టాలని నిర్ణయించిందని జగదీశ్‌రెడ్డి వివరించారు. విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణానికి భూమి, నీరు, రోడ్డు రవాణా, రైలు రవాణా సౌకర్యాలు ముఖ్యమైనవని, అయితే ఇందులో బొగ్గు కేటాయింపు (కోల్ లింకేజీ) పూర్తిగా కేంద్రం అధికారమని పేర్కొన్నారు. దేశంలో బొగ్గుతో విద్యుత్తు తయారు చేసే ప్లాంట్లు అన్నీ విధిగా 10% విదేశీ బొగ్గును వాడాలని, ప్లాంటు నుంచి భారీగా వెలువడే ఫ్లైయాష్‌ను వెంటవెంటనే డిస్పోజ్ చేయాలన్న ఎన్జీటీ నిబంధన కూడా ఉన్న విషయాన్ని ఆయన లేఖలో ఉదహరించారు. ఫ్లైయాష్‌ను వెంటవెంటనే తీసుకొనిపోవడానికి సిమెంట్ కంపెనీలు ముందుకొచ్చిన విషయాన్ని ఉటంకించారు. విదేశీ బొగ్గు వాడాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనను కఠినంగా అమలు చేసినా పోర్టులన్నింటికీ అతి చేరువలో ఉన్న ప్రాంతం దామరచర్ల అని, అన్ని అంశాలను దృష్టిలో పెట్టుకునే యూఎంపీపీ నిర్మాణం పూర్తిగా సహేతుకమైనదని స్పష్టం చేశారు. ఏ ఒక్క భారీ పరిశ్రమ కూడా లేని నల్లగొండకు విద్యుత్తు ప్రాజెక్టు రావాలన్న జిల్లా ప్రజల కోరికను నాడు మంత్రిగా ఉన్న తాను కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చానని, ఈ నేపథ్యంలో నాటి రాష్ట్రప్రభుత్వం తీసుకున్న అద్భుత నిర్ణయంగా జిల్లా ప్రజలు భావించారని ఉదహరించారు. దేశంలో కొన్ని విద్యుత్తు ప్లాంట్లు విదేశీ బొగ్గుతో నడుస్తున్నాయని ఉదహరించారు. బొగ్గు ఉన్న చోటే విద్యుత్తు ప్లాంటు నిర్మించాలనేది అర్థరహిత వాదన అని జగదీశ్‌రెడ్డి కొట్టిపారేశారు.

అసాధారణ విజయాలను కప్పిపుచ్చలేరు

విద్యుత్తు రంగంలో కేసీఆర్ ప్రభుత్వం సాధించిన అసాధారణ విజయాలను మసిపూసి ప్రయత్నంలో భాగంగానే ఆరోపణలు చేస్తున్నారని జగదీశ్‌రెడ్డి కొట్టిపారేశారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్తు వల్ల తెలంగాణ రాష్ట్రం 3.5 కోట్ల టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశానికి అన్నపూర్ణగా మారిందని కొనియాడారు. ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించడం వెనుక విద్యుత్తు రంగ విజయం ఉన్నదని తెలిపారు. వేలాది పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొనిరావడం వల్ల దాదాపు 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించి అనేక రంగాల్లో తెలంగాణ దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని వివరించారు. రాష్ట్రం నుంచి రూ.57 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు రూ.2.41 లక్షల కోట్లకు పెరగడంతోపాటు తలసరి ఆదాయం పెరుగుదల వెనుక కూడా విద్యుత్తు రంగ విజయమే ఉన్నదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో తలసరి విద్యుత్తు వినియోగం నాడు 1196 కిలోవాట్ అవర్స్ ఉండగా నేడు అది 2349 కిలోవాట్ అవర్స్‌కు పెరిగిందని దీనికి కేసీఆర్ ప్రభుత్వం అనుసరించిన విధానమే కారణమని స్పష్టం చేశారు.

ఏకపక్ష కమిషన్

విచారణ సమయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరినీ విచారించాలనే విషయం తెలిసినా జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఒప్పందాలు ఆనాటి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు కేసీఆర్, రమణ్‌సింగ్, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ అధికారులు, విద్యుత్తు సంస్థల అధికారుల మధ్య జరిగాయని వివరించారు. భద్రాద్రి ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు వచ్చాయని, అందులో కేంద్ర మంత్రులు, అధికారులు భాగస్వాములు అవుతారనే విషయం కమిషన్‌కు తెలుసని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం కావడానికి ఎన్జీటీ స్టే విధించడంతోపాటు వివిధ శాఖల నుంచి రావలసిన అనుమతుల్లో జాప్యమే కారణమని వివరించారు. విచారణాంశాల్లో భాగస్వాములైన అందరినీ విచారిస్తేనే కమిషన్ సరైన నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇరు పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా కొద్దిమందితో మాత్రమే సమాచారం తీసుకుని మీడియా సమావేశం నిర్వహించి ఏకపక్షం వాదనంతో జస్టిస్ నర్సింహారెడ్డి విశ్లేషించడం బాధాకరమని పేర్కొన్నారు. కమిషన్ అలా వ్యవహరించడం వల్ల తమ రాజకీయ ప్రత్యర్థులు కక్షపూరితంగా చేసిన నిరాధార, అర్థరహిత ఆరోపణలకు ఊతమిచ్చినట్టు అయిందని ఆవేదన వ్యక్తంచేశారు. జస్టిస్ నర్సింహారెడ్డి మీడియా సమావేశం తరువాత ప్రధాన పత్రికల్లో ప్రధాన శీర్షికగా రూ.6 వేల కోట్ల నష్టం కథనాలు ప్రచురితం కావడం, ఆ సమాచారం ఎవరి ద్వారా వచ్చింది? ఏ ఆధారాలతో ఆ వార్తను ప్రచురించారు? తదితర అంశాలన్నీ కూడా విచారణలో భాగం కావాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఇలా చేయకపోతే కేవలం గత ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను బద్నాం చేయడం కోసమే విచారణ జరుపుతున్నట్టు తాము భావించాల్సి వస్తుందని స్పష్టంచేశారు. తెలంగాణ బిడ్డగా వాస్తవాలు ప్రజలకు నిష్పక్షపాతంగా ఉండాలని భావించిన తమకు జస్టిస్ నర్సింహారెడ్డి కమిషన్ ఏకపక్షంగా నివేదిక ఇవ్వబోతున్నదనే విషయం స్పష్టమైందని ఆక్షేపించారు. ఆనాటి ప్రభుత్వంపై, కేసీఆర్‌పై కమిషన్ వ్యతిరేక భావనతో ఉన్నట్టు తేలిపోయిందని ఆరోపించారు. తమ రాజకీయ ప్రత్యర్థులు చేసిన వాదనలతో కమిషన్ ఏకీభవించినట్టు జస్టిస్ నర్సింహారెడ్డి మాటలతో తేలిపోయిందని పేర్కొన్నారు. కమిషన్ విచారణ సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా సాగుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

అనుమానాలకు తావేలేదు

పీజీసీఐఎల్ లైన్‌లో వాటా కొనుగోలు, చెల్లింపులు, ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు, చెల్లింపులు, మణుగూరు, యాదాద్రి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణంలోని హేతుబద్ధత విషయంలో ఎక్కడా ఎటువంటి అనుమానాలకు తావులేదని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. ప్రభుత్వానికి, ప్రభుత్వానికి మధ్య, ప్రభుత్వ రంగ సంస్థకు మరో ప్రభుత్వ రంగ సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాల్లో ప్రజాధనం దుర్వినియోగానికి అవకాశమే లేదనే కమిషన్‌కు కూడా తెలుసని పేర్కొన్నారు. వీటిపై గతంలో శాసనసభలో పూర్తిస్థాయిలో చర్చ జరిగిందని వివరించారు. ఈఆర్సీ వద్ద కూడా ప్రస్తుతం ఆరోపిస్తున్న వ్యక్తులు వారి అనుమానాలను, అభ్యంతరాలను వ్యక్తీకరించారని, వాటన్నింటినీ విచారించిన తర్వాతే ఈఆర్సీ తన నిర్ణయాలను ప్రకటించిందని స్పష్టంచేశారు.

నామినేషన్ పద్ధతి ద్వారా తెలంగాణకు మేలే

టీపీఎస్ స్టేజ్ 8 (800మెగావాట్లు) విద్యుత్తు ప్రాజెక్టును రూ.3,810 కోట్ల వ్యయంతో బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిలో ఇచ్చామని జగదీశ్‌రెడ్డి తెలిపారు. అప్పటి ఏపీ ప్రభుత్వం ప్రతి ప్రాజెక్టు పనిని రెండు భాగాలుగా చేసి బీటీజీని బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిపై, మరో భాగం బీవోపీని ప్రైవేటు కంపెనీలకు టెండర్లపై ఇచ్చిందని ఉదహరించారు. తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ స్టేజ్-5 (800 మెగావాట్లు) ప్రాజెక్టు బీటీజీని రూ.2,307 కోట్లకు నామినేషన్ పద్ధతుల్లో ఇచ్చిందని, బీవోపీ కాంట్రాక్టును ఓపెన్ టెండరులో టీపీఆర్‌బీఎస్‌ఎల్ కంపెనీకి రూ.2,290 కోట్లకు మొత్తం కలిపి రూ.4,606 కోట్లకు ఇచ్చిందని తెలిపారు. ఏపీతో పోల్చితే మన జెన్‌కో అతితక్కువ ధరకు బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్‌పై ఇచ్చిందనే విషయాన్ని కమిషన్ దృష్టికి తెచ్చారు. ఏపీ ప్రభుత్వం కూడా బీటీజీని బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్ పైనే ఇచ్చిందని తెలిపారు. ఓపెన్ టెండర్ ద్వారా ఇచ్చిన బీవోపీకి తెలంగాణ కంటే ఏపీ ఒక ప్లాంటులో రూ.800 కోట్లు, మరో ప్లాంటులో రూ.1,150 కోట్ల ఎక్కువ ఇచ్చిందని వివరించారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
రంగారెడ్డి	34.9°c	22.8°c
మెదక్	34.2°c	23.7°c
నిజామాబాద్	33.1°c	25.5°c
ఖమ్మం	33.0°c	25.0°c
మహబూబ్‌నగర్	32.5°c	25.6°c
ఆదిలాబాద్	32.3°c	25.2°c
నల్లగొండ	32.0°c	24.0°c
కరీంనగర్	32.0°c	27.0°c
హైదరాబాద్	31.6°c	24.8°c
వరంగల్	29.0°c	26.0°c



గోదావరిఖనిలో మీడియాతో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నూతన అధ్యక్షుడు రాజిరెడ్డి

81 మందితో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ

నూతన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, జూన్ 29: సింగరేణి వ్యాప్తంగా అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ 81 మంది తో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నూతన సెంట్రల్ కమిటీని ఎన్నుకున్నట్టు ఆ యూనియన్ నూతన అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కమిటీ చీఫ్ జనరల్ సెక్రటరీగా ఖమ్మం జిల్లా కొత్తగూడెంకు చెందిన కాపు కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ వాసి కే సురేందర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రామగుండం డివిజన్-2కు చెందిన మాదాసు రామ్మూర్తి, సీనియర్ ఉపాధ్యక్షుడిగా నూనె కొమురయ్య, ఉపాధ్యక్షులుగా బడికెల సంపత్‌కుమార్, ధ రావత్ మంగీలాల్, జంగిలి రవీందర్, నల్లవెల్లి సదానందం, కురిమ వీరభద్రం, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, అదనపు ప్రతినిధిగా పల్లెపల్లి రవి, కోశాధికారిగా రాపర్తియా వెంకటేశ్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులుగా ఎండీ జాకీర్ పాష, బండి రమేశ్, రాజశేఖర్, ఎస్ రంగనాథ్, పింగిలి సంపత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా చిల్లూరి సతీశ్, పానుగంటి సత్తయ్య, బేతి చంద్రయ్య, సిద్ధంశెట్టి సాంబ్, దాసరి శ్రీనివాస్, వాసిరెడ్డి శివకుమార్, రత్నం, అవినాశ్, ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. ముఖ్య కార్యనిర్వాహక కార్యదర్శులుగా పల్లా రవీందర్‌రెడ్డి, పొట్యాల రాజయ్య, ఇందూరి సత్యనారాయణ, అనుముల సత్యనారాయణ, పొగాకు రమేశ్, మంగిలాల్ రమేశ్‌బాబు, పోలాడి శ్రీనివాసరావు, వారణాసి గోరేశం, అనుముల సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా పెండ్లి అన్వేష్, సీహెచ్ వెంకటరమణ, బేతి రామకృష్ణ, అల్లం శ్రీనివాస్‌రెడ్డి, షేక్ ముస్తఫా, రఘోత్తంరెడ్డి, బూర్గుల రవికుమార్, ఉలెక్కి రమేశ్, రాజేశంతోపాటు 87 మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించినట్టు తెలిపారు.

జీటీపీఎస్‌లో పిడుగుపాటుతో అగ్నిప్రమాదం

- ఒకటో యూనిట్ విద్యుత్తును నిలిపివేసిన సిబ్బంది
- మంటలను అదుపు చేసిన అగ్నిమాపక శాఖ
- నష్టం రూ.కోట్లల్లో ఉండే అవకాశం

మణుగూరు టౌన్, జూన్ 29 : పిడుగుపాటుతో జీటీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగడంతో రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రంలో గల ఒకటో యూనిట్‌పై శనివారం రాత్రి పిడుగుపడింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు యూనిట్-1లో విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. మంటలను అదుపు చేసేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు తీవ్రంగా శ్రమించారు. యూనిట్-1, 2ను స్టేజ్-1గా, యూనిట్-3, 4ను స్టేజ్-2గా పరిగణిస్తుండగా.. జీటీ ట్రాన్స్‌ఫార్మర్ స్టేజ్-1 వద్ద అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగడంతో ఆందోళనకు గురైన సిబ్బంది హుటాహుటిన విద్యుత్ ఉత్పత్తిని యూనిట్-1, లేదా యూనిట్ -2లో నిలిపివేశారా.. అన్నది తేలాల్సి ఉంది. అధికారులు పిడుగుపాటు అని ప్రకటిస్తుండగా, స్విచ్ యార్డ్ వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నా జీటీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అగ్నికీలలు ఎగిసిపడటంతో పిడుగుపాటా? సాంకేతిక లోపమా.. అన్నది తేలాల్సి ఉంది.

కొత్త చట్టాలపై 'సమాహార' యాప్

రూపొందించిన ప్రాసిక్యూషన్ విభాగం

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): జూలై 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త క్రిమినల్ చట్టాలపై సమగ్ర సమాచారంతో తెలంగాణ ప్రాసిక్యూషన్ విభాగం ప్రత్యేకంగా 'సమాహార' పేరుట యాప్‌ను రూపొందించింది. దీంతోపాటుగా ప్రత్యేకంగా ఓ హ్యాండ్ బుక్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. వీటిని రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా జితేందర్ ఆవిష్కరించి, ప్రాసిక్యూషన్ టీమ్‌ను అభినందించారు. కొత్త చట్టాల్లోని పలు సెక్షన్ల సంక్షిప్త వివరాలు, పోలిక పట్టికలు, రెడీ రిఫరెన్సులు, మార్గదర్శకాలు ఇవ్వడం ద్వారా సామాన్యులకు సైతం సులువుగా అర్థమవుతాయని తెలిపారు. కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులకు కరదీపికగా పని చేస్తుందని చెప్పారు.

త్వరలో నాలుగో రైల్వే లైన్

- ఎస్‌సీఆర్ ప్రధాన మార్గాల్లో నిర్మాణానికి కసరత్తు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) జోన్ పరిధిలోని ప్రధాన మార్గాల్లో కొత్తగా నాలుగో లైన్‌ను నిర్మించాలని రైల్వేశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు తెలుస్తున్నది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికులు, సరుకు రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని నాలుగో లైన్ నిర్మాణానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే కొన్ని మార్గాల్లో సర్వే పనులు కూడా ప్రారంభించినట్టు సమాచారం. ప్రస్తుతం కాజీపేట-విజయవాడ, కాజీపేట-బల్లార్ష సెక్షన్లలో మూడో రైల్వే లైన్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తయ్యాక నాలుగో లైన్ పనులు ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లను త్వరలోనే రైల్వేశాఖకు సమర్పించే అవకాశాలు ఉన్నాయి. త్వరలో ప్రవేశపెట్టే కేంద్ర బడ్జెట్‌లో నాలుగో లైన్ ప్రస్తావన వచ్చే అవకాశాలున్నాయని చెప్తున్నారు. ప్రయాణికుల సంక్షేమం కంటే వాణిజ్యపరమైన ప్రయోజనాల కోసం అదనపు రైల్వే మార్గాల నిర్మాణాన్ని చేపడుతున్నదని రైల్వే ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అంటున్నారు. అధిక ఆదాయం వచ్చే వందే భారత్ రైళ్లకు ఉన్న ప్రేమ 'పేదోడి బండి'గా చెప్పుకునే ప్యాసింజర్ రైళ్లపై చూపడం లేదని విమర్శిస్తున్నారు.

15న సెక్రటేరియట్ ముట్టడి

- సీఎం రేవంత్‌రెడ్డిని నిరుద్యోగులే దించుతారు
- యూత్ డిక్లరేషన్ పేరుతో నిండాముంచిన కాంగ్రెస్
- విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షుడు రాజారాం యాదవ్
- ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ దీక్షకు మద్దతు
- అమరవీరుల స్థూపం వద్ద నిరుద్యోగుల నిరసన



గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన చేపట్టిన పలు సంఘాల నేతలు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు వైఖరికి నిరసనగా 15న నిరుద్యోగులతో సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య గౌరవ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ప్రకటించారు. తెలంగాణ నిరుద్యోగులను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి దగాచేసిన వైనాన్ని జాతీయస్థాయిలో ఎండగడతామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని నిరుద్యోగులే గద్దె దించుతారని స్పష్టం చేశారు. హైదరాబాద్ గాంధీ దవాఖానలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్‌కు మద్దతుగా శనివారం అసెంబ్లీ ఎదుట అమరవీరుల స్థూపం వద్ద నిరుద్యోగులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేసి గోషామహల్ స్టేడియానికి తరలించారు. ఈ సందర్భంగా రాజారాం యాదవ్ మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి నిరుద్యోగుల కోసం నిరాహార దీక్ష చేస్తున్న మోతీలాల్ ప్రాణహాని జరిగితే.. ప్రభుత్వమే బాధ్యత వహించాలని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలుపై ఉన్న శ్రద్ధ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ ఆరోగ్యంపై లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు రాహుల్‌గాంధీని అశోక్‌నగర్ చౌరస్తాలో టీ తాగించి, డ్రామాలాడించి, నిరుద్యోగులను రెచ్చగొట్టి వారి ద్వారా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు వారి పట్ల నిర్లక్ష్యం వహించడం అత్యంత హేయమని చర్యగా పేర్కొన్నారు. ఆ రోజు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, 2 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఇచ్చిన మాటను నేడు విస్మరించడాన్ని తప్పుబట్టారు. గ్రూప్-2లో 2,000, గ్రూప్-3లో 3,000 వరకు పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. డీఎస్సీలో టీచర్ పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని, రూ.4,000 నిరుద్యోగ భృతి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు సంజీవ నాయక్, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య అధ్యక్షుడు కొంపల్లి రాజు, తెలంగాణ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ, బీసీ జనసభ రాష్ట్ర నాయకుడు తొడంగి గోవర్ధన్, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ ముదిరాజ్, శ్రీకృష్ణ యాదవ సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

• డీఎస్సీ వాయిదా వేయాలి



ఖమ్మం నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద శనివారం నిరుద్యోగ అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. వందలాది మంది ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నోటిఫికేషన్‌లో ఉన్న పోస్టులకు అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ షెడ్యూల్‌ను మూడు నెలలపాటు వాయిదా వేయాలని, ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను ఈ డీఎస్సీలోనే కలపాలని డిమాండ్ చేశారు. - ఖమ్మం ఎడ్యుకేషన్

• ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల నిరసన



నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో శనివారం సాయంత్రం విద్యార్థులు నిరసన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఐటీలోని అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట బైఠాయించారు. తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టీఎస్ఏఎస్) ఏర్పాటు చేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాదాపు వంద మంది విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. - బాసర

• కరెంట్ కోతలను నిరసిస్తూ సబ్ స్టేషన్ ముట్టడి



సిరికొండ, జూన్ 29: కరెంట్ కోతలను నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా సిరికొండ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. కొంత కాలంగా విద్యుత్తు సమస్యలు వేధిస్తున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా కోతలు విధించడమేమిటని ప్రశ్నించారు. లో వోల్టేజీతో ఇండ్లల్లో ఫ్రిజ్‌లు, టీవీలు, మోటర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఏఈ చంద్రశేఖర్ స్పందిస్తూ త్వరలోనే విద్యుత్తు సమస్యను పరిష్కరిస్తామని, అవసరమైన చోట స్తంభాలు వేయిస్తామని హామీ ఇచ్చారు.

• 'గృహజ్యోతి'కి కష్టం



గృహజ్యోతి పథకం కోసం ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. గతంలో ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినా ఆన్‌లైన్‌లో నమోదు చేసినా వివరాలు సక్రమంగా లేకపోవడంతో చాలా మందికి జీరో కరెంట్ బిల్లుకు అర్హులు కాలేదు. మరోసారి ఈ పథకానికి లబ్ధిదారులు నేరుగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఉమ్మడి మండల వాసులు శనివారం ఎంపీడీవో కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం తర్వాత సర్వర్ ప్రాబ్లం ఏర్పడటంతో గంటల తరబడి క్యూలో నిలబడిన ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేశారు. - దేవరకద్ర

జీహెచ్ఎంసీలోకి కంటోన్మెంట్

- విలీనానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- సివిల్ ఏరియా ఆస్తులు, మౌలిక వసతులు బదిలీ
- కేసీఆర్ ప్రభుత్వ కృషికి ఫలితం



హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్29 (నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు జీహెచ్ఎంసీలో విలీనానికి మార్గం సుగమమైంది. బీఆర్ఎస్ హయాంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేసిన కృషికి ఫలితం దక్కింది. ఈనెల 25న కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో వీడియో కాన్ఫరెన్స్‌లో అభిప్రాయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కంటోన్మెంట్ విలీనానికి అంగీకరించడంతో రక్షణ శాఖ ప్రిన్సిపల్ డిప్యూటీ డైరెక్టర్ సదరన్ కమాండ్ హేమంత్ యాదవ్ కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రకారం కంటోన్మెంట్‌లోని సివిల్ ఏరియాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారు. అక్కడి ప్రజలకు నిర్దేశించిన సౌకర్యాలు, మౌలిక వసతులన్నీ ఉచితంగా జీహెచ్ఎంసీకి బదిలీ చేస్తారు. కంటోన్మెంట్ బోర్డుల ఆస్తులు, అప్పులన్నీ మున్సిపాలిటీకి బదిలీ అవుతాయి. మిలటరీ స్టేషన్ మినహా కంటోన్మెంట్‌లోని నివాస ప్రాంతాలకు జీహెచ్ఎంసీ పరిధి విస్తరిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సంప్రదింపులు జరిపి చర్యలు తీసుకోవాలని రక్షణశాఖ బోర్డు అధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం పేరిట ఉన్న భూములు, ఆస్తులు కేంద్రానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యులు సంయుక్తంగా నివృత్తి చేసి తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేంద్రం సూచించింది.



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ పాలకేంద్రం వద్ద క్యాన్లతో పాడి రైతుల నిరసన

పాల బకాయిలు చెల్లించాలని రాస్తారోకో

గోవిందరావుపేట/వెల్దండ, జూన్ 29 : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని జాతీయ రహదారిపై శనివారం పాల ఉత్పత్తిదారులు రాస్తారోకో నిర్వహించారు. గోవిందరావుపేట, తాడ్వాయి మండలాలకు చెందిన పాల ఉత్పత్తిదారులు పస్రాకు చేరుకొని జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకుడు సూరపనేని వెంకటసురేశ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాల ఉత్పత్తిదారులు రైతులకు ప్రభుత్వ ధర కంటే ఎక్కువ చెల్లిస్తున్నా పట్టించుకోకుండా, విజయ డెయిరీకి విక్రయిస్తున్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్ 15 రోజులకోసారి బిల్లులు చెల్లించేదని, పాల ఉత్పత్తిదారుల బాధలను చూసి లీటరుకు రూ.4 బోనస్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వం రెండు నెలలు కావొస్తున్నా బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నట్టు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలోని పాల కేంద్రం వద్ద రైతులు పాల క్యాన్లతో నిరసన తెలిపారు.

• మున్సిపల్ గది దాటని బతుకమ్మ చీరలు



బతుకమ్మ చీరల పంపిణీ విషయంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో మహిళలకు అందించేందుకు బతుకమ్మ చీరలు వచ్చినప్పటికీ పంపిణీ చేయకపోవడంతో మున్సిపల్ కార్యాలయం రెండో అంతస్తులోని ఓ గదిలో పేరుకుపోయాయి. గత బతుకమ్మ వేడుక సమయంలో మున్సిపల్ కార్యాలయానికి 16,490 చీరలు వచ్చాయి. అరకొర మాత్రమే పంపిణీ చేసి మిగతా వాటిని గదిలో నిల్వ ఉంచారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ స్పందిస్తూ.. గతేడాది బతుకమ్మ సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ చేయలేదని తెలిపారు. వీటిని జిల్లా కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. - వేములవాడ

• మేడిగడ్డకు వరద పోటు



మహదేవపూర్, జూన్ 29 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో లక్ష్మీ(మేడిగడ్డ) బరాజ్‌కు వరద పోటెత్తుతున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణహిత ప్రవాహం అంతకంతకూ పెరుగుతున్నది. శుక్రవారం ఇన్‌ఫ్లో 8,790 క్యూసెక్కులు, శనివారం 12 వేల క్యూసెక్కులుగా ఉన్నది. అంతేమొత్తంలో వరదను నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీ వరదల కారణంగా ఏడో బ్లాక్ వద్ద సీసీఎంఎంఆర్‌ఎస్ నిపుణులు చేపట్టిన పనులకు ఆటంకం ఏర్పడుతున్నది. వరదలకు ఏర్పడిన గుంతలు పూడ్చేందుకు భారీ యంత్రాలను ఒడ్డుకు చేర్చారు. బరాజ్‌లో 85 గేట్లను ఎత్తేశారు. వరద ప్రవాహం తీరును భారీ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ తిరుపతిరావు పరిశీలించారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

ఫిరాయింపులతో రాజకీయ అస్థిరత



జమలాపురపు విఠల్‌రావు

ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంత సహజమో.. విభిన్న రాజకీయ సిద్ధాంతాలు కలిగిన పార్టీలు ఉండటమూ అంతే సహజం. దేశాన్ని పాలించడానికి రాజకీయ పార్టీల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండటం ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదని చెప్పడానికి నిదర్శనం. విభిన్న రాజకీయ సిద్ధాంతాలకు రాజకీయ పార్టీలు నిర్దిష్టమైన రూపాన్నిస్తాయి. అయితే ఫిరాయింపు అనేది పార్టీ వ్యవస్థకు పట్టిన చీడపురుగు వంటిది. ఈ నేపథ్యంలో అమల్లో ఉన్న ఫిరాయింపు నిరోధక చట్టం.. కొన్ని పరిమిత పరిస్థితుల్లో మాత్రమే పార్లమెంట్, అసెంబ్లీల్లో రాజకీయ పార్టీలకు చెందిన చట్టసభ సభ్యులు, స్వతంత్ర లేదా నామినేటెడ్ సభ్యులపై అనర్హత వేటు పడకుండా పార్టీలు మారడానికి అనుమతిస్తుంది. సాధారణంగా ఒక సభ్యుడు తన మాతృపార్టీని వదిలిపెట్టి మరో పార్టీలో చేరే పరిస్థితినే 'ఫిరాయింపు' అని వ్యవహరిస్తారు. సంప్రదాయికంగా ఈ ఫిరాయింపును 'ఫ్లోర్ క్రాసింగ్' అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటగా బ్రిటిష్ దిగువ సభ (హౌజ్ ఆఫ్ కామన్స్) ప్రాచుర్యంలోకి తెచ్చింది.

మన దేశంలో పార్టీ ఫిరాయింపులు అతి మామూలు విషయంగా మారిపోవడమనేది ఎప్పటికప్పుడు రాజకీయ అస్థిరతకు దారి తీస్తున్నది. ఫలితంగా 'పరిపాలన'పై ఉండాల్సిన దృష్టిని 'ప్రభుత్వం'పై కేంద్రీకరించాల్సిన దుస్థితి నెలకొంటున్నది. 1960 ప్రాంతంలో ఈ పార్టీ ఫిరాయింపులు అత్యధికంగా చోటుచేసుకున్న నేపథ్యంలో 'ఆయారాం.. గయారాం' అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. మన దేశంలో ఫిరాయింపుల చరిత్ర బ్రిటిష్ పాలనా కాలం నుంచే ప్రారంభమైంది. సెంట్రల్ లెజిస్లేటివ్ సభ్యుడు శ్యాంలాల్ నెహ్రూ కాంగ్రెస్ పార్టీ నుంచి ఫిరాయించి బ్రిటిష్ వారికి మద్దతివ్వడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఫిరాయింపునకు మరో ఉదంతం చెప్పుకోవాలంటే.. ముస్లిం లీగ్ పార్టీ నుంచి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికైన హఫీజ్ మహమ్మద్ ఇబ్రహీం 1937లో కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. 1960 దాటిన తర్వాత దేశంలో సైద్ధాంతిక రాజకీయ నిబద్ధత స్థానంలో ఇతరత్రా అంశాలు చోటుచేసుకోవడం మొదలైంది. దేశంలో నాలుగవ సాధారణ ఎన్నికలు ముగిసిన తర్వాత ఏర్పాటైన చవాన్ కమిటీ 1969లో ఒక నివేదిక సమర్పించింది. దీని ప్రకారం మొదటి-నాలుగవ సాధారణ ఎన్నికల మధ్యకాలంలో అంటే రెండు దశాబ్దాలలో వివిధ రాష్ర్టాల్లో 542 ఫిరాయింపు కేసులు నమోదయ్యాయి. వీటిల్లో 438 ఫిరాయింపులు కేవలం 1967 మార్చి నుంచి 1968 ఫిబ్రవరి మధ్యకాలంలో జరిగినవేనని నివేదిక పేర్కొంది. ఆ సమయంలో 376 మంది స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికవగా.. వీరిలో 157 మంది వివిధ పార్టీల్లో చేరిపోయారు. పార్టీలు ఫిరాయించిన 210 మంది ఎమ్మెల్యేల్లో 116 మందికి మంత్రి పదవులు లభించాయంటే.. పదవీ వ్యామోహం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిరాయింపు నిరోధక చట్టం దిశగా అడుగులు

1967 ఆగస్టు 11న నాలుగవ లోక్‌సభలో పి.వెంకటసుబ్బయ్య అనే సభ్యుడు ఫిరాయింపులను నిరోధించాలంటూ ఒక ప్రైవేటు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై అదే ఏడాది నవంబర్ 24, డిసెంబర్ 8వ తేదీన లోక్‌సభలో చర్చ జరిగింది. అనంతరం తీర్మానాన్ని లోక్‌సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నేపథ్యంలో పార్టీ ఫిరాయింపులపై నాటి కేంద్ర హోంమంత్రి వైబీ చవాన్ నేతృత్వంలో అప్పటి ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేయగా.. 1969 ఫిబ్రవరిలో ఆ కమిటీ నివేదికను సమర్పించింది. ఫిరాయింపులను అదుపు చేయడానికి కమిటీ సూచనలు సరిపోవని భావించిన కేంద్ర సర్కార్.. 1973 మే 16న లోక్‌సభలో 32వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. రాజ్యాంగబద్ధంగా ఫిరాయింపులను నిరోధించాలన్నది ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. బిల్లును పార్లమెంట్ ఉభయసభల జాయింట్ కమిటీ పరిశీలనకు పంపారు. అయితే 1977 జనవరి 18న ఐదో లోక్‌సభ రద్దు కావడంతో ఈ కమిటీ ముగిసిపోయింది. 1978 ఆగస్టు 28న 48వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో దీన్ని లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. అధికార, విపక్ష సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం ఈ బిల్లును వెనక్కి తీసుకోకతప్పలేదు.

ఫిరాయింపు నిరోధక చట్టం - 1985

1985 జనవరి 24న లోక్‌సభలో 52వ రాజ్యాంగ సవరణ బిల్లు పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. దీని ప్రకారం రాజ్యాంగంలోని 101, 102, 190, 191 అధికరణాలను సవరించారు. దీంతో పాటు రాజ్యాంగంలో పదవ షెడ్యూల్‌ను చేర్చారు. ఫిరాయింపుల నేపథ్యంలో ఒక సభ్యుడు అనర్హతకు సంబంధించిన నిబంధనలను ఇందులో పొందుపరిచారు. 1985 జనవరి 30, 31వ తేదీల్లో వరుసగా లోక్‌సభ, రాజ్యసభలు ఈ బిల్లుకు ఆమోదం తెలిపాయి. ఈ చట్టం 1985 మార్చి 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ స్పీకర్, ఫిరాయింపునకు పాల్పడే లోక్‌సభ సభ్యుల అనర్హతకు సంబంధించిన నిబంధనలు రూపొందించారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ 8వ పేరాకు అనుగుణంగా రూపొందించిన ఈ నిబంధనలు 1986 మార్చి 18 నుంచి అమల్లోకి వచ్చాయి.



ఫిరాయింపు చట్టం (పదవ షెడ్యూలు)లోని ముఖ్యాంశాలు

నిబంధన-2: ఒక రాజకీయ పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యుడు స్వచ్ఛందంగా ఆ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నప్పుడు, పార్టీ ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేసినా లేదా తటస్థంగా ఉన్నా తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు. ఒకవేళ సభ్యుడు పార్టీ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నా లేక అతడు ఆ విధంగా వ్యవహరించిన తేదీ నుంచి పదిహేను రోజుల్లోగా పార్టీ అతడిని క్షమించినా సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడదు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన సభ్యుడు మరో పార్టీలో చేరితే లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు. ఒక నామినేటెడ్ సభ్యుడు ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే చట్టసభలో సభ్యత్వం పొందిన తేదీ నుంచి ఆరు నెలలు తన సభ్యత్వాన్ని కోల్పోతాడు.

నిబంధన-3: రాజకీయ పార్టీలో చీలిక వచ్చి రెండు గ్రూపులు ఏర్పడినప్పుడు వారిపై అనర్హత వేటు పడదు. ఒక రాజకీయ పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 1/3వ వంతు ఫిరాయించినప్పుడు వారిని పార్టీ చీలిక గ్రూపుగా పరిగణిస్తారు. అయితే ఈ నిబంధనను 2003లో చేపట్టిన 91వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

నిబంధనలు-4, 5: ఒక పార్టీ వేరొక రాజకీయ పార్టీలో విలీనమైనప్పుడు సదరు పార్టీ సభ్యులకు అనర్హత వర్తించదు. విలీనం తర్వాత కొత్త పార్టీ ఆవిర్భవించవచ్చు లేదా వీరంతా విలీనం చేసుకున్న పార్టీ సభ్యులుగా పరిగణనలోకి వస్తారు. విలీనమైన పార్టీకి చెందిన సభ్యుల్లో కొంతమంది ఆ విలీనాన్ని అంగీకరించకపోతే, వారు ఒక ప్రత్యేక గ్రూపుగా కొనసాగుతారు. విలీనమయ్యే పార్టీకి చెందిన సభ్యుల్లో 2/3వ వంతుకు తగ్గకుండా సభ్యులు అంగీకరించినప్పుడు మాత్రమే ఆ విలీనం ఆమోదం పొందుతుంది.

నిబంధన-6: ఒక సభ్యుడిపై అనర్హత వేటు విధించే విషయంలో స్పీకర్ లేదా చైర్మన్‌దే తుది నిర్ణయం.

91వ రాజ్యాంగ సవరణ చట్టం

2003 మే 5న అప్పటి ప్రభుత్వం 97వ రాజ్యాంగ సవరణ చట్టం- 2003 పేరుతో లోక్‌సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టింది. స్టాండింగ్ కమిటీ ఆన్ హోం ఎఫైర్స్ పరిశీలనకు ఈ బిల్లును పంపగా.. ఆ కమిటీ కొన్ని సిఫారసులను చేసింది. వీటిని బిల్లులో చేర్చి 2003, డిసెంబర్ 16న లోక్‌సభ, 18న రాజ్యసభ ఆమోదం తెలిపాయి. 2004 జనవరి 1న రాష్ట్రపతి ఈ బిల్లును 91వ రాజ్యాంగ సవరణ బిల్లు-2003గా ఆమోదం తెలిపారు. రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ చీలికకు సంబంధించిన నిబంధనను ఈ చట్టం తొలగించింది.

పదవ షెడ్యూల్‌లోని రెండవ పేరాలో పేర్కొన్న విధంగా ఒక సభ్యుడు అనర్హతకు గురైతే.. అతడు మంత్రి పదవి లేదా మరే విధమైన రాజకీయ పదవిని పొందడానికి వీల్లేదని ఈ బిల్లు స్పష్టం చేసింది. సదరు సభ్యుడు అనర్హతకు గురైన తేదీ నుంచి గడువు ముగిసే వరకు లేదా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు పోటీచేసే వరకు ఈ అనర్హత వర్తిస్తుంది.

వివిధ దేశాల్లో ఫిరాయింపులు

బ్రెజిల్, ఇటలీ, రొమేనియా, ఫిలిప్పీన్స్ దేశాల్లో పార్టీ ఫిరాయింపులు సర్వ సాధారణం. ఆస్ట్రేలియాలో 1916లో నేషనల్ లేబర్ పార్టీ చీలిపోయింది. 1931లో లాంగ్ లేబర్ పార్టీ, 1940 కమ్యూనిస్టేతర లేబర్ పార్టీ, 1955లో యాంటీ కమ్యూనిస్ట్ లేబర్ పార్టీల్లో చీలికలు వచ్చాయి. 2024 టాస్మేనియా రాష్ట్ర ఎన్నికల్లో పోటీ చేసిన లిబరల్ పార్టీ ప్రీమియర్ జెఫ్ రాక్లిఫ్ తమ పార్టీ అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపులను నిషేధిస్తూ రాష్ట్ర రాజ్యాంగంలో మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ దేశాల్లో అత్యధిక పార్టీ ఫిరాయింపులు చోటుచేసుకునేది ఇటలీలో! 1996-2001 మధ్యకాలంలో ఇటాలియన్ చాంబర్ ఆఫ్ డిప్యూటీస్ (దిగువసభ)లో 25 శాతం మంది సభ్యులు పార్టీలు ఫిరాయించారు. పార్టీ ఫిరాయింపులను మలేసియా తీవ్రంగా పరిగణిస్తుంది. ఈ మేరకు 2022లో రాజ్యాంగ సవరణ బిల్లు (నెం.3)ను దిగువ సభ దివాన్ రక్యాత్ 2/3 మెజారిటీతో ఆమోదించింది. న్యూజిలాండ్‌లో పార్టీ ఫిరాయింపును 'వాకా జంపింగ్' అని వ్యవహరిస్తారు. పార్టీ ఫిరాయింపుల నిరోధానికి ఎలక్టోరల్ (ఇంటెగ్రిటీ) అమెండ్‌మెంట్ యాక్ట్-2001 పేరుతో చట్టాన్ని తీసుకురాగా.. 2005 వరకు అది అమల్లో ఉంది. దీన్ని కొనసాగించే యత్నాలు 2005లో విఫలమయ్యాయి. చివరకు 2018లో ఈ చట్టాన్ని తిరిగి అమల్లోకి తెచ్చారు. రష్యన్ ఫెడరేషన్‌లో పార్టీ ఫిరాయింపులను చట్టవిరుద్ధంగా పరిగణిస్తారు. టర్కీలో పార్టీ ఫిరాయింపులు అసాధారణమేమీ కాదు. గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ (టర్కీ పార్లమెంట్)లో కుబిలే యుగేన్ అనే సభ్యుడు (1995-99) ఒకే టర్మ్‌లో ఏకంగా ఏడు సార్లు తన పార్టీకి రాజీనామా చేశారు. అంతేకాదు, నాలుగు పార్టీలు మారి, చివరకు స్వతంత్ర సభ్యుడిగా తన టర్మ్‌ను ముగించారు. ఉక్రెయిన్‌లో 'ఇంపరేటివ్ మ్యాండేట్' పేరుతో రాజ్యాంగ నిబంధన అమల్లో ఉంది. దీని ప్రకారం ఉక్రెయిన్ పార్లమెంట్ 'వర్ఖోవ్నా రాదా'కు ఎన్నికైన సభ్యులు తాము ఏ పార్టీ తరఫున ఎన్నికయ్యారో ఆ పార్టీ సభ్యులుగానే కొనసాగాల్సి ఉంటుంది. అమెరికాలో పార్టీ ఫిరాయింపులు చాలా అరుదు. 1947-97 మధ్యకాలంలో 20 మంది మాత్రమే పార్టీలు మారారు. దక్షిణ పసిఫిక్ సముద్ర ప్రాంతానికి చెందిన దేశం 'వనౌటు'లో 2024 మే 29న మొట్టమొదటిసారి పార్టీ ఫిరాయింపులపై ఒక రాజ్యాంగ పరమైన ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) జరిపారు. 59.28 శాతం మంది ప్రజలు పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకిస్తూ ఓటు వేయడం విశేషం. దీని ప్రకారం ఒక పార్టీ తరఫున ఎంపికైన పార్లమెంట్ సభ్యుడు, పార్టీ ఫిరాయిస్తే తన సీటు కోల్పోవాల్సి వస్తుంది.

పై అంశాలను పరిశీలిస్తే ప్రజాస్వామ్య దేశాల్లో కొన్ని ఈ పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా పరిగణిస్తుంటే, మరికొన్ని దేశాలు దీన్ని ఒక పెద్ద సమస్యగా చూడకపోవడం కనిపిస్తున్నది. కానీ, పార్టీ ఫిరాయింపుల వల్ల వివిధ దేశాల్లో ప్రభుత్వాలు కుప్పకూలిపోయిన సంఘటనలు కోకొల్లలు. అంతేకాదు, వీటి వల్ల ఒక రాజకీయ పార్టీ లేదా సభ్యులు తమ విశ్వసనీయతను కోల్పోతారనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్)

ఒక రాజకీయ పార్టీకి చెందిన లోక్‌సభ సభ్యుడు స్వచ్ఛందంగా ఆ పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నప్పుడు, పార్టీ ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటు వేసినా లేదా తటస్థంగా ఉన్నా తన లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోతాడు. ఒకవేళ సభ్యుడు పార్టీ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్నా లేక అతడు ఆ విధంగా వ్యవహరించిన తేదీ నుంచి పదిహేను రోజుల్లోగా పార్టీ అతడిని క్షమించినా సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడదు.

తెలంగాణ అస్తిత్వానికే ముప్పు

పాలకులెవరైనా తెలంగాణ ఆత్మగౌరవానికి క్షతి రాకూడదు. దశాబ్దాల పాటు అవమానాలపాలై తాడోపేడో తేల్చుకొనేలా కొట్లాడి, త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణ పట్ల అవకాశవాద రాజకీయ నేతల కారణంగా అస్తిత్వాన్ని కోల్పోకూడదు. స్వరాష్ట్రమంటే ఒక్క పాలనే కాదు, అడుగడుగునా తెలంగాణ భాష, సంస్కృతి, జీవన సరళి, జాతిగౌరవాలను నిలబెట్టుకోవడం. ఉమ్మడి పాలనలో తమ భాషను గేలి చేశారని ప్రజలు బాధపడ్డారు. బతుకమ్మను పట్టించుకోలేదని కలతచెందారు. ఇక సహించలేమని తెగించి, కొట్లాడి తెలంగాణను సాధించుకున్నారు.



బి.నర్సన్
94401 28169



స్వరాష్ట్రం సిద్ధించిన పదేండ్ల తర్వాత పాలనా పగ్గాలు కాంగ్రెస్ పార్టీ చేతిలోకి వెళ్లాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాల అమల్లో కొన్ని లోటుపాట్లు జరిగినందుకే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని పరిశీలకుల ఉవాచ. అలవికాని హామీలను ఆశచూపి, జనాన్ని మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారనేది కేసీఆర్ మాట. ఎవరి మాట ఎలా ఉన్నా.. ప్రజలు ఓట్లే పాలనను నిర్ణయిస్తాయి. అయితే పాలనతో పాటు తెలంగాణ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్నది. గత పదేండ్లలో తెలంగాణ కళలు, సాహిత్యం, సంస్కృతులకు తగిన ప్రాధాన్యం దక్కింది. ఈ విషయంలో కాంగ్రెస్ ఎంతో వెనుకబడి ఉంది. తెలంగాణ ప్రజలు ప్రాణప్రదంగా భావించే వీటి పట్ల ఆసక్తి, అవగాహన ఉన్న నాయకులు కాంగ్రెస్ పార్టీలో లేరనే చెప్పాలి. అందుకే తెలంగాణ గీతం ప్రకటించినప్పటికీ.. దానికి సినిమా వాళ్లతో బాణీలు కట్టించడం వల్ల స్థానికత తగ్గి, కృత్రిమం పెరిగిందని విమర్శలు వచ్చాయి. 'నాకేం తెలియదు.. అందెశ్రీయే ఆయనను కావాలన్నారు' అని సీఎం రేవంత్‌రెడ్డి చేతులు దులిపేసుకున్నారు. రాజకీయ ఎత్తుగడ తప్ప 'గీతం ఎలా ఉంటే బాగుంటుంది' అనే శ్రద్ధ ఆయన మాటల్లో కనిపించలేదు. రాష్ట్ర చిహ్నం మార్పు అంశమూ వివాదాస్పదమైంది. కాకతీయ తోరణం, చార్మినార్‌లను తొలగించాలన్న ఆలోచన దుమారంగా మారింది. చారిత్రక ఆనవాళ్లను రాచరిక చిహ్నాలంటూ సీఎం పేర్కొనడంపై పెద్ద రచ్చే జరిగింది. తెలంగాణ తల్లి విగ్రహంలోనూ రేవంత్‌రెడ్డి వంకలు తీశారు. అయితే ప్రభుత్వం చేపట్టిన మార్పులు ఒక కొలిక్కి రాకపోవడంతో అది త్వరగానే సద్దుమణిగింది. నేలపై నిజమైన ప్రేమానురాగాలు, చారిత్రక పరిజ్ఞానం ఉంటే తప్ప చిహ్నాలు ఎలా ఉండాలో తీర్మానించుకోలేరు.


సంస్కృతిపరంగానే కాకుండా తెలంగాణ ఉనికిని, స్వరాష్ట్ర పరమార్థాన్ని కోల్పోయే ప్రమాదాలు కూడా ప్రస్తుత పాలనలో పొడచూపుతున్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో సగం మందికి పైగా ఇతర పార్టీల నుంచి వచ్చినవారే. పది మంది దాకా పార్టీ పాతకాపులు ఉండవచ్చు. అయితే క్రమంగా వారికి కూడా గౌరవం తగ్గుతున్నది. నిఖార్సయిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డికి ఏ మాత్రం సమాచారం లేకుండానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లోకి రేవంత్ తీసుకోవడం ఆ పార్టీ సీనియర్లను విస్మయానికి గురిచేసింది. రేవంత్‌రెడ్డి వల్ల తమ ఉనికికే ప్రమాదం రావచ్చని వారు ఇప్పుడు బెంబేలెత్తిపోతున్నారు. 70 ఏండ్లు దాటి, ఎన్నికల్లో ఓడిపోయిన వారిని తమ వెంట ఉంచుకోవడం దండగ అనే ఆలోచన రేవంత్‌కు ఉండొచ్చు. పేరుకు కాంగ్రెస్‌లోనే ఉన్నా.. అసెంబ్లీలో అందరూ తనవాళ్లు ఉండాలనే ప్రణాళికతో ఆయన ముందుకెళ్తున్నారు. అందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. రేవంత్ పార్టీ చీఫ్ కూడా అయినందున ఆయనకు ఎదురే లేకుండాపోయింది. రేవంత్ మాట కాదని మరో సీనియర్‌కు పార్టీ చీఫ్ పదవి ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉన్నది. కొత్త చీఫ్, సీఎం మధ్య పొసగకపోతే రాష్ట్రంలో తమ పార్టీ పాలనకే గండం రావచ్చని అధిష్ఠానం పెద్దల భయం. తేడా వస్తే పార్టీని సీనియర్లకు వదిలేసి.. తనతో వచ్చే ఎమ్మెల్యేలను వెంటేసుకొని రేవంత్ సొంత ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశమూ ఉంది. అదే జరిగితే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న ఎమ్మెల్యేలందరూ ఆయనకు విధేయులుగా ఉంటారు. అందుకే సొంత బలం పెంచుకొనే దిశగా ఆయన అడుగులు పడుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రేవంత్‌రెడ్డి నెరవేర్చడం రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా అసాధ్యమే. ఈ విషయాన్ని గ్రహించిన జనం లోక్‌సభ ఎన్నికల్లో ఆయన వెంట నిలువలేదు. ఆరు నెలల కాలంలోనే ఫలితాలు తారుమారయ్యాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న చోట్ల కూడా బీజేపీ జెండా ఎగిరింది. కాంగ్రెస్‌కు సమానంగా కమలం పార్టీ కూడా 8 లోక్‌సభ స్థానాలను గెలిచింది. అంటే దానర్థం.. సగం రాష్ట్రం కమలం పార్టీకి జై కొట్టినట్టే. అదీగాకుండా బీజేపీ తరఫున గెలిచిన ఎంపీలు బలమైన నేతలు. రాష్ట్రంలో తమ పార్టీని బలోపేతం చేయడానికి వారు పూనుకుంటారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి, అమాత్యులు కావాలని వారు కలలు కంటారు. అదే సమయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను లాక్కోవడం ద్వారా వచ్చే టర్మ్ కూడా తానే సీఎం అయ్యేలా రేవంత్ ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్‌పై వ్యతిరేకత వస్తే.. బీజేపీతో చేతులు కలిపి తన పదవిని పదిలం చేసుకునే అవకాశాన్ని ఆయన సృష్టించుకుంటున్నారు.

ఈ రాజకీయ గందరగోళంలో తెలంగాణ ఎటుగాని స్థితిలోకి జారుతున్నది. ఉద్యమంలో పాల్గొనని ప్రస్తుత పాలకులు, ఉత్తరాది పెత్తనాన్ని ఎదిరించలేని బీజేపీ నేతల మధ్య తెలంగాణ తన ఆత్మగౌరవాన్ని కోల్పోయే ప్రమాదం ముంగిట నిలిచి ఉన్నది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి అంటే చంద్రబాబు.. చంద్రబాబు అంటే నరేంద్ర మోదీ. ఈ వాస్తవాన్ని బహిరంగంగా ప్రకటించేందుకు రేవంత్ వెనుకాడటం లేదు.

'నేను, చంద్రబాబు, నరేంద్ర మోదీ సర్కారు బడిలోనే చదువుకున్నాం' అని ఇటీవల రేవంత్ గొప్పగా అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న తెలంగాణ నాయకులు రేవంత్‌కు కానరాలేదా? బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో మాట్లాడుతూ.. 'చంద్రబాబు ఆదర్శనేత. కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల నేను, చంద్రబాబు విడిగా ఉండక తప్పడం లేదు' అని రేవంత్ చెప్పారు. ఈ మాటలన్నీ వింటుంటే.. 'ఎవరి పాలయిందిరా తెలంగాణ' అని అనిపించకపోదు. తెలంగాణ చరిత్ర, అస్తిత్వం, ప్రజల ఆత్మగౌరవం పట్ల పాలకులకు స్పృహ ఉండాలి. లేదంటే వారు ఈ నేలపై పుట్టినా పరాయివాళ్ల కిందే లెక్క. అందుకే కష్టపడి సాధించుకున్న తెలంగాణ దారితప్పిపోకుండా ప్రజలు గమనిస్తూ ఉండాలి. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాలి.

ప్రజలు కోపంతో ఉన్నారు!

మణిపూర్ అల్లర్లను అదుపు చేయడంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరు కారణంగా ప్రజలు నాపై కోపంతో ఉన్నారని తెలుసు. అది నేను అంగీకరిస్తా. పరిస్థితి సంక్లిష్టంగానే ఉన్నది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా కొనసాగాలా? పదవికి రాజీనామా చేయాలా? అనేది నా చేతుల్లో లేదు. - బీరేన్‌సింగ్, మణిపూర్ ముఖ్యమంత్రి



నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) చుట్టూ ముసురుకున్న వివాదం మన దేశంలో డాక్టర్ కావాలని కలలుగనే విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్లో ఒక భాగం మాత్రమే. అత్యంత విలువైన వైద్య సీటు పొందడం దగ్గర నుంచి వారు వైద్య విద్యను పూర్తిచేసేంత వరకు ఎదుర్కొనే ఆర్థికపరమైన సవాళ్ల గురించి చెప్పడమే ఈ వ్యాసం ఉద్దేశం.

కోట్లుంటేనే తెల్ల కోటు!



సోనాలి



భారత్‌లో వైద్యుడు-జనాభా నిష్పత్తి 0.9:1000గా ఉన్నది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలు 1:1000కు ఇది దగ్గరగా ఉన్నది. అయినప్పటికీ భారత్‌లో డాక్టర్ కావాలనుకునేవారి ప్రయాణం అడ్డంకులతో కూడుకున్నది. దేశంలో లక్షకు పైగా వైద్య విద్య (ఎంబీబీఎస్) సీట్లు ఉండగా.. వాటి కోసం ఏటా లక్షల మంది పోటీ పడుతుంటారు. అదీగాకుండా మొత్తం సీట్లలో ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లు సగమే కావడం గమనార్హం. అయితే వీటిలోనూ చాలా సీట్లను వివిధ కోటాల రూపంలో కేటాయిస్తారు. దీంతో అర్హత ఉన్న అనేకమంది విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతున్నారు.

ఈ క్రమంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన అంశం ఎంతో భయానకంగా ఉంటుంది. దేశంలోని అనేక ప్రైవేట్ వైద్య కళాశాలల్లో మొత్తం కోర్సు ఫీజు రూ.కోటి వరకు ఉంటుంది. ఈ అంశం పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల వైపు దృష్టి చూసే అవకాశం లేకుండా చేస్తున్నది.

నీట్ విషయంలో రాజుకున్న కొత్త వివాదం జాతీయ అర్హత పరీక్షల నిర్వహణ పట్ల అధికారుల సామర్థ్యాలపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు విలువైన సమయం, ఇతర వనరులను కేటాయించిన లక్షల మంది విద్యార్థులపై ఈ వివాదం తీవ్ర ప్రభావం చూపుతున్నది.

భారత్‌లో తెల్ల కోటు, స్టెతస్కోపు వేసుకోవాలనే కల ఎంతో ఖర్చుతో కూడుకున్నది. డాక్టర్ కావాలనుకునేవారికి అంకితభావం మాత్రమే ఉంటే సరిపోదు, గణనీయమైన ఆర్థిక పెట్టుబడులు కూడా అవసరం. ఈ ప్రయాణం కోచింగ్ ఖర్చుతో ప్రారంభమవుతుంది. ఆకాశ్, అలెన్, విద్యామందిర్.. ఇలా ఇన్‌స్టిట్యూట్‌లను బట్టి కోచింగ్ ఫీజు రూ.1.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ఉంటుంది. ప్రాంతం, ఇన్‌స్టిట్యూట్ ఎంపిక, అక్కడి వసతులు, బోధన సిబ్బంది నైపుణ్యం తదితర అంశాలు కోచింగ్ ఫీజును ప్రభావితం చేస్తాయి.

భారత్‌లో మొత్తం 600కు పైగా వైద్య కళాశాలలు ఎంబీబీఎస్ కోర్సును అందిస్తున్నాయి. అయినప్పటికీ వైద్య విద్యకు పోటీ తీవ్రంగానే ఉన్నది. 2024లో నీట్-యూజీ పరీక్షకు 23 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో అత్యధికులు తక్కువగా ఉండే ప్రభుత్వ మెడికల్ సీట్లపైనే గురిపెట్టారు. రాయితీనిచ్చే ప్రభుత్వ కళాశాలలు దేశవ్యాప్తంగా 386 మాత్రమే ఉండగా.. వాటిలో 55,095 సీట్లు మాత్రమే ఉన్నాయి. అంటే ఈ లెక్కన ఒక్కో సీటు కోసం సుమారుగా 42 మంది పోటీ పడుతున్నారు. అయితే దేశంలోని మొత్తం 320 ప్రైవేట్ కళాశాలల్లో 53,625 సీట్లున్నాయి. కానీ, వాటిలో ఉండే అధిక ఫీజుల కారణంగా అవి చాలామందికి అందుబాటులో లేకుండాపోతున్నాయి.

ప్రభుత్వ కళాశాలలు చాలా తక్కువగా ఏడాదికి రూ.5 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తాయి. వసతులు, పేరుప్రఖ్యాతులను బట్టి ప్రైవేట్ కళాశాలలు ఏడాదికి రూ.12 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఫీజు వసూలు చేస్తాయి. ఒడిశాలో ఉన్న కళింగ మెడికల్ కళాశాలలోని ఓ విద్యార్థి తాను ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన ఒత్తిడి గురించి ఇలా చెప్పుకొచ్చారు. 'నేను కళాశాలలో చేరినప్పుడు ఏడాది ట్యూషన్ ఫీజు రూ.12 లక్షలు మాత్రమే. కానీ, ఇప్పుడు అది రూ.16 లక్షలు. ఇతర ఖర్చులు అదనం. ఐదేండ్ల కోర్సు పూర్తయ్యే సరికి విద్యార్థుల తల్లిదండ్రులు రూ.80 లక్షల వరకు కట్టాల్సి వస్తుంది. కొన్నిసార్లు అది రూ.కోటికి పైనే ఉండొచ్చు' అని అతను పేర్కొన్నారు.

మౌలిక వసతులు, ఫ్యాకల్టీ నైపుణ్యాలను కారణంగా చూపుతూ తమ కళాశాలల్లో ఉండే భారీ ఫీజులను ప్రైవేట్ కళాశాలలు సమర్థించుకుంటున్నాయి. అయితే దీని వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతున్నది. అదే సమయంలో ప్రభుత్వ కళాశాలలు అతి తక్కువ ఫీజులే వసూలు చేస్తూ వైద్య విద్యను ప్రోత్సహిస్తున్నాయి.

దేశంలో పెరుగుతున్న వైద్య విద్య ఫీజులు మన విద్యార్థులు ప్రత్యామ్నాయంగా విదేశాల వైపు చూసేలా చేస్తున్నది. రష్యా, కజకిస్థాన్, కిర్గిస్థాన్, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్ తదితర దేశాలు చాలా తక్కువ మొత్తానికే వైద్య విద్యను అందిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం నివేదిక ప్రకారం.. విదేశాల్లో వైద్య విద్య అభ్యసిస్తున్న మన విద్యార్థుల సంఖ్య 2015లో 3438 ఉండగా.. 2019 నాటికి 12,321కి చేరుకున్నది. బంగ్లాదేశ్‌లో వైద్య విద్యకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఖర్చవుతుంది. ఫిలిప్పీన్స్‌లో రూ.35 లక్షలు మాత్రమే. అదే రష్యాలో అయితే హాస్టల్ ఖర్చులతో సహా కలిపి రూ.20 లక్షల్లోనే మెడిసిన్ పూర్తి చేసుకోవచ్చు. మన దేశంలో ఇదే విధంగా వైద్య విద్య ఖర్చులు క్రమంగా పెరుగుతూపోతే.. తమ కలను నిజం చేసుకునేందుకు అర్హులైన అనేకమంది విద్యార్థులు విదేశాల బాటపట్టడం ఖాయం.

('బిజినెస్ టుడే' సౌజన్యంతో)



బానోత్ బాలు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- వ్యవసాయ బావి తీయడానికి 5 లక్షల అప్పు
- 3 ఎకరాల్లో దిగుబడి రాక నష్టం
- భూమి అమ్మినా తీరని అప్పులు
- మనస్తాపంతో గడ్డిమందు తాగి బలవన్మరణం

నెల్లికుదురు, జూన్ 29 : అప్పుల బాధ మరో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. హేమ్లాతండా శివారు బోడ్యాతండాకు చెందిన బానోత్ బాలు (50) తనకున్న మూడు ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంట సాగుతోపాటు వ్యవసాయ బావి తవ్వించడానికి తండావాసుల వద్ద రూ.5 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పు ఇచ్చిన వాళ్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడుగుతుండడంతో తనకున్న 3 ఎకరాల భూమి నుంచి 25 గుంటలను విక్రయించాడు. అయినా, అప్పు తీరకపోవడం, పంట దిగుబడి కూడా రాకపోవడంతో కొంతకాలంగా మనోవేదన చెందుతున్నాడు. శుక్రవారం వ్యవసాయ బావి వద్దకు వెళ్లి గడ్డిమందు తాగి, విషయాన్ని తన పెద్ద కొడుకు బానోత్ నవీన్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉన్న నవీన్ వెంటనే తన తమ్ముడు ప్రవీణ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతడు వచ్చి మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం సాయంత్రం మృతి చెందాడు. కొడుకు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



డీఎస్ భౌతికకాయంపై కాంగ్రెస్ జెండా కప్పుతున్న డిప్యూటీసీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

మాజీమంత్రి డీఎస్ కన్నుమూత

- ఇంట్లోనే గుండెపోటుతో మృతి
- పీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా సేవలు
- మోదీ, రేవంత్, కేసీఆర్ సంతాపం
- అధికారిక లాంఛనాలతో నేడు నిజామాబాద్‌లో అంత్యక్రియలు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ (76) కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం ఉదయం గుండెపోటుతో బంజారాహిల్స్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. డీఎస్ భౌతికకాయానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్లురవి, కాంగ్రెస్ సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, వీ హన్మంతరావు, మధుయాష్కీగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్, జీ నిరంజన్ నివాళులర్పించారు.

ప్రముఖుల సంతాపం

డీఎస్ మృతిపై ప్రధాని మోదీ ట్విట్టర్‌లో సంతాపం తెలిపారు. ఆయన మరణం తనను ఎంతో బాధించిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. డీ శ్రీనివాస్ మరణంపై బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ మాజీ సీఎం జగన్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, ప్రజాశాంతి సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తదితరులు తమ సంతాపాన్ని వ్యక్తపరిచారు.

ఆదరించిన కేసీఆర్..

దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేసిన డీఎస్‌ను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసింది. ఆయనకు ఏ పదవీ ఇవ్వకుండా దూరం పెట్టింది. ఈ క్రమంలోనే అప్పటి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేరదీశారు. బీఆర్‌ఎస్‌లో ఆయనకు తగిన గౌరవం ఇచ్చారు. 2016లో రాజ్యసభ సభ్యుడ్ని చేశారు. ఆ తర్వాత కొన్ని కారణాలతో బీఆర్‌ఎస్‌కు డీఎస్ దూరమయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలోనే ఆయన కొడుకుల్లో ఒకరు కాంగ్రెస్‌లో, మరొకరు బీజేపీలో కొనసాగడం విశేషం. 2022లో ఎంపీ పదవి ముగిసిన తర్వాత కాంగ్రెస్ గూటికి చేరిన డీఎస్, పక్షవాతంతో ఇంటికే పరిమితమయ్యారు.

అజాత శత్రువు డీఎస్ : కేటీఆర్, హరీశ్

డీఎస్ భౌతికకాయానికి కేటీఆర్, హరీశ్ నివాళులర్పించి మాట్లాడారు. రాజకీయాల్లో అజాతశత్రువు డీ శ్రీనివాస్ అని, డీఎస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. డీఎస్ మరణం రాష్ట్రానికి తీరని లోటు అని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు.

నేడు అంత్యక్రియలు

డీ శ్రీనివాస్ అంత్యక్రియలను ఆదివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికారులకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ నుంచి డీఎస్ భౌతికకాయాన్ని శనివారం సాయంత్రం ఆయన స్వస్థలం నిజామాబాద్‌కు తరలించారు.

నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం..

నిజామాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లోని సాధారణ వ్యవసాయ కుటుంబంలో 1948, సెప్టెంబర్ 27న జన్మించిన ధర్మపురి శ్రీనివాస్ ఉన్నత విద్యను అభ్యసించారు. రాజకీయాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో కార్యకర్తగా చేరారు. 1989లో తొలిసారిగా నిజామాబాద్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1994లో ఓడిపోయినా 1999, 2004లో వరుసగా గెలిచారు. 2004లో పీసీసీ అధ్యక్షుడిగా సేవలందించి, వైఎస్ క్యాబినెట్‌లో గ్రామీణాభివృద్ధి, ఉన్నత విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 2009లోనూ డీఎస్‌కు పార్టీ అధిష్ఠానం పీసీసీ పీఠాన్ని కట్టబెట్టింది. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో ఓటమి పాలై ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైన ఆయన, స్వరాష్ట్రంలో 2014 జూన్ 3 నుంచి 2015, జూలై 2 దాకా శాసనమండలిలో తొలి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరించారు.

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ కన్నుమూత



జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, ఎంపీగా సేవలు

ఆదిలాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు రాథోడ్ రమేశ్ (57) శనివారం కన్నుమూశారు. ఉదయం అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆదిలాబాద్ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. ఆయన కోమాలోకి వెళ్లడంతోపాటు ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా గుండెపోటుతో మార్గమధ్యంలో ఇచ్చోడ వద్ద మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం తాడిహత్నూర్‌కు చెందిన రాథోడ్ రమేశ్ వ్యవసాయ కుటుంబానికి చెందిన వారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఆయన సుదీర్ఘంగా 35 ఏండ్లు రాజకీయాల్లో ఉన్నారు. 1989లో నార్నూర్ జడ్పీటీసీగా గెలిచారు. 1999లో టీడీపీ నుంచి ఖానాపూర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. 2006లో ఆసిఫాబాద్ నుంచి జడ్పీటీసీగా గెలిచిన రాథోడ్ రమేశ్ ఉమ్మడి ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 2009లో టీడీపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్, ఎంపీగా ఆయన ప్రజలకు విశేష సేవలు అందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆదివారం ఉట్నూర్ ఎక్స్‌రోడ్‌లోని ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

వీసీ పోస్టుల్లో బీసీలను నియమించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్



రవీంద్రభారతి, జూన్ 29: యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నియామకాల్లో బీసీలకు 50 శాతం పోస్టులు ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీలలో 2400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ప్రభుత్వరంగ, ఇతర సంస్థల చైర్మన్, డైరెక్టర్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్నట్టు బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. 100 గురుకుల పాఠశాలలు, 50 ఇంజినీరింగ్ కాలేజీలు, రెండు యూనివర్సిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నేత నీల వెంకటేశ్, సి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల పంటలకూ డ్రిప్

- ఈ ఏడాది మొత్తం 1.70 లక్షల ఎకరాలు టార్గెట్
- ఆయిల్‌పామ్‌తో పాటు ఉద్యాన పంటలకు ఇవ్వాలని నిర్ణయం

హైదరాబాద్, జూన్ 29(నమస్తే తెలంగాణ): బిందుసేద్యం కింద డ్రిప్, స్ప్రింక్లర్లను ఇకపై ఆయిల్‌పామ్‌తో పాటు కూరగాయలు, పండ్లతోటలకు కూడా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2024-25 సంవత్సరానికి ఉద్యానశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ ఏడాది మొత్తం రూ. 509 కోట్ల ఖర్చుతో 1.70 లక్షల ఎకరాలకు డ్రిప్, స్ప్రింక్లర్లను అందించేలా ప్రణాళికను రూపొందించింది. ఇందులో లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్ కోసం డ్రిప్‌ను అందించనుండగా 70,625 ఎకరాల్లో కూరగాయలు, పండ్లు, ఇతర వ్యవసాయ పంటలకు కూడా డ్రిప్, స్ప్రింక్లర్ ఏది అవసరమైతే అది అందించనుంది. తొలిదశలో 85,313 ఎకరాలకు బిందుసేద్యం పరికరాలు అందించాలని నిర్ణయించింది. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న రైతులకు ముందుగా అందించాలని నిర్ణయించింది.



వనమహోత్సవం ప్రారంభోత్సవంలో భాగంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పొగడ మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తదితరులు

హెరిటేజ్ సిటీగా వరంగల్

- స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- ఔటర్, ఇన్నర్ రింగురోడ్ల భూసేకరణకు నిధులు
- హాస్పిటల్ భవన నిర్మాణ ఖర్చుపై ఫోరెన్సిక్ ఆడిట్
- గడువులోపు పూర్తికి నిర్మాణ సంస్థకు ఆదేశం
- వరంగల్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరంగల్, జూన్29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హెల్త్, ఎకో టూరిజం సిటీగా వరంగల్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో శనివారం సీఎం పర్యటించారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. హనుమకొండ సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులపై మంత్రులు, వరంగల్ ఉమ్మడి జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వరంగల్ సమగ్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్(2050)ను రూపొందించాలని అధికారులకు సూచించారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లకు నిర్మాణాలకు భూసేకరణ పూర్తి చేయాలని సూచించారు. స్మార్ట్ సిటీ మిషన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డీపీఆర్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో భూములు కోల్పోయిన రైతులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ అభివృద్ధిపై 20 రోజులకు ఒకసారి ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, 45 రోజుల్లో మరోసారి తాను సమీక్ష నిర్వహిస్తానని సీఎం చెప్పారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ.518 కోట్ల71లక్షల 20వేల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు.

నిర్మాణ వ్యయంపై ఆగ్రహం

వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన నిర్మాణ అంచనా వ్యయం రూ.1100 కోట్ల నుంచి రూ.1726 కోట్లకు ఎందుకు పెరిగిందని అధికారులను సీఎం రేవంత్ ప్రశ్నించారు. ఈపీసీ పద్ధతిన పనులు చేయడుతున్నందున అలా పెంచే వీలులేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్పిటల్ భవన నిర్మాణ ఖర్చుపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందేనని నిర్మాణ సంస్థకు తేల్చి చెప్పారు.

మెగా పార్కులో వనమహోత్సవం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో పొగడ మొక్క నాటి రాష్ట్రస్థాయిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంత్రులు సురేఖ, సీతక్క, రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీలు కావ్య, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, ప్రకాశ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి, మురళీనాయక్, ఎమ్మెల్సీలు సారయ్య, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మేయర్ గుండు సుధారాణి, టెస్కాబ్ చైర్మన్ ఎం రవీందర్ రావు, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవి గుప్తా, పీసీసీఎఫ్ రాకేశ్‌మోహన్ డోబ్రియల్, కలెక్టర్లు పాల్గొన్నారు.

వినతులు స్వీకరించలేదు

హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సీఎం వస్తారని తెలుసుకుని ప్రజలు వినతి పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ సమీక్ష నుంచి బయటికి వచ్చిన సీఎం, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు వెంటనే ప్రభుత్వ బస్సులోకి ఎక్కారు. తమ వినతిపత్రాలను ఎవరూ తీసుకోకపోవడంతో కొందరు వాటిని బస్సుపై విసిరేశారు. సీఎంను కలిసేందుకు వచ్చిన 108 సిబ్బందిని కలెక్టరేట్ ఆవరణలోకి అనుమతించలేదు.

నిర్బంధాలు.. నిరసనలు

హనుమకొండ/సుబేదారి/రామిర/వరంగల్: సీఎం పర్యటన నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని, కార్యకర్తలను హనుమకొండలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. హౌస్ అరెస్టయిన వారిలో రాకేశ్‌రెడ్డితో పాటు 2వ డివిజన్ కార్పొరేటర్ రవి నాయక్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఉన్నారు. బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు ఎనిమిది మందిని సుబేదారి, ఇద్దరిని హనుమకొండ, ఐదుగురిని కేయూ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సీఎం పర్యటనను అడ్డుకుంటామన్న కేయూ విద్యార్థులను కేయూ పోలీసులు అరెస్ట్ చేశారు. నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న మా నిర్వాసితులను అరెస్టు చేయడంతో పోలీస్‌స్టేషన్ లోనే వారు నిరసన తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సందర్శన సమయంలో ఎదురుగా ఉన్న సెంట్రల్ లైబ్రరీలో గ్రూప్స్‌కు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నిరుద్యోగులు రోడ్డుపైకి రాకుండా పోలీసులు లైబ్రరీ గేటుకు తాళం వేశారు.

ఎమ్మెల్యే దొంతి దూరం..దూరం

సీఎం పర్యటనకు సొంత పార్టీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దూరంగా ఉన్నారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి రెండోసారి గెలిచిన దొంతి మాధవరెడ్డి సీఎం సమీక్ష సమావేశానికి హాజరు కాలేదు. పార్టీ కోసం పని చేసిన వారికి కాదని, కొత్తగా వచ్చిన వారికి మంత్రి పదవులు ఇచ్చారని మాధవరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టి నుంచి దొంతి మాధవరెడ్డి దూరంగానే ఉంటున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు రేవంత్‌రెడ్డిని ఒక్కసారి కూడా దొంతి మాధవరెడ్డి కలవలేదని తెలిసింది.



వికారాబాద్ జిల్లా నవాబుపేటలో కాలెయాదయ్య చేరికను నిరసిస్తూ ఆమరణ దీక్షకు కూర్చున్న కాంగ్రెస్ నేతలను తీసుకెళ్తున్న పోలీసులు

యాదయ్య చేరికపై కాంగ్రెస్ నేతల నిరసన దీక్ష

నవాబుపేట, జూన్ 29: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేర్చుకోవడంపై కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి పునరాలోచించుకోవాలని డిమాండ్ చేస్తూ వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకుడు కొండల్ అనుచరులతో కలిసి తహసీల్ కార్యాలయం పక్కనే ఆమరణ దీక్ష ప్రారంభించారు. పోలీసులు అక్కడి వచ్చి కాంగ్రెస్ నేతలను తరలించారు.

కొండగట్టులో ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



కొండగట్టులో పూజలు చేస్తున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

మల్యాల, జూన్ 29: జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్నను ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శనివారం దర్శించుకున్నారు. పవన్‌కు ఆలయ ఈవో ఆకునూరి చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యుడు కపీంద్రస్వామి నేతృత్వంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాకార మండపంలో అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. టీటీడీ నుంచి నిధులు కేటాయించి 100 గదుల ధర్మశాలను నిర్మించాలని, ఒకేసారి 2వేల మందితో దీక్షవిరమణ చేసేలా మండపం నిర్మించేందుకు చొరవ చూపాలని పవన్‌కల్యాణ్‌కు ఈవో వినతిపత్రాన్ని అందజేశారు. కొండగట్టుకు అధిక సంఖ్యలో అభిమానులు చేరుకోగా, రూఫ్‌టాప్‌పై నుంచే పవన్ అభివాదం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యనారాయణ, ఆర్డీవో మధుసూదన్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఎస్పీ రఘుచందర్, ఆనంద్‌సాయి, ఆలయ ఏఈవో వైరాగ్యం అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, శ్రీనివాసశర్మ, తహసీల్దార్ ఉన్నారు.

ఇంకా 2.3 లక్షల పెండింగ్ దరఖాస్తులా?

- రెండు వారాల్లో పరిష్కరించినవి 21 వేలేనా?
- కలెక్టర్లపై సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం నత్తనడకన సాగడంపై సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ధరణిలో 2.3 లక్షలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు వెల్లడించారు. జూన్ 14న వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, వారం రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించామని గుర్తుచేశారు. రెండు వారాలు గడిచినా 21 వేల దరఖాస్తులే పరిష్కారమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ల స్థాయిలో 12 వేలు, అదనపు కలెక్టర్ల స్థాయిలో 20 వేలు, ఆర్డీవోల స్థాయిలో 58 వేలు, తాసీల్దార్ల స్థాయిలో 1.4 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు, తాసీల్దార్లతో నవీన్ మిట్టల్ నేరుగా మాట్లాడి.. ఎందుకు ఆలస్యం అవుతున్నదో ఆరా తీశారు. ధరణి సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. త్వరలో మరోసారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని, ఆలోగా పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని నవీన్ మిట్టల్ స్పష్టం చేసినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తాసీల్దార్లు కూడా పాల్గొన్నారు.

విద్యావైద్యంతోనే విశ్వనగర ఖ్యాతి

- ఇప్పటికే ఆ ఘనత సాధించిన హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి
- హనుమకొండలో మెడికవర్ హాస్పిటల్ ప్రారంభం



హనుమకొండలో మెడికవర్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

న్యూశాయంపేట, జూన్ 29 : విద్య, వైద్యం, విద్యుత్తు అందుబాటులో ఉంటే విశ్వనగరంగా అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే హైదరాబాద్ ఆ మేరకు అభివృద్ధి చెందిందని తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లో మెడికవర్ హాస్పిటల్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు దామోదర రాజనర్సింహ, సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య రంగాన్ని విస్తరించాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఇక్కడ మెడికవర్ హాస్పిటల్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉన్నదని అన్నారు. ఫార్మా విషయంపై ఎప్పుడు చర్చకు వచ్చినా అందులో హైదరాబాద్‌కు స్థానం ఉంటుందని తెలిపారు. తెలంగాణను మెడికల్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. రాష్ట్రం లో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జీ అనిల్ కృష్ణ మాట్లాడుతూ దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ హాస్పిటల్ చైన్‌గా ప్రస్తుతం 24 దవాఖానలను నిర్వహిస్తూ, ఏటా లక్షలాది మందికి వైద్య సేవలను అందిస్తున్నట్టు తెలిపారు. అత్యంత నిష్ణాతులైన 40 మందికి పైగా డాక్టర్లతోపాటు ప్రపంచస్థాయి క్యాత్‌ల్యాబ్ ఇక్కడ అందుబాటులో ఉంటుందని చెప్పారు. మెడికవర్ హాస్పిటల్స్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ ఏ శరత్‌రెడ్డి, పీ హరికృష్ణ మాట్లాడుతూ వరంగల్‌లో 300 పడకలతో ఏర్పాటు చేసిన ఈ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఏడు ఆపరేషన్ థియేటర్స్‌తోపాటు పెద్ద సంఖ్యలో ఐసీయూ బెడ్స్ ఉన్నాయని తెలిపారు.


ఎన్‌హెచ్ నిర్మాణంలో అక్రమాలపై ఏసీబీ విచారణ

- నలుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, 29 (నమస్తే తెలంగాణ): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ రహదారి నిర్మాణంలో జరిగిన అక్రమాలపై శనివారం ఏసీబీ అధికారులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వరంగల్‌లో ఆర్డీవో దత్తు, ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో డిప్యూటీ తహసీల్దార్ నాగోరావు, హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారి లక్ష్మీనారాయణగౌడ్, ఆసిఫాబాద్‌లో వ్యాపారి కందూరాన్‌ను అదుపులోకి తీసుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. రెబ్బెన మండలం రేపల్లెవాడ నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు 54 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం కోసం జరిగిన భూసేకరణలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏసీబీ అధికారులు రెండు నెలలుగా విచారణ చేస్తున్నారు. ఆరేండ్ల క్రితం రహదారి నిర్మాణానికి దాదాపు 320 హెక్టార్ల భూమిని సేకరించారు. భూ పరిహారం చెల్లింపుల్లో జరిగిన అవినీతిపై బాధితులు ఫిర్యాదు చేయగా, ఏప్రిల్ 24న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయం నుంచి రికార్డులు స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. పరిహారం చెల్లింపుల్లో అవినీతికి పాల్పడిన ఏడుగురిని గుర్తించిన అధికారులు ఇంకా విచారణ కొనసాగిస్తున్నారు.

ఆ ఐదు గ్రామాలను తెలంగాణకు అప్పగించాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మంలో నిర్మించనున్న రహదారుల మ్యాప్‌ను చూపుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): భద్రాచలం మండలంలోని ఐదు విలీన గ్రామాలను తిరిగి తెలంగాణకు అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వరద ముంపునకు ఏమాత్రం సంబంధం లేని ఆ గ్రామాలను తిరిగి భద్రాచలం మండలంలో కలపాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. శనివారం ఆయన ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విభజన హామీలు, తెలంగాణకు రావాల్సిన ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎప్పుడు చర్చ జరిగినా విలీన గ్రామాలను తిరిగి ఇచ్చే విషయాన్ని ప్రధాన అంశంగా చర్చిస్తామని చెప్పారు. ఈ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం వల్ల, దినదినాభివృద్ధి చెందుతున్న భద్రాచలం పట్టణానికి డంపింగ్ యార్డు కూడా లేని పరిస్థితి ఏర్పడిందని, చెత్త ఎక్కడ పోయాలో కూడా తెలియని దుస్థితి తలెత్తిందని అన్నారు.

ట్రాన్స్‌కో సీజీఎంలు సీఈలుగా మార్పు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ట్రాన్స్‌కోలో చీఫ్ జనరల్ మేనేజర్ల (సీజీఎం)ను చీఫ్ ఇంజినీర్లుగా మార్చుతూ టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌ఫారూఖీ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇంజినీరింగ్ సర్వీస్‌లోని చీఫ్ జనరల్ మేనేజర్లను చీఫ్ ఇంజినీర్లుగా గుర్తించడంలో ఇతర శాఖల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 6వ స్థానంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ అధికారులు సీజీఎం క్యాడర్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో సీజీఎంలను సీఈలుగా మార్చుతున్నట్టు సీఎండీ పేర్కొన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కోని కేంద్ర కార్యాలయంలో పనిచేసే ఇంజినీరింగ్ హెడ్స్, ఫీల్డ్ ఆఫీసుల్లో పనిచేసే జోనల్ హెడ్స్ ఇకపై చీఫ్ ఇంజినీర్లుగా పరిగణించబడుతారని వెల్లడించారు. విధులు, బాధ్యతలు, ప్రతినిధి బృందంలో ఎలాంటి మార్పులు ఉండబోవని స్పష్టంచేశారు.

సిమ్ కార్డ్ రీప్లేస్‌మెంట్‌కు కొత్త రూల్స్

రేపటి నుంచి అమలు చేయనున్న ట్రాయ్



న్యూఢిల్లీ: మొబైల్ నంబర్ పోర్టబిలిటీ నిబంధనలకు చేసిన సవరణలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సిమ్ స్వాప్, రీప్లేస్‌మెంట్‌లో మోసాలను అరికట్టేందుకు ఈ సవరణలు చేసినట్టు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) తెలిపింది. ట్రాయ్ తెలిపిన వివరాల ప్రకారం, సిమ్ స్వాప్ లేదా రీప్లేస్‌మెంట్ అంటే, ప్రస్తుత సబ్‌స్క్రైబర్ తాను పోగొట్టుకున్న లేదా పని చేయని సిమ్ కార్డుకు బదులుగా కొత్త సిమ్ కార్డును తీసుకునే ప్రక్రియ. యూజర్లు దేశంలోని ఒక యాక్సెస్ ప్రొవైడర్ నుంచి మరొక యాక్సెస్ ప్రొవైడర్‌కు మారినప్పటికీ, తమ మొబైల్ నెంబర్‌ను యథాతథంగా కొనసాగించుకోవడానికి మొబైల్ నంబర్ పోర్టబిలిటీ అవకాశం కల్పిస్తుంది. కొత్త నిబంధనల ప్రకారం ఈ సదుపాయాన్ని కూడా యూజర్లు పొందవచ్చు. మొబైల్ నెంబర్ సిమ్ స్వాప్ లేదా రీప్లేస్‌మెంట్ తేదీ తర్వాత ఏడు రోజులు పూర్తి కాకుండా యూనిక్ పోర్టింగ్ కోడ్ (యూపీసీ) కోసం రిక్వెస్ట్ చేస్తే, ఆ రిక్వెస్ట్‌ను తిరస్కరించాలని తాజా నిబంధనలు చెప్తున్నాయి. ఈ గడువు గతంలో పది రోజులు ఉండేది. ఈ పది రోజుల వ్యవధి ఎక్కువేనని కొందరు చెప్పారని, మరికొందరు మాత్రం దీనివల్ల అర్జెంట్ పోర్టింగ్ అవసరమైన సమయాల్లో సబ్‌స్క్రైబర్లకు అసౌకర్యంగా ఉంటుందని, దీనిని రెండు లేదా నాలుగు రోజులకు కుదిస్తే సహేతుకంగా ఉంటుందని చెప్పారని ట్రాయ్ తెలిపింది. అందుకే దీనిని ఏడు రోజులకు తగ్గించినట్టు వివరించింది.



గైడ్ బుక్‌లతో డిగ్రీ పరీక్షల్లో కాపీ

మధ్యప్రదేశ్‌లో మాస్ కాపీయింగ్ తీరిది!

మొరెనా, జూన్ 29: నీట్ లీకేజీ ఉదంతం నేపథ్యంలో బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాలో మరో షాకింగ్ ఘటన చోటు చేసుకున్నది. జీవాజీ యూనివర్సిటీ శనివారం నిర్వహించిన బీఏ, బీఎస్సీ పరీక్షల్లో ఓ కాలేజీ ఎగ్జామ్ సెంటర్‌లో విద్యార్థుల మాస్ కాపీయింగ్ బయటపడింది. ఉపాధ్యాయుల సమక్షంలోనే కాపీ కొట్టడం సంచలనంగా మారింది. విద్యార్థులు డెస్క్‌లతోపాటు ఏకంగా గైడ్‌బుక్‌లను పెట్టుకొని కాపీ కొడుతుండటం చూసి ఆశ్చర్యపోవడం తన వంతైందని తనిఖీకి వచ్చిన తహసీల్దార్ జ్యోతి లక్షకార్ పేర్కొన్నారు. కేఎస్ హయ్యర్ సెకండరీ స్కూల్‌లోని ఎగ్జామ్ సెంటర్‌లో జరిగిన ఈ కాపీయింగ్ వ్యవహారాన్ని ఒకరు కెమెరాలో రికార్డు చేశారు. ఈ కాపీయింగ్ స్కామ్‌లో ప్రిన్సిపాల్, టీచర్లు, సిబ్బంది భాగస్వామ్యం ఉన్నదని తహసీల్దార్ పేర్కొన్నారు.



బీజేపీకి జీఎంఆర్ భారీ విరాళాలు

ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అందజేత

న్యూఢిల్లీ, జూన్ 29: ఢిల్లీలోని ఇందిరా గాంధీ విమానాశ్రయంలో టెర్మినల్-1 కూలి ఒకరు మరణించిన ప్రమాదం తర్వాత విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ గ్రూప్ ఇప్పుడు ప్రధానంగా వార్తల్లోకి వచ్చింది. 2018 నుంచి ఆ సంస్థ అధికార బీజేపీకి ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా పెద్దమొత్తంలో విరాళాలు అందజేసిన సంగతి వెలుగులోకి వచ్చింది. ప్రూడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ ద్వారా అధికార పార్టీకి పరోక్ష మార్గంలో భారీగా నిధులందజేసిన సంస్థల్లో జీఎంఆర్ ఒకటి. కాగా, ఎలక్టోరల్ బాండ్లు అన్నవి ఎన్నికల ముందు వ్యక్తులు, సంస్థలు తమకు నచ్చిన పార్టీలకు విరాళాలు ఇచ్చే ఒక విధానం. అయితే ఎలక్టోరల్ ట్రస్ట్ అన్నది రాజకీయ పార్టీలకు విరాళాలు అందజేసేందుకు ఉద్దేశించిన మరో ప్రక్రియ. దీనికి నిర్దిష్ట కాలపరిమితి లేదు. ఏడాది పొడవునా ఎప్పుడైనా వ్యక్తులు, సంస్థలు ట్రస్ట్‌కు విరాళం ఇవ్వవచ్చు.

88 శాతం కుబేరులు అగ్రవర్ణాల వారే

- భారత్‌లో 90 శాతం సంపద వారి చేతుల్లోనే
- బిలియనీర్ల జాబితాలో కనిపించని ఎస్సీ, ఎస్టీలు
- ఈ తరహా అసమానతలు ప్రమాదకరం: ఆర్థికవేత్తలు
- ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తాజా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 29: దేశంలో ఒక పక్క బిలియనీర్ల సంపద ఎన్నో రెట్లు పెరుగుతుండగా, సామాన్యుడు మరింత పేదవాడు అవుతున్నాడు. ఈ తేడా సామాజికవర్గ పరంగా కూడా స్పష్టంగా పెరిగింది. దేశంలోని బిలియనీర్ల జాబితాలో ఎస్సీ, ఎస్టీలకు స్థానమే లేకుండా పోయింది. దేశంలోని 90 శాతం సంపద అగ్రవర్ణ బిలియనీర్ల చేతిలో కేంద్రీకృతమై ఉంది. ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ తాజా నివేదిక ఈ వాస్తవాలను వెల్లడించింది. 'భారత్‌లో పన్ను న్యాయం, సంపద పునః విభజన ప్రతిపాదనలు' పేరుతో వెలువడిన తాజా నివేదిక సంపద పంపిణీ సమస్యలను పరిశీలించింది. దేశంలోని మొత్తం సంపదలో 40 శాతం కేవలం ఒక శాతం ఉన్న వర్గం చేతిలో ఉండటం దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను సూచిస్తున్నదని పేర్కొన్నది. బ్రిటిష్ పాలన కాలంతో పోలిస్తే ఈ ఆధునిక యుగంలో అసమానతలు ఇలా ఎన్నో రెట్లు పెరగడం చాలా ప్రమాదకర పోకడ అని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీని కారణంగా ఇప్పటికే భారత్ ప్రపంచంలోని ఆర్థిక అసమానతలున్న దేశాల జాబితాలోకి చేరిపోయిందని వివరించారు.

ద వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ నివేదిక ప్రకారం భారతదేశంలోని 88.4 శాతం బిలియనీర్లు ఉన్నత వర్గాలకు చెందిన వారే. ధనవంతుల జాబితాలో షెడ్యూల్డ్ తెగలు, ఇతర బాగా వెనుకబడిన వర్గాలకు అసలు ప్రాతినిధ్యమే లేదు. ఈ తారతమ్యం బిలియనీర్ల సంపదలో కూడా కొట్టొచ్చినట్టు కన్పించింది. జాతి సంపదలో 55 శాతం ఉన్నత వర్గాల చేతిలో ఉన్నట్టు ఆల్ ఇండియా డెట్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్వే (ఏఐడీఐఎస్) 2018-19లో చేసిన సర్వే ప్రకారం వెల్లడించింది. సంపద వైవిధ్యంలో ఈ పూర్తి వైరుధ్యం భారత దేశ కుల వ్యవస్థలో పాతుకుపోయిన లోతైన అసమానతలను స్పష్టం చేస్తున్నది. అలాగే సామాజిక వర్గం విద్య, ఆరోగ్యం, వ్యాపారం, సంపద సృష్టి తదితర అంశాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తున్నది. దళితులు ఎక్కువ భూమిని కలిగి ఉండరాదని పలు ప్రాంతాల్లో ఉన్న ఆంక్షలు కూడా వారి ఆర్థిక ప్రగతికి ఆటంకంగా మారింది. అయితే ఈ వివక్ష కేవలం బిలియనీర్ల వరకే పరిమితం కాలేదు. దిగువ సామాజిక వర్గం వారు పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి కూడా పలు ఆటంకాలు ఏర్పడుతున్నాయని ద స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా, 2023 పేరిట అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. శ్రామికశక్తి అధికంగా ఉన్నప్పటికీ ఎస్సీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగలేకపోతున్నారు. ఎస్సీల శ్రామిక శక్తి 19.3 శాతం ఉండగా, అందులో 11.4 శాతం, ఎస్టీల్లో 10.1 శాతం శ్రామిక శక్తికి 5.4 శాతం మాత్రమే యజమానుల స్థాయికి ఎదిగారు.

అత్యధిక ఎస్సీ, ఎస్టీల సంపద వర్గీకరణలో

సంపద అసమానత దిగువ వర్గాల సామాజిక వర్గాలలో బిలియనీర్ల ర్యాంకులను మించి విస్తరించింది. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నివేదిక ప్రకారం 12.3 శాతం ఎస్సీలు, 5.4 శాతం ఎస్టీలు మాత్రమే అత్యధిక సంపద కలిగి ఉన్నారు. అయితే దానికి విరుద్ధంగా 25 శాతం పైగా ఎస్సీలు, 46.3 శాతం ఎస్టీలు అత్యల్ప సంపద వర్గంలో ఉన్నారు. అలాగే ఓబీసీ జనాభాలో 16.3 శాతం అత్యల్ప సంపద కేటగిరీ, 19.2 శాతం అత్యధిక సంపద కేటగిరీలో ఉన్నారు. భారత్‌లో ఆదాయం, సంపదల మధ్య వ్యత్యాసం స్వాతంత్య్రం వచ్చిన తర్వాత తగ్గినప్పటికీ 1980 నుంచి 2000 వరకు పెరుగుతూ వచ్చింది. 2014-15, 2022-23 మధ్య ఈ పెరుగుదల శిఖరాగ్ర స్థాయికి చేరుకుంది. దీంతో దేశంలోని 40 శాతం సంపద కేవలం ఒక శాతం వర్గం ఆధీనంలో ఉంది. 1980లో ఇది 12.5 శాతం మాత్రమే ఉండేది. అలాగే వారు మొత్తం పన్నుకు ముందు ఆదాయంలో 22.6 శాతం సంపాదిస్తున్నారు. ఇది 1980లో 7.3 శాతం ఉంది.

బ్రిటిష్ పాలనలోనే మెరుగు

బ్రిటిష్ పాలన నాటితో పోలిస్తే భారత దేశంలో ఆర్థిక అసమానత నాటకీయంగా పెరిగింది. దీంతో ఆర్థిక అసమానతలు గల దేశాల లిస్ట్‌లో భారత్ కూడా చేరింది. ప్రస్తుత అంచనా ప్రకారం దేశంలో ఏడాదికి రూ.20.7 లక్షలు సంపాదించే వారు ఒక శాతం ఉండగా, 10 శాతం మంది ఏడాదికి రూ.2.9 లక్షలు ఆర్జిస్తున్నారు. దీనికి విరుద్ధంగా మధ్యస్థ వయోజనులు ఏడాదికి లక్ష మాత్రమే సంపాదిస్తుండగా, పేదలకు ఎలాంటి ఆదాయం లేదు. జనాభాలోని దిగువ 60 శాతం మంది జాతీయ సగటు ఆదాయంలో కేవలం 15 శాతం మాత్రమే పొందుతున్నారు. ఏడాదికి 21 లక్షలు సంపాదించే వారిని ధనవంతులుగా పరిగణిస్తారు. వీరు దేశంలో 10 శాతం ఉన్నారు. ఏడాదికి 82 లక్షలు ఆర్జించే వారు అత్యంత ధనవంతుల కేటగిరీలోకి వస్తారు. వీరు ఒక శాతం ఉన్నారు. ఇక మధ్యస్థంగా ఉన్న వారు ఏడాదికి 4.3 లక్షల ఆదాయాన్ని కలిగి ఉన్నారు. ఈ మొత్తం వీరి కనీస అవసరాలకు సరిపోతున్నది తప్ప ఎలాంటి సంపదను కూడగట్టలేరు. ఇక మిగిలిన 50 శాతం మందిది అత్యల్ప ఆదాయం. జాతీయ ఆదాయంలో వీరిది 6.4 శాతం కాగా, కేవలం 1 శాతం ఉన్న కుబేరుల వాటా 40.1 శాతం, ఇక 0.001 శాతం ఉన్న అపర కుబేరుల వాటా 17 శాతం. దీని ప్రకారం కేవలం 0.001 శాతం ఉన్న 10 వేల లోపు అపర కుబేరుల ఆదాయం, అట్టడుగు స్థాయిలో ఉన్న 50 శాతం (సుమారు 46 కోట్ల మంది) సంపదతో సమానం.



భారత్‌లోని బిలియనీర్ల శాతం కులాల వారీగా

ఏడాది	అగ్ర వర్ణాలు (ఓసీ)	(ఓబీసీ)
2012	79 %	19.6 %
2014	78.10%	20%
2016	79.70%	16.80%
2018	81.70%	14.40%
2020	84.90%	11.60%
2022	88.40%	9%

గంగలో కొట్టుకుపోయిన కార్లు

ఢిల్లీలో భారీ వర్షాలు.. 11కు చేరిన మృతుల సంఖ్య

న్యూఢిల్లీ: ఉత్తరాదిలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, హరిద్వార్, హల్ద్వానీ, కోట్‌ద్వార్ ప్రాంతాల్లో వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గంగా నదిలో అనేక కార్లు కొట్టుకుపోతున్నట్టు కనిపిస్తున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఢిల్లీ నగరంలో శనివారం కూడా భారీ వర్షాలు కురిశాయి. మృతుల సంఖ్య 11కు చేరింది. మంత్రి అతిశీ ఢిల్లీ ఎల్జీతో భారీ వర్షాలపై చర్చించారు.



శిక్షణలో జవాన్ల జల సమాధి

యుద్ధ ట్యాంక్ మునిగి ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, జూన్ 29: లద్దాఖ్‌లో భారత సైన్యం శిక్షణలో విషాదం చోటుచేసుకుంది. ష్యోక్ నదిలో ఆకస్మికంగా వరదలు పోటెత్తడంతో యుద్ధ ట్యాంక్ ఒకటి నీళ్లలో మునిగిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారని రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. శుక్రవారం రాత్రి వాస్తవాధీన రేఖకు సమీపంలోని న్యోమా-చుషుల్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. శిక్షణ ముగించుకొని వస్తుండగా, అనూహ్యంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. జవాన్ల మృతిపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని అధికారులు వెల్లడించారు. మృతుల్లో జూనియర్ కమిషన్డ్ అధికారి ఒకరు ఉన్నారు.



వర్షానికి కూలిన టెర్మినల్ పైకప్పు

రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టులో ప్రమాదం

న్యూఢిల్లీ, జూన్ 29: గుజరాత్‌లోని రాజ్‌కోట్ ఎయిర్‌పోర్టు టెర్మినల్ బయట వాహనాలు ఆగే చోట నీడ కోసం ఏర్పాటు చేసిన పందిరి పైకప్పు భారీ వర్షానికి కూలిపోయింది. న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టు టెర్మినల్-1 కూలిపోయిన ఒక రోజు తర్వాత ఈ ఘటన జరిగింది. అయితే నిలిచిపోయిన నీటిని తొలగించేందుకు మరమ్మతులు జరుగుతుండగా పందిరి విరిగిపోయినట్టు పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని, దీనిపై నివేదిక కోరినట్టు వారు చెప్పారు.

రెండు రోజుల్లో నీట్ పీజీ కొత్త షెడ్యూల్

కేంద్ర మంత్రి ప్రధాన్

న్యూఢిల్లీ: ఇటీవల వాయిదా పడిన నీట్-పీజీ పరీక్ష కొత్త షెడ్యూల్‌ను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) రెండు రోజుల్లో ప్రకటిస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం వెల్లడించారు. ఇటీవల రద్దు అయిన, వాయిదా పడిన మూడు పరీక్షల కొత్త తేదీలను ఎన్టీఏ ప్రకటించిన నేపథ్యంలో ప్రధాన్ ఈ మేరకు నీట్-పీజీ కొత్త షెడ్యూల్‌పై హర్యానాలోని పంచకులలో మాట్లాడారు. నీట్-యూజీ, యూజీసీ-నెట్ పరీక్షల వివాదం నేపథ్యంలో ఈ నెల 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను కేంద్రం వాయిదా వేసిన విషయం తెలిసిందే.

'భావి ప్రధాని అఖిలేశ్'!



సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను భావి ప్రధానిగా పేర్కొంటూ యూపీ రాజధాని లక్నోలో పోస్టర్లు వెలిశాయి. జూలై 1న అఖిలేశ్ పుట్టినరోజు సందర్భంగా వెలిసిన ఈ పోస్టర్లు చర్చనీయాంశంగా మారాయి. తాజా లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ అనూహ్య ఫలితాలు సాధించడమే ఈ చర్చకు కారణం.

రాజ్యాంగ నైతికత దేశ విభిన్నత్వానికి అవసరం

జడ్జీలను దేవుళ్లుగా చూడటం ప్రమాదకరం: సీజేఐ

న్యూఢిల్లీ: రాజ్యాంగ నైతికతను న్యాయవ్యవస్థలో అమలు చేయడం దేశ విభిన్నత్వానికి అవసరమని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. భారత రాజ్యాంగానికి న్యాయమూర్తులు సేవకులు మాత్రమే, యజమానులు కాదని తెలిపారు. న్యాయమూర్తుల వ్యక్తిగత విలువలు, విశ్వాసాలు, జోక్యం.. వంటివి రాజ్యాంగ విలువలకు విరుద్ధమైన తీర్పుల్ని ఇచ్చే స్థాయిని హెచ్చరించారు. కోల్‌కతాలో ఆయన ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. న్యాయశాస్త్రంలో రాజ్యాంగ నైతికత అమలు గురించి వివరించారు. కోర్టులను దేవాలయాలుగా, జడ్జిలను దేవుళ్లుగా చూస్తే..అది చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలను నెరవేర్చటమే న్యాయమూర్తుల ప్రధాన కర్తవ్యమన్నారు. 'మమ్మల్ని లార్డ్‌షిప్, లేడీషిప్..అంటూ గౌరవంగా సంబోధిస్తారు. ప్రజలకు సేవచేయడంలోనే జడ్జి పాత్ర' అని జడ్జిలను ఉద్దేశించి సీజేఐ అన్నారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లోనే కాదు, రాజ్యాంగ నైతికత జిల్లా న్యాయవ్యవస్థకు కూడా వర్తిస్తుందన్నారు.

సీపీఎంపైనా ఈడీ కేసు?

కేరళలోని కో ఆపరేటివ్ బ్యాంక్ నిధుల గోల్‌మాల్ కేసులో కీలక పరిణామం

తిరువనంతపురం, జూన్ 29: మనీ లాండరింగ్ ఆరోపణల కేసులో సీపీఎంను నిందితుల జాబితాలో చేర్చేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సిద్ధమవుతున్నది. కేరళలోని త్రిస్సూర్‌లో ఉన్న కరువన్నూర్ కోఆపరేటివ్ బ్యాంక్‌లో నిధుల గోల్‌మాల్‌కు సంబంధించిన కేసును ఈడీ గత ఏడాది నుంచి విచారిస్తున్నది. సీపీఎం ఆధ్వర్యంలో నడిచే ఈ బ్యాంకులో సిబ్బంది, స్థానిక సీపీఎం నేతలు రూ.300 కోట్లకు పైగా నిధులను స్వాహా చేశారనే ఆరోపణలు వచ్చాయి. రాష్ర్టాన్ని కుదిపేసిన ఈ వ్యవహారంలో సీపీఎం ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఏసీ మొయిదీన్‌కు బ్యాంకు బినామీ లోన్లను మంజూరు చేసిందని ఈడీ గత ఏడాది పేర్కొన్నది. మొయిదీన్ గతంలో త్రిస్సూర్ జిల్లా సీపీఎం కార్యదర్శిగా పని చేశారు. అయితే ఈ కేసులో సీపీఎం ప్రమేయం కూడా ఉందని ఈడీ భావిస్తున్నది. ఇప్పటికే పార్టీకి చెందిన కార్యాలయ స్థలం, వేర్వేరు బ్యాంకుల్లో ఉన్న రూ.60 లక్షలను ఈడీ అటాచ్ చేసింది. ఇప్పుడు పార్టీని సైతం నిందితుల జాబితాలో చేర్చేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఈడీ కేసును న్యాయపరంగా, రాజకీయంగా ఎదుర్కొంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ ప్రకటించారు. కాగా.. గత నెల ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో ఆమ్ ఆద్మీ పార్టీపై ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఒక రాజకీయ పార్టీని నిందితుల జాబితాలో చేర్చడం అదే మొదటిసారి.

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి

కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ జేడీయూ తీర్మానం

పాట్నా, జూన్ 29: కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు మిత్రపక్షమైన జేడీయూ నుంచి అప్పుడే సెగ మొదలైంది. బీహార్‌కు ప్రత్యేక క్యాటగిరీ హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జేడీయూ పార్టీ జాతీయ కార్యవర్గం శనివారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అదేవిధంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్యసభ ఎంపీ సంజయ్ ఝూను నియమిస్తూ సమావేశం నిర్ణయం తీసుకొన్నది. పోటీ పరీక్షల పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాన్ని తీసుకురావాలని జేడీయూ డిమాండ్ చేసింది. నీట్ యూజీ పేపర్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ తీర్మానం చేసింది. కేంద్రంలో బీజేపీ ఈసారి టీడీపీ, జేడీయూ పార్టీలపై ఆధారపడి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో.. బీహార్ సీఎం నితీశ్ కుమార్ పార్టీ జేడీయూ 'ప్రత్యేక హోదా' అంశాన్ని మరోసారి తెరపైకి తీసుకురావడం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకొన్నది.


మమతపై పరువు నష్టం దావా

రాజ్‌భవన్‌పై వ్యాఖ్యల పట్ల గవర్నర్ ఆగ్రహం

కోల్‌కతా, జూన్ 29: పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మధ్య విభేదాలు ముదురుతున్నాయి. మమతా బెనర్జీపై గవర్నర్ బోస్ శుక్రవారం కోల్‌కతా హైకోర్టులో పరువు నష్టం దావా వేశారు. ఆమెతో పాటు పలువురు తృణమూల్ కాంగ్రెస్ నేతలపైనా ఆయన దావా వేశారు. ఇటీవల రాజ్‌భవన్‌లో పనిచేసే ఓ కాంట్రాక్టు ఉద్యోగిని తనపై గవర్నర్ ఆనంద బోస్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన సంగతి తెలిసిందే. కోల్‌కతా పోలీసులు ఈ ఆరోపణలపై విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా రెండురోజుల క్రితం సచివాలయంలో జరిగిన ఓ సమావేశంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. 'ఇటీవల జరుగుతున్న ఘటనల వల్ల మహిళలు రాజ్‌భవన్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నట్టు నాకు చెప్పారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల పట్ల ఆగ్రహించిన గవర్నర్.. మమత, ఆమె పార్టీకి చెందిన పలువురు నేతలపై కోర్టుకెక్కారు.

నాయకత్వ గందరగోళం

- కర్ణాటక సీఎం మార్పు, డిప్యూటీ సీఎంలపై కాంగ్రెస్‌లో విస్తృత చర్చ
- గొంతెత్తుతున్న మంత్రులు, పలువురు పార్టీ నేతలు
- తమ వర్గానికి సీఎం పోస్టు ఇవ్వాలని పలువురు మఠాధిపతుల డిమాండ్లు





బెంగళూరు, జూన్ 29: కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మంత్రులు, పార్టీ నేతలు, కార్యకర్తలు.. చివరకు పలువురు మఠాధిపతులు కూడా ఎవరికి వారు వర్గాలుగా విడిపోయారు. సీఎం పదవిని తమ వర్గం నేతలకు ఇవ్వాలని లేదా ఒకవేళ అదనంగా డిప్యూటీ సీఎం పోస్టులను ఏర్పాటు చేస్తే తమ వర్గం నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని బహిరంగంగానే డిమాండ్లు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో నాయకత్వ సంక్షోభం నెలకొన్నది.

సిద్ధరామయ్య దిగి.. డీకేను సీఎం చేయాలి

ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్రంలో బలమైన సామాజిక వర్గంగా ఉన్న ఒక్కలిగ వర్గానికి చెందిన డీకే శివకుమార్ ఒక్కరే డిప్యూటీ సీఎంగా ఉన్నారు. వీరశైవ-లింగాయత్, ఎస్సీ/ఎస్టీ, మైనార్టీ కమ్యూనిటీలకు కూడా డిప్యూటీ సీఎం పదవులు ఇవ్వాలనే డిమాండ్ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైన గత ఏడాది నుంచే ఉన్నది. ఇటీవల ఆ డిమాండ్ మరింత ఊపందుకొన్నది. ఒక్కలిగ మహా సంస్థాన మఠానికి చెందిన చంద్రశేఖర కాంత స్వామీజీ గత గురువారం ఓ సందర్భంగా మాట్లాడుతూ "సీఎంగా మీరు దిగిపోయి, డీకేను ముఖ్యమంత్రిని చేయండి' అంటూ బహిరంగంగానే సీఎం సిద్ధరామయ్యను కోరడం సంచలనంగా మారింది. దీనికి తర్వాతి రోజు వీరశైవ-లింగాయత్ మత పెద్ద శ్రీశైల జగద్గురు సిద్ధరామ పండితారాధ్య స్వామీజీ శుక్రవారం మాట్లాడుతూ ఒకవేళ రాష్ట్రంలో నాయకత్వ మార్పు అంశం పరిశీలనలో ఉంటే.. తమ వర్గానికి చెందిన మంత్రులను సీఎం పదవికి పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా అదనపు డిప్యూటీ సీఎం పోస్టులను ఏర్పాటు చేస్తే, అందులోనూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

నాకు ఎవరి సిఫారసు అవసరం లేదు: డీకే

'నాకు ఎవరి సిఫారసు అవసరం లేదు. మేం చేసిన పనికి.. మా హైకమాండే నిర్ణయం తీసుకొంటుంది' అని డీకే శివకుమార్ అన్నారు. సీఎం, డిప్యూటీ సీఎంల అంశంపై బహిరంగంగా లేదా మీడియాతో ఏ మంత్రీ మాట్లాడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

మల్టీ విటమిన్లతో ఆయుష్షు పెరగదు


- త్వరగా మరణించే ముప్పు పెరగొచ్చు
- ఆహారం ద్వారానే పోషకాలు అందాలి



న్యూయార్క్, జూన్ 29: ప్రతిరోజూ మల్టీవిటమిన్ సప్లిమెంట్లు తీసుకోవడం ఆయుష్షు పెరగడానికి ఉపయోగపడదని, పైగా త్వరగా మరణించే ముప్పుకు కారణం కావొచ్చని ఒక అధ్యయనంలో వెల్లడైంది. అమెరికాలోని నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకులు 1990ల నుంచి 3,90,124 మందిపై దాదాపు 20 ఏండ్ల పాటు అధ్యయనం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు 'జామా నెట్‌వర్క్ ఓపెన్'లో ప్రచురితమయ్యాయి. ఎక్కువ కాలం జీవించడానికి మల్టీవిటమిన్ సప్లిమెంట్లు ఉపయోగపడటం లేదని, మరణ ముప్పును ఏమాత్రం తగ్గించడం లేదని పరిశోధకులు గుర్తించారు. పైగా మల్టీవిటమిన్లు తీసుకోని వారి కంటే తీసుకుంటున్న వారు త్వరగా మరణించే ముప్పు 4 శాతం పెరిగినట్టు తేల్చారు. మల్టీవిటమిన్ సప్లిమెంట్లను తీసుకోవడం కంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం మంచిదని డాక్టర్ నీల్ బార్నార్డ్ తెలిపారు. తీసుకునే ఆహారంలో సూక్ష్మ, అతి సూక్ష్మ పోషకాలు, పీచు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలని, సంతృప్త కొవ్వు, కొలెస్ట్రాల్ తక్కువ ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. మల్టీవిటమిన్ సప్లిమెంట్లు తీసుకోవడం కంటే ఆహారంలో ఎక్కువగా కూరగాయలు, తృణధాన్యాలు, చిక్కుళ్లు తీసుకోవడం మంచిదని మరో పరిశోధకురాలు డాక్టర్ జేన్ ఏ కోబెర్న్ తెలిపారు. మాంసం, మద్యపానం, ఒకేచోట కూర్చోవడం తగ్గించాలని ఆమె సూచించారు.

చదివేది బీఎస్సీ.. బోధించేది సివిల్స్

సొంతంగా నోట్స్ ప్రిపేర్.. యూట్యూబ్‌లో క్లాసులు • 10 లక్షల సంపాదనతో కారు కొన్న కేరళ కుర్రాడు



తిరువనంతపురం: నమ్మకం, కృషి ఉంటే అసాధ్యాలను సుసాధ్యం చేయవచ్చునని నిరూపించాడు కేరళకు చెందిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థి సయూజ్ ఎస్ చంద్రన్. తనకున్న జ్ఞానాన్ని 'బోధించి' రూ.10 లక్షలు సంపాదించాడు. ఆ డబ్బుతో ఓ కారు కొని తాను చదువుతున్న కళాశాలలో సెలబ్రిటీగా మారిపోయాడు. కాసర్‌గోడ్‌లోని మారుమూల కొండ ప్రాంతంలో ఉన్న రాజాపురం గ్రామంలోని ఓ కాలేజీలో చదివే ఓ గ్రామీణ విద్యార్థి స్ఫూర్తిదాయక కథ ఇది.

తాను నేర్చుకొన్నది పంచుకొనే క్రమంలో..

సయూజ్ తండ్రి చంద్రన్ ఆర్మీలో పని చేసి రిటైర్ అయ్యారు. తల్లి సతి చంద్రన్ సామాజిక కార్యకర్త, గ్రామీణ ఉపాధి హామీ పథకం సూపర్‌వైజర్. సయూజ్ యూట్యూబ్‌లో సొంతంగా ఓ కోచింగ్ చానల్‌ను నిర్వహిస్తున్నాడు. అందులో సివిల్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు కరెంట్ అఫైర్స్, సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్, చరిత్ర, జాగ్రఫీ, జనరల్ సైన్స్ బోధిస్తూ డబ్బు సంపాదిస్తున్నాడు. తాను 2025 మే నెలలో సివిల్స్ పరీక్షలకు హాజరవుతానని, తాను నేర్చుకున్న దానిని ఇతరులతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఐఏఎస్ హబ్ మలయాళం యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించానని సయూజ్ చెప్పాడు. ఒక ఏడాదిలో ఈ చానల్ ద్వారా వచ్చిన సొమ్ముతో కారు కొన్నానని చెప్పాడు. సయూజ్ చానల్ గురించి అతడు చదివే కాలేజీ లెక్చరర్ ఆశా దాకో మాట్లాడుతూ... తమ కళాశాలలో సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేవారు చాలా మంది ఉన్నారని.. అయితే సయూజ్ బోధించినట్టుగా మరెవరూ బోధించలేరని చెప్పారు. సయూజ్ వద్ద కాలేజీ టీచర్లు, గృహిణులు, ప్రభుత్వోద్యోగులు, ఐటీ ప్రొఫెషనల్స్, కెమికల్ ఇంజినీర్ల వంటివారు శిక్షణ పొందుతున్నారని ఆమె తెలిపారు.

ఐప్యాడ్‌లో చదివి.. పీడీఎఫ్ రూపొందించి

తన బోధన గురించి సయూజ్ మాట్లాడుతూ కాలేజీకి బస్సులో వెళ్లి, వచ్చేటప్పుడు ఐప్యాడ్‌లో ఆన్‌లైన్ న్యూస్‌పేపర్లను చదువుతానని చెప్పాడు. ఈ పత్రికల ఆధారంగానే తయారు చేసుకొన్న నోట్స్‌ను వీడియో పీడీఎఫ్ తయారు చేసి తన చానల్‌లో అప్‌లోడ్ చేస్తానని చెప్పాడు. నోట్స్ బాగుందని, తాము రుసుము చెల్లిస్తామని వీక్షకులు చెప్పడంతో, తన చానల్‌ను చెల్లింపు(పెయిడ్) చానల్‌గా మార్చానన్నాడు. కొత్తగా చేరినవారికి రోజువారీ మూల్యాంకన, రాత పరీక్షలను నిర్వహిస్తున్నానని తెలిపాడు.

ఇన్‌స్టా రీల్ కలిపింది ఇద్దరినీ

18 ఏండ్ల తర్వాత పన్ను చూసి తమ్ముడి గుర్తింపు



కాన్పూర్, జూన్ 29: ఎప్పుడో చిన్నప్పుడు తప్పిపోయిన హీరోనో, హీరోయిన్‌నో 15, 20 ఏండ్ల తర్వాత వారి పుట్టుమచ్చ ద్వారానో, మరో గుర్తు ద్వారానో కుటుంబ సభ్యులు గుర్తుపట్టి అక్కున చేర్చుకునే ఉద్విగ్నభరిత దృశ్యాలు మనం చాలా సినిమాల్లో చూశాం. ఇప్పుడు అలాంటి ఘటనే యూపీలోని కాన్పూర్‌లో చోటుచేసుకుంది. చిన్నప్పుడు ఉద్యోగం కోసం ముంబై వెళ్లిపోయిన తమ్ముడిని ఒక అక్క ఇన్‌స్టా రీల్‌లో అతని విరిగిన పన్ను ద్వారా గుర్తు పట్టింది. అయితే ఈ ఘటన అతడు వెళ్లిపోయిన 18 ఏండ్ల తర్వాత జరగడం. దానికి ఇన్ స్టా రీల్ కారణం కావడం విశేషం. యూపీలోని హతిపూర్‌కు చెందిన రాజకుమారి మొబైల్‌లో ఒక రీల్స్ వీడియో చూస్తుండగా, అందులోని వ్యక్తిని ఎక్కడో చూసినట్టు అనిపించింది. విరిగిన అతని పన్ను చూసి 18 ఏండ్ల క్రితం ఇంట్లోంచి ముంబై వెళ్లిన తన తమ్ముడు బాల్ గోవింద్‌లా ఉన్నాడని అనుమానించింది. ఇన్‌స్టాలో అతడిని సంప్రదించి చిన్నప్పుడు తాను తమ్ముడితో గడిపిన విషయాలు ప్రస్తావించింది. వాటికి అతడు కూడా సరిగ్గా స్పందించడంతో అతడు తన తమ్ముడేనని నిర్ధారణ అయ్యింది. దీంతో జైపూర్‌లో ఉంటున్న అతడు 18 ఏండ్ల తర్వాత అక్కను, బంధువులను కలుసుకుని ఆనందంతో ఉప్పొంగిపోయాడు. తప్పిపోయిన తన తమ్ముడిని సామాజిక మాధ్యమమే కలిపిందని రాజకుమారి ఎంతో ఉద్విగ్నంగా పేర్కొంది.

'సమగ్ర శిక్ష'లో బదిలీల లొల్లి

- నో షెడ్యూల్ .. నో అప్లికేషన్స్
- దొడ్డిదారిన 52 మందికి స్థానచలనం
- రాత్రికి రాత్రే ఎస్పీడీ పేరుతో ఉత్తర్వులు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టులో తాజా బదిలీలు కలకలం రేపుతున్నాయి. షెడ్యూల్ ప్రకటించకుండా, దరఖాస్తులను స్వీకరించకుండా దొడ్డిదారిన బదిలీలు చేపట్టారనే ఆరోపణలున్నాయి. 52 మందిని రాత్రికి రాత్రే బదిలీ చేస్తూ ఎస్పీడీ పేరిట ఉత్తర్వు జారీ అయిందని సిబ్బంది తెలిపారు. సమగ్ర శిక్ష స్టేట్ పరిధిలో ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్స్ (ఐఈఆర్‌పీఎస్), మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ కో ఆర్డినేటర్ల (ఎంఐఎస్) బదిలీ వెనుక పెద్దతతంగం నడిచినట్టు ఆరోపణలున్నాయి. ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్న పలువురు కుటుంబ అవసరాలరీత్యా బదిలీల కోసం తొమ్మిదేండ్లుగా విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్తగా వివాహమైన వారు, భర్త/భార్య ఇతర జిల్లా ల్లో పనిచేస్తున్న వారు అంతర్‌జిల్లా బదిలీలు కల్పించాలని ప్రాజెక్టు డైరెక్టర్‌ను కోరుతూ వస్తున్నారు. అనూహ్యంగా 52 మందిని శనివారం రాత్రి బదిలీ చేయడంపై అభ్యర్థులు నిలదీశారు. గతంలో ఆన్‌లైన్ విధానంలో చేసినప్పుడు అంతర్‌జిల్లా బదిలీలను ఒప్పుకోలేదని గుర్తుచేశారు. బదిలీల వ్యవహారంపై విచారణ జరిపించాలని, అర్హులకు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేశారు.

'మిగిలిన పోస్టులకు కౌన్సెలింగ్ పెట్టాలి'

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): కొందరు టీచర్లు ఎక్కువ సబ్జెక్టుల్లో అర్హత ఉండి ఒకే సబ్జెక్టుల్లో పదోన్నతి పొందగా, మిగిలిన 600కు పైగా పోస్టులకు ప్రత్యేక ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించి ఎస్జీటీలకు న్యాయం చేయాలని టీఆర్టీయూ కోరింది. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ భిక్షంగౌడ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్జీటీల వెబ్ ఆప్షన్లలో ఒక్కొక్కరు 1000, 2000 వరకు ఆప్షన్ ఇచ్చుకోవడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. రోజుకు 500 పోస్టుల చొప్పున మూడురోజులపాటు బదిలీ కౌన్సెలింగ్ చేపట్టాలని విజ్ఞప్తిచేశారు.

సీజీఎల్ ఉద్యోగాలపై నేడు టీ-సాట్ లైవ్

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): స్టాఫ్ సెలక్షన్ కమిషన్ భర్తీ చేసే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఉద్యోగాల అభ్యర్థులకు ఆదివారం మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని టీ-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సీజీఎల్ అభ్యర్థులకు, అధ్యాపకులతో ఫోన్ ఇన్ నిర్వహిస్తామని శనివారం పేర్కొన్నారు. సందేహాల నివృత్తికి 040 23556037, 040 23540726 టోల్ ఫ్రీ, 1800 425 4039 ఫోన్ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు.

సర్కారు తప్పిదం.. దివ్యాంగులకు శాపం!

- గురుకుల పీజీటీల్లో భారీగా ఖాళీలు
- నాడు మెడికల్ టెస్టులు లేకుండానే ఎంపిక
- నేడు అనర్హులంటూ పోస్టింగ్ నిరాకరణ
- హెచ్‌హెచ్ విభాగంలోనే 35 మందికిపైగా రిజెక్ట్
- వీహెచ్, ఓహెచ్ ఇతర విభాగాల్లో మరెన్నో?
- తదుపరి మెరిట్ అభ్యర్థికైనా ఇవ్వని వైనం
- కాంగ్రెస్ సర్కారుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

ఈమె పేరు రేణుక. దివ్యాంగుల కోటాలో మల్టీ జోన్-1లో బయోలాజికల్ సైన్స్ సబ్జెక్టులో పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్) పోస్టుకు ఎంపికయ్యారు. టీజీటీ పోస్టుకూ ఎంపికయ్యారు. టీజీటీని వదిలేసి పీజీటీ పోస్టును ఎంచుకోగా, గత ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను అందుకున్నారు. తీరా ఇప్పుడు నిర్దేశిత వైకల్యశాతం లేదని పీజీటీ పోస్టు అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను అధికారులు రద్దుచేశారు. దీంతో రెంటికీ చెడ్డ రేవడిలా మారింది. ఇది ఒక్క రేణుక పరిస్థితే కాదు.. పీజీటీ పోస్టులకు పదుల సంఖ్యల అభ్యర్థులకు ఎదురైన దుస్థితి.



ఎవరికీ చెప్పుకోలేక అభ్యర్థుల మానసిక క్షోభ

ఉద్యోగం వచ్చిందని మురిసిపోయారు.. బంధువులు, స్నేహితులతో గర్వంగా చెప్పుకున్నారు.. కానీ ఇప్పుడు ఆర్డర్లను రద్దు చేయడంతో వారి సంతోషం మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. తలెత్తుకు తిరగలేకపోతున్నామని బాధిత దివ్యాంగ అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదటే వైద్య పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాతే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి ఉంటే తమకు ఇంత మానసిక క్షోభ మిగిలి ఉండేది కాదని సదరు అభ్యర్థులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): రాజకీయ ఆరాటం కోసం రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ అభ్యర్థుల ఆశలను ఛిద్రం చేసింది. వచ్చిన ఉద్యోగ అవకాశాలను కాలరాసింది. ప్రచార్భాటం కోసం జారీచేసిన అపాయింట్‌మెంట్ ఆర్డర్లనే ఇప్పుడు రద్దు చేసింది. ఒక్కరు కాదు, ఇద్దరు కాదు దివ్యాంగ కోటాలోని పీజీటీ ఎంపికైన పదుల సంఖ్యలో అభ్యర్థులను వంచించింది. సర్కారు కొలువొచ్చిందని ఉన్న ఉద్యోగాన్ని, అవకాశాలను వదులుకున్నవారు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో వారంతా రోడ్డునపడ్డారు. వారిని ఎంపిక చేసిన పోస్టులన్నీ నేడు ఖాళీగా మారాయి. ఐదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కారు నిర్వాకం. గురుకుల పోస్టులను టీజీఎస్ ఏ రీతిన భర్తీ చేస్తున్నదో చెప్పేందుకు నిలువెత్తు నిదర్శనం. ఇప్పుడు దీనికి బాధ్యులెవరు? ఈ దివ్యాంగ అభ్యర్థులకు నిలదీస్తున్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ట్రిబ్) మొత్తంగా 1,276 పీజీటీ పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీచేసింది. వీటిలో 115 పోస్టులు దివ్యాంగుల కోటాకు కేటాయించారు. వాటిలో విజువల్ హ్యాండీక్యాప్డ్ 105, హియరింగ్ హ్యాండీక్యాప్డ్ 10 ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ట్రిబ్ పీజీటీ పోస్టుల భర్తీలో మెడికల్ టెస్టులను నిర్వహించకుండానే తుది జాబితాను ప్రకటించింది. ఫిబ్రవరిలో ఎల్బీ స్టేడియం వేదికగా వారికి అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇచ్చింది. ఆ తర్వాత మెడికల్ బోర్డులకు అభ్యర్థులను పంపి వైకల్య పరీక్షలను నిర్వహించింది. అందులో భాగంగా హియరింగ్ హ్యాండీక్యాప్డ్ పోస్టులకు సంబంధించి 40 మందికిపైగా అభ్యర్థులను రీచ్ చేసి దవాఖానకు పంపగా, అందులో 36 మందికి పైగా అభ్యర్థులు అన్ఫిట్ అని సదరు మెడికల్ బోర్డు తేల్చింది. ఆ మేరకు 36 మంది అభ్యర్థుల పోస్టింగ్ ఆర్డర్లను ఇప్పుడు సొసైటీలు రద్దుచేశాయి. ఇతర మెడికల్ బోర్డుల నుంచి కూడా తిరస్కరణకు గురైన అభ్యర్థులు ఎందరో ఉన్నారు. దీంతో దివ్యాంగుల కోటా పోస్టుల్లో సగానికి పైగా పోస్టులు బ్యాక్‌లాగ్‌లో పడినట్టు అభ్యర్థులే తేల్చి చెప్తున్నారు.

అర్హులకూ తీరని నష్టం

ట్రిబ్ తీరువల్ల మెరిట్ వైపు 1:2 జాబితాలో ఉన్న అభ్యర్థులకు సైతం తీవ్రమైన అన్యాయం జరుగుతున్నది. రిక్రూట్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తే మెరిట్ జాబితాలో ఉన్న తదుపరి అభ్యర్థితో మిగిలిన పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉండేది. ట్రిబ్ మాత్రం ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఆ పోస్టులన్నీ ఖాళీగా మిగిలిపోయాయి. ప్రస్తుతం ఖాళీ అయిన పోస్టులన్నీ బ్యాక్‌లాగ్‌లో పడిపోతున్నాయి.

ఉన్న ఉద్యోగాన్ని వదులుకున్నారు..

పీజీటీ పోస్టులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు పొంది, తదుపరి గురైన దివ్యాంగ అభ్యర్థులు లెండో ఇప్పుడు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారు. గురుకుల పోస్టులకు దరఖాస్తు చేసుకునే క్రమంలో అప్పటికే ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు సంబంధిత శాఖ నుంచి ఎన్‌వోసీ (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్)ను సమర్పించాలని ట్రిబ్ షరతు విధించింది. ఆ మేరకు అప్పటికే వివిధ విభాగాల్లో ఉద్యోగాలు చేస్తున్న దివ్యాంగులు సైతం ఎన్‌వోసీలను సమర్పించారు. పీజీటీ పోస్టులకు సంబంధించిన అపాయింట్‌మెంట్ ఆర్డర్లను ఇవ్వడంతో పలువురు దివ్యాంగ అభ్యర్థులు చేస్తున్న ఉద్యోగాలను స్వచ్ఛందంగా వదిలేశారు. తీరా ఇప్పుడు ఆర్డర్లను రద్దు చేయడంతో వారి పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారైంది. ఇటు ఉద్యోగం రాక, ఉన్న ఉద్యోగం కోల్పోయి ఆగమవుతున్నారు. వైద్యపరీక్షలలో పోస్టుకు ఎంపికైన వారే ఎందరో ఉన్నారు. ట్రిబ్ నిర్వాకం వల్ల తమ జీవితాలు త్రిశంకుస్వర్గంలో తేలియాడుతున్నాయని అభ్యర్థులు నిప్పులు చెరుగుతున్నారు.

జూలై 31దాకా ఇంటర్ అడ్మిషన్లు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును జూలై 31 వరకు ఇంటర్మీడియట్ విద్యామండలి పొడిగించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, టీజీ రెసిడెన్షియల్, టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, టీజీ గిరిజన, టీజీ సంక్షేమ, టీజీబీసీ, టీజీ మైనార్టీ, టీజీ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులకు శనివారం ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వ గుర్తింపు, అనుమతి పొందిన కళాశాలల్లోనే చేరాలని విద్యార్థులకు సూచించింది. కళాశాలల వివరాలకు acadtsbie.cgg.gov.in, tgbie.cgg.gov.inను చూడాలని కోరింది.

'న్యాయనిపుణుల'కు దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీలో లీగల్ ఎక్స్‌పర్ట్స్-II, సీనియర్ కౌన్సిల్-1 పోస్టుల భర్తీ కోసం శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎల్ఎల్బీ/ ఎల్ఎల్ఎం పూర్తి చేసి, సర్వీస్ అంశాల్లో మూడేండ్ల అనుభవం ఉన్నవారికి నెలకు రూ.60వేల జీతంతో కాంట్రాక్టు లేదా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేపడుతారు. దరఖాస్తులు చేసుకోవడానికి జూలై 15 చివరి రోజు. వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు.

అధ్యయనాలకు జీబ్రా ఫిష్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): అధ్యయనాలకు జీబ్రా ఫిష్ (వారల చేపలు) ఎంతో అనుకూలంగా ఉంటాయని సీసీఎంబీ పరిశోధకులు చెప్తున్నారు. వెలిపోవడు అవసరంతో, వచ్చిన వ్యాధి సమాచారాలతో చూడగలిగిన తేలికైనదని ఈ చేపల జన్యు క్రమం సీక్వెన్సింగ్ చేయబడి ఉండడంతోనే ఎలాంటి మార్పులనైనా మెరుగైన ఫలితాలను పొందే వీలు ఉంటుందని వివరిస్తున్నారు. గంగా, బ్రహ్మపుత్ర పరివాహకాలలో ఉండే ఈ చేప మనుషుల్లో ఎక్కువగా సంరంభించే అభివృద్ధిని తెలిపారు. ప్రస్తుతం 91 దేశాలకు చెందిన 10 వేలకు మందికిపైగా పరిశోధకులు అధ్యయనాలకు జీబ్రా ఫిష్ ప్రధాన ఆధారమని వెల్లడించారు. డయాబెటిస్, అరుదైన జన్యు సంబంధిత వ్యాధులు, న్యూరో డిజార్డర్, అల్జీమర్, పార్కిన్సన్ వంటి పరిశోధనల్లో వీటిని ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు.

జేఈఈ ర్యాంకర్.. గంజాయికి బానిస!

- ట్రిపుల్ ఐటీలో బీటెక్ చేస్తూ డిస్‌కంటిన్యూ
- గంజాయికొంటూ పోలీసులకు చిక్కిన వైనం
- విద్యార్థి సహా మరో ముగ్గురు అరెస్టు



మాట్లాడుతున్న నిందితుడు నవీన్‌నాయక్

శేరిలింగంపల్లి, జూన్ 29: సికింద్రాబాద్ ప్రాంతానికి చెందిన నవీన్‌నాయక్ చిన్నవాటి నుంచి చదువులో ముందుండేవాడు. జేఈఈలో ఆలిండియా 800 ర్యాంకు సాధించి ట్రిపుల్ ఐటీ నిట్‌లో బీటెక్‌లో చేరాడు. అక్కడ స్నేహితుల చెడుసావాసంతో గంజాయి, డ్రగ్స్‌కు బానిసగా మారి చదువును మధ్యలోనే వదిలేసి తన జీవితాన్ని చిత్తు చేసుకున్నాడు. తాజాగా గంజాయి కొనుగోలు చేస్తూ పోలీసులకు పట్టుబడి తన జీవితాన్ని తానే నాశనం చేసుకున్నానంటూ పశ్చాత్తాప పడుతున్నాడు. ఈ కేసులో కాకుండా మొత్తం నలుగురు నిందితులను పట్టుకున్నారు. మాదాపూర్ డీసీపీ ఆరు లోకేశ్ నిందితుల వివరాలను వెల్లడించారు. ... లో గంజాయి విక్రయిస్తున్న ఓ సరఫరాదారుడితోపాటు కొనుగోలు చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్న నవీన్‌నాయక్ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు వివరాలను శనివారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో టీజీన్యాబ్ ఎస్పీ సాయిచైతన్య, డీసీపీ వినీత్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ధూల్‌పేట్‌కు చెందిన మోతికార్ సత్యనారాయణ (28) ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన రవితో కలిసి గత కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నారు. శనివారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైటెక్స్ ప్రాంతంలో సదరు గంజాయి విక్రయిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం మేరకు టీజీన్యాబ్, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. సత్యనారాయణతో కొనుగోలుదారులైన సికింద్రాబాద్‌కు చెందిన నిట్ పూర్వవిద్యార్థి కురుమోతు రాథోడ్ నవీన్‌నాయక్ (27), కూకట్‌పల్లికి చెందిన ఇంటీరియర్ డిజైనర్ ప్రణీత్‌రెడ్డి (25), బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన రావాల్ టోకార్ (27)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.... గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సత్యనారాయణ నడిపిన పోలీసుల విచారించగా డ్రగ్ పెడ్లర్లు బెంగళూరుకు చెందిన రిత్విక్, ఇంతియాజ్, జీవన్, మహేశ్, గచ్చిబౌలికి చెందిన హరికొండ్డి, వైజాగ్‌కు చెందిన మన్విక్, గోలికొండ ప్రాంతానికి చెందిన సచిన్ వద్ద కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. గంజాయి విక్రయానికి పాల్పడుతున్న మిగతా నిందితుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అమ్మాయి దక్కదని స్నేహితుడి హత్య

- వీడిన అల్లాపూర్ బాలుడి హత్యకేసు
- గంజాయి మత్తులో విద్యార్థిని హతమార్చిన మైనర్లు

అల్లాపూర్, జూన్ 29: తాను ప్రేమిస్తున్న అమ్మాయి తనకు దక్కదేమోనని ఒక యువకుడు తన స్నేహితుడిని దారుణంగా హత్యచేశాడు. గంజాయి మత్తులో తోటి స్నేహితులతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. వారం రోజుల క్రితం జరిగిన ఈ హత్య కేసు మిస్టరీ వీడింది. కూకట్‌పల్లి పరిధి అల్లాపూర్‌కు చెందిన అబ్బాస్ అన్సారీ బేగం కుమారుడు దానిష్ (17) యూసుఫ్‌గూడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో ఓ రౌడీషీటర్ కుమారుడు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తాను ప్రేమిస్తున్న అమ్మాయితో చనువుగా ఉంటున్నాడన్న అనుమానంతో దానిష్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 22న దానిష్‌ను రౌడీషీటర్ కుమారుడు బోరబండ రైల్వేస్టేషన్ ప్రాంతానికి పిలిపించాడు. అప్పటికే అక్కడ స్నేహితులతో కలిసి గంజాయి తాగారు. దానిష్ రాగానే.. పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న బీరు సీసాలతో దానిష్‌ను విచక్షణారహితంగా పొడిచారు. అనంతరం చనిపోయాడని గొంతు కోసి హత్యచేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో మైనర్లు సహా నిందితులను గుర్తించారు. ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. పటాన్‌చెరు హత్యకేసులో పట్టుబడ్డ నిందితులు జుబేర్, అమెర్, పోయెజ్, రయాన్, మరో వ్యక్తిని అరెస్టు చేశారు. మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించగా మరో ఐదుగురిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపింది.



నాంపల్లి మెట్రో స్టేషన్ వద్దన గంజాయి మత్తులో జోగుతూ.. పేకాట ఆడుతున్న జూదరులు

గంజాయి మత్తు.. నడిరోడ్డుపైనే పేకాట

హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): నాంపల్లి ప్రాంతం హైదరాబాద్ నగరంలోని నడిగడ్డ.. పోలీసు ఆఫీసు.. డీజీపీ ఆఫీసు, అసెంబ్లీ, తెలుగు యూనివర్సిటీ.. గాంధీ భవన్, బీజేపీ ఆఫీసు, పక్కనే ఆబ్కారీ భవన్.. నిత్యం పోలీసులు సంచరించే ప్రాంతం.. అయినా ఆ మత్తుపట్నే నడిబొడ్డు ప్రాంతం గంజాయి సేవిస్తూ.. పేకాట ఆడుతూ జూదం వినోదంగా మారిన దృశ్యం చోటుచేసుకున్నది. లక్షల ఫూల్ నుంచి నాంపల్లి ఆబ్కారీ భవన్ వరకు రోడ్లపై సంచరిస్తున్న ప్రాంతం నుంచి ఆమ్మి చేసిందా మెట్రో పిల్లర్ ఏ1267 దగ్గర పేకాట ఆడుతున్నారు. ఆ దారిపోతున్న పోలీసులు సైతం అటువైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యకరం. పేకాటలో నలుగురు నిమగ్నమైతే.. గంజాయి సేవించి మత్తులో మరో ఇద్దరు జోగుతున్నారు. ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' కెమెరాలో బంధించింది.

ఒంటరి మహిళలే లక్ష్యంగా హత్యలు

- ఆరుగురిని హతమార్చిన సీరియల్ కిల్లర్
- వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు
- సైకో హంతకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

మహబూబ్‌నగర్, జూన్ 29: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వరుస హత్యలకు పాల్పడుతున్న సైకో హంతకుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు. జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన వడ్డె భాస్కర్ కూలి పనులు చేస్తూ మహబూబ్‌నగర్ బస్టాండ్, ఫుట్‌పాత్ మీద ఉండేవాడు. మహబూబ్‌నగర్ మండలం గాజులపేటకు చెందిన దాసరి లక్ష్మి(33) మే 28న టీడీగుట్ట ప్రాంతంలో కూలి పనుల కోసం రాగా, డబ్బు ఎర చూపి అమిస్తాపూర్ శివారుకు తీసుకెళ్లి బ్లేడ్‌తో గొంతుకోసి హత్య చేసి, కాళ్లపట్టీలు తీసుకుని పరారయ్యాడు. భూత్పూర్ సీఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో నిందితుడు వదిలేసిన దొరికిన సెల్‌ఫోన్ పుటేజీ పరిశీలించగా ఓ వైకోషరాం నుంచి దొరికింది. శనివారం టీడీగుట్ట బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసి విచారించగా, ఇదే వరకు హత్యలు చేసినట్టు ఒప్పుకున్నాడు. హత్యకు గురైన వారిలో సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంకు చెందిన మల్లేశ్ పాలమూరులో పనికోసం రాగా గత ఏడాది భాస్కర్ పరిచయం చేసుకుని, రూ.3వేలు అప్పుగా తీసుకున్నాడు. తిరిగి ఇవ్వమని కోరగా ముఖంపై రాళ్లతో కొట్టి చంపాడు. జమిస్తాపూర్‌కు చెందిన పద్మావతి సీత మ్మ(44), మరో మహిళను మన్యంకొండ గుడి సమీపంలో గుట్టలో హత్య చేశాడు. వనపర్తి జిల్లా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకరిని, నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి పీఎస్ పరిధిలో మరో మహిళను హత్య చేశాడు. కేసును ఛేదించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, మూసాపేట పీఎస్ సీసీ జమీర్, అడ్డాకల్ పీఎస్ నవీన్ కుమార్‌ను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ సీఐ రామకృష్ణ ఉన్నారు.

జూన్‌లో సగటున రోజుకో హత్య!

- వెలుగులోకొచ్చినవి 35కి పైగానే..
- ప్రేమ, వివాహేతర దారుణాల్లో అధికం
- ప్రాణాలు తీసిన భూ తగాదాలు
- తీవ్రంగా పెరిగిన ప్రతీకార హత్యలు
- ఖాకీలంటే కనిపించని భయం
- పోలీసింగ్ గాడితప్పిన ఫలితం



హైదరాబాద్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఒక్క జూన్‌లోనే సుమారు 36 వరకు మర్డర్లు జరగడం కలకలం రేపింది. తెలంగాణలో పోలీసింగ్ గాడితప్పిందనడానికి ఈ దారుణాలే నిదర్శనంగా నిలిచాయి. అత్యంత క్రూరమైన, దారుణ హత్యలే వెలుగులోకి రాగా మరుగున పడ్డవి ఇంకా ఎన్నున్నాయో పోలీసు ఇన్ఫర్మేషన్ నివేదికలో తెలుస్తున్నది. ఈ నెలలో జరిగిన హత్యల్లో వివాహేతర సంబంధ దారుణాలే ఎక్కువగా ఉన్నాయి. భర్తల అడ్డు తొలగించుకునేందుకు భార్యలు, భార్యల అడ్డు తొలగించుకునేందుకు భర్తలు మానవత్వాన్ని మరిచిపోయి మూడుముళ్ల బంధాన్ని అపహాస్యం చేస్తూ అఘాయిత్యాలకు తెగబడ్డారు. తమ అక్రమ బంధానికి అడ్డుగా ఉన్నారనే పిల్లలు చూస్తే ఎక్కడ తన భర్త, లేదా భార్యకు చెప్తారోనని భయంతో కడుపున పుట్టిన పిల్లలను సైతం దారుణంగా చంపుతున్నారు. కాగా జూన్‌లో భూ తగాదాల కారణంగా జరిగిన హత్యలు కలకలం రేపాయి. నారాయణపేట జిల్లా ఉట్కూరులో ఓ వ్యక్తిని కుటుంబసభ్యుల ఎదుటే కొట్టి చంపడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమిరెడ్డిలో భూ వివాదం కారణంగా ఒకరిని హతమార్చారు. ఘట్‌కేసర్‌లో మాజీ ఎంపీటీసీ సత్యరెడ్డి, ఇద్దరు జిల్లా రఘునాథపాలెం మండలం శివాయిగూడెంలో భూ తగాదాలతోనే బీఆర్ఎస్ కార్యకర్త తేజావత్ ఈర్యాను హతమార్చారు.

ప్రతీకార హత్యలతో కలవరం

ఇటీవల తెలంగాణలో ప్రతీకార హత్యలు మితిమీరి పెరిగాయి. తమ వారిని చంపారని ప్రతీకారంతో హత్యలో పాల్గొన్న వారిని చంపడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో రౌడీషీటర్లను నిత్యం పర్యవేక్షణ లేనందున నడిరోడ్లపైనే చంపేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఈ తరహా ప్రతీకార హత్యలు భారీగా నమోదయ్యాయి. రెయిన్ బజార్‌కు చెందిన నజాఫ్ అనే పలు హత్య కేసుల్లో నిందితుడు. అతన్ని కుళ్లబాగా రాత్రి కొందరు వ్యక్తులు దారుణంగా చంపేశారు. అసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహమ్మద్ షేక్ ఆలీషాన్, ఉస్మాన్‌గంజ్ గంగాబౌలికి చెందిన కుటుంబసభ్యులనే హత్యచేశారు. రంగారెడ్డి జిల్లా కల్వకోటే పోలీస్ స్టేషన్ పరిధిలో బీజేపీకి చెందిన జక్కుల తన శవం నందిపాల్టా గ్రూపులో తన బర్త్‌డే ఫొటోలు తొలగించారనే నెపంతో శేషగిరి రెడ్డిని, గండిపేటలోని శివునిరాజు ఇంటికి పిలిపించి మరీ హత్యచేశారు.

ఈ నెలలో జరిగిన దారుణాల్లో కొన్ని..

- జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధి వెంకటేశ్వరనగర్‌లో అనిల్‌ను కత్తులతో పొడిచారు.
- వివాహేతర సంబంధమే కారణం.
- కూకట్‌పల్లి అల్లాపూర్‌కు చెందిన దానిష్‌ను ప్రేమ విషయంలో ఓ రౌడీషీటర్ కొడుకు, స్నేహితులు కలిసి హత్యచేశారు.
- రంగారెడ్డి జిల్లా నార్సింగిలో ఇజాయత్ అలీ అనే ఆంజనేయ్‌ను ప్రేమవివాహంలోనే దుండగులు హతమార్చారు.
- రాజేంద్రనగర్‌లో రాయ్ పెట్టలేదని కోడలిని అత్త మన్నతో కొట్టి చంపింది.
- సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లో మాజిబు తాగుడుకు బానిసై కూతురి పెళ్లి అవసరాల ప్రర్టీకి దెబ్బతో కొట్టి, కూతురు కలిసి చంపారు.
- హైదరాబాద్ పాతగిరిగుట్టకు చెందిన ఉస్మాన్‌ను ప్రేమ వ్యవహారంలో హత్యచేశారు.
- మహబూబ్‌నగర్ జిల్లా జామపేటలో అక్కాచెల్లెళ్లను తన సమతను భర్త హత్యచేశాడు.
- కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌లో మామతో కలిసి భర్త కుర్మ రాములును భార్య చంపేసింది.
- ప్రేమను అంగీకరించలేదని మూసాపేటలో ఇంటర్ విద్యార్థిని హత్యచేశాడు.
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మొకం చిన్న అంజనేయులును కూతురు ప్రేమ వ్యవహారంలో అంతమొందించారు.
- ఫలక్‌నుమా, రంగారెడ్డిలో వివాహేతర సంబంధం నేపథ్యంలో హసన్‌నగర్ బాబా కాంటా ప్రాంతానికి చెందిన డ్రైవర్ జాకీర్ అలీ, మోత మహబూబ్‌ను చెందిన సోహేల్ హత్యకు గురయ్యారు.
- హైదరాబాద్ ఆసిఫ్‌నగర్‌లో బొంగుకరానికి వచ్చిన సయ్యద్ సమీర్ బాధిను దాడిలో మృతి చెందాడు.
- ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మహమ్మద్ షేక్ ఆలీషాన్‌ను హత్యచేశారు.
- మియాపూర్‌లో మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన నరేశ్ ఆలీన్ గుండెలో బాణాన్ని కూతురిని హత్యచేశారు.
- హైదరాబాద్‌లోని ఈకాల్‌గాండీ పరిధిలో లక్ష్మణ్ తన భార్య రోజాను చంపేశాడు.
- ఆదిలాబాద్ జిల్లాలో వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్‌ను భార్య విజయలక్ష్మి చంపేసింది.
- కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం సోమిరెడ్డిలో కుర్మ దుర్గయ్యను భూ వివాదం నేపథ్యంలో హత్యచేశారు.



నాలుగో విలువైన బ్రాండ్‌గా ఎల్ఐసీ

బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100 నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, జూన్ 29: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ మరో ఖ్యాతిని సాధించింది. దేశీయంగా ఉన్న కార్పొరేట్ బ్రాండ్లలో అత్యంత విలువైన నాలుగో సంస్థగా అవతరించింది. కంపెనీ బ్రాండ్ విలువ 9.8 బిలియన్ డాలర్లతో ఈ స్థానం దక్కించుకున్నదని బ్రాండ్ ఫైనాన్స్ ఇండియా 100-2024 విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఏఏఏ బ్రాండ్ రేటింగ్‌తో సంస్థకు 88 స్కోర్ సాధించినట్లు తెలిపింది. అలాగే టాప్-10 బలమైన దేశీయ బ్రాండ్లలో మూడో స్థానంలో నిలిచింది. బీమా బ్రాండ్ల ర్యాంకింగ్‌లో ఎల్ఐసీ తన తొలిస్థానాన్ని పదిలపరుచుకున్నది కూడా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బీమా సంస్థల విలువలో 9.8 బిలియన్ డాలర్లతో ఎల్ఐసీ తొలి స్థానంలో నిలిచింది. క్యాథీ లైఫ్ ఇన్సూరెన్స్ రెండో స్థానంలో నిలువగా, ఎన్ఆర్ఎంఏ ఇన్సూరెన్స్ ఆ తర్వాతి స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.50 శాతం వాటా ఉండగా, ప్రజలకు 3.50 శాతం వాటా ఉన్నది. స్టాక్ మార్కెట్లో లిస్టైన సంస్థలో ప్రజలకు కనీసంగా 10 శాతం వాటా ఉండాలనే నిబంధనలతో ఎల్ఐసీకి మరో మూడేండ్ల గడువు ఇచ్చింది. మే 16, 2027 నాటికి ఎల్ఐసీలో ప్రజల వాటా 10 శాతానికి పెంచుకోవాలని సూచించింది. మే 17, 2022లో స్టాక్ మార్కెట్లో లిస్టైన విషయం తెలిసిందే. 3.5 శాతానికి సమానమైన 22.13 కోట్ల షేర్లను బహిరంగ మార్కెట్లో కేంద్ర ప్రభుత్వం విక్రయించింది.

పెట్టుబడి పెట్టాను.. అంతలేదు

ఓ మదుపరి, గ్రో యాప్ మధ్య వివాదం



ముంబై, జూన్ 29: తాను పెట్టుబడి పెట్టా నంటూ ఓ మదుపరి.. అంతలేదని గ్రో యాప్ పరస్పర వ్యాఖ్యానాలకు దిగుతున్నాయి. యాప్ ద్వారా తాను ఓ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పథకంలో పెట్టుబడి పెట్టినట్టు కనిపిస్తున్నదని, కానీ దాన్ని తిరిగి ఉపసంహరించుకోలేకపోతున్నానని సదరు ఇన్వెస్టర్ చెప్తుండగా.. అసలు అంతగా ఎంఎఫ్ లావాదేవీనే జరుగలేదని గ్రో యాప్ కొట్టిపారేస్తున్నది.

మదుపరి చెప్తున్నది..

2020లో గ్రో యాప్ ద్వారా పరాగ్ పరీఖ్ మ్యూచువల్ ఫండ్ స్కీంలో తన సోదరి పెట్టుబడి మొదలుపెట్టిందని హసేంద్ర ప్రతాప్ సింగ్ ఓ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. లావాదేవీ విజయవంతమైనట్టు ఓ పోర్టిఫోలియో నంబర్ కూడా వచ్చిందని తెలిపారు. గ్రో యాప్ కూడా ఇప్పటిదాకా పెట్టుబడి మొత్తాన్ని చూపించిందని, ఇతర ఫండ్స్ మాదిరిగానే అన్ని వివరాలను అందించిందని తెలియజేశారు. అయితే తమ పెట్టుబడిని అకౌంట్ స్థాయిలో తిరిగి తీసుకుందామంటే కుదరట్లేదని వాపోయారు. దీనికి కారణం ఏంటని గ్రో కస్టమర్ కేర్‌ను సంప్రదించినా ఫలితం లేకపోయిందని సింగ్ అంటున్నారు.

గ్రో యాప్ వైపు నుంచి..

ఈ వివాదంపై గ్రో యాప్ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఇక్కడ ఎలాంటి మోసానికి తావులేదన్నది. సదరు కస్టమర్ దగ్గరున్న పెట్టుబడుల మొత్తంలో సగదు అందలేదని, రీక్యాస్టిజేషన్ సమస్య వల్ల ఇన్వెస్ట్‌మెంట్ ఇలా చూపుతున్నదని వెల్లడించింది. గ్రో యాప్ వివరాల ప్రకారం.. తొలుత 2020 సెప్టెంబర్ 25న రూ.10,000 పెట్టుబడి సదరు మదుపరి పెట్టారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ఐఎస్ఐపీ వేదికతో నేరుగా లింక్డైన ఓ బ్యాంక్ ద్వారా ఈ లావాదేవీ జరిగింది. తొలి ఆర్డర్ ఐడీ 1XXXXXXX6. 2022 జూన్ 27న మరో పోలియో నుంచి రూ.50,000 లావాదేవీ జరిగింది. కానీ ఐడీ మాత్రం ఇదే (1XXXXXXX6). ఈ క్రమంలోనే తమ సిస్టమ్‌లో ఐడీ 1XXXXXXX6పై రూ.10వేల పెట్టుబడికి బదులు తర్వాత వచ్చిన రూ.50వేల పెట్టుబడి కనిపిస్తున్నదని గ్రో యాప్ పేర్కొన్నది. కానీ ఆ మొత్తం తమకు ఇప్పటికే అందలేదని చెప్పింది. వాస్తవానికి సింగ్ సోదరి పోయిన ఆగస్టులోనే బ్యాకప్ ఉన్న పెట్టుబడి రూ.10వేలను గ్రో యాప్ చెప్పున్నది. బీఎస్ఈ నుంచి కూడా తమకు ఇదే ధ్రువీకరణ వచ్చిందన్నది.

ఎస్బీఐ చైర్మన్‌గా పాలమూరు బిడ్డ

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం బాస్‌గా సీఎస్ శెట్టి





సీఎస్ శెట్టి

న్యూఢిల్లీ, జూన్ 29: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) నూతన చైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి నియమితులవుతున్నారు. ప్రస్తుతం ఎస్బీఐ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీఎస్ శెట్టిని ఎస్బీఐ చైర్మన్‌గా ఆర్థిక సేవల సంస్థల బ్యూరో(ఎఫ్ఎస్ఐబీ) సిఫారసు చేసింది. ప్రస్తుతం చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న దినేశ్ కుమార్ ఖారా ఈ ఏడాది ఆగస్టు 28న పదవీ విరమణ చేయబోతున్నారు. ఆయన స్థానంలో నూతన వ్యక్తిని నియమించడానికి ఎఫ్ఎస్ఐబీ పలువురు సీనియర్ ఉన్నతాధికారులను శనివారం ఇంటర్వ్యూ చేసింది. వీరిలో శెట్టి కూడా ఒకరు. బ్యాంక్‌లో వారి పనితీరు, అనుభవం, ప్రస్తుత పరిమితులను దృష్టిలో పెట్టుకొని చల్లా శ్రీనివాసులు శెట్టిని(సీఎస్ శెట్టి) ఎస్బీఐ చైర్మన్ పదవికి సిఫారసు చేసినట్లు ఎఫ్ఎస్ఐబీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్(ఏసీసీ) కమిటీ సమావేశమై ఎఫ్ఎస్ఐబీ సూచించిన వ్యక్తిపై తుది నిర్ణయం తీసుకోనున్నది. జనవరి 2020లో బ్యాంక్ ఎండీగా నియమితులైన శెట్టి..ప్రస్తుతం ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ వర్టికల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను శెట్టి బేసిక్ వేతనం కింద రూ.28.3 లక్షలు, డీఏ కింద మరో రూ.9.7 లక్షలు అందుకున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పలు పోర్ట్‌ఫో కమిటీలకు ఆయన సారథ్యం వహించారు. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని మానవపాడు మండలంలోని పెద్ద పోతులపాడు గ్రామంలో ఏడో తరగతి వరకు చదువుకున్నారు. ఆపై గద్వాల్‌లో ఉన్నత చదువులు చదివారు. రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ నుంచి బీఎస్ అగ్రికల్చర్‌లో పట్టా పొందారు. ఎస్బీఐలో 1988లో ప్రొబేషనరీ ఆఫీసర్ స్థాయిలో కెరియర్ ప్రారంభించిన శెట్టి..బ్యాంకింగ్ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్ అండ్ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ విధులు నిర్వహించారు.


- ఎస్బీఐ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్‌గా కార్పొరేట్ అకౌంట్స్ గ్రూపులో విధులు నిర్వహించారు.
- కమర్షియల్ బ్రాంచ్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా కూడా పనిచేశారు.

ఎఫ్ఎస్ఐబీలో సభ్యులు:

- డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ) మాజీ కార్యదర్శి భాను ప్రతాప్ శర్మ అధ్యక్షుడు
- సభ్యులుగా ఆర్థిక సేవల కార్యదర్శి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెక్రటరీ, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్
- ఇతర సభ్యులుగా ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ మాజీ చైర్మన్, ఎండీ అనిమేశ్ చౌహాన్, ఆర్బీఐ మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపక్ సింఘాల్, ఐఎన్‌జీ వైశ్యా బ్యాంక్ మాజీ ఎండీ శైలేంద్ర భండారి

విద్యా రుణాల్లో ఎగవేతలెక్కువే

గృహ రుణాల్లో తక్కువ • ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 29: వ్యక్తిగత రుణాల విభాగంలో విద్యా రుణాల్లోనే ఎక్కువగా ఎగవేతలున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) తమ తాజా నివేదికలో వెల్లడించింది. గృహ రుణాల్లో డిఫాల్టర్లు తక్కువగా ఉన్నట్టు చెప్పింది. పర్సనల్ లోన్లలో నిరర్థక ఆస్తులు (మొండి బకాయిలు లేదా ఎన్‌పీఏ) అత్యధికంగా ఎడ్యుకేషన్ లోన్లలోనే ఉన్నాయని ఈ ఏడాది జూన్‌కుగాను ఆర్బీఐ విడుదల చేసిన ఆర్థిక సుస్థిరత నివేదిక (ఎఫ్ఎస్ఆర్)లో తేలింది. ఆ తర్వాతి స్థానాల్లో క్రెడిట్ కార్డు రుణాలు, వాహన రుణాలున్నాయి.. చివరి స్థానంలో గృహ రుణాలున్నట్టు స్పష్టమైంది.

విదేశీ చదువులతో..

విదేశీ చదువుల కోసం విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారని, అందుకే ఐదేండ్లలోనే విద్యా రుణాలు బాగా పెరిగిపోయాయని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే వ్యక్తిగత రుణాల మొండి బకాయిల్లో విద్యా రుణాల వాటా 3.6 శాతానికి చేరిందంటున్నారు. అయితే అన్ని పర్సనల్ లోన్ విభాగాల్లో షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుల ఆస్తుల నాణ్యతలో మెరుగైన స్థితిలో పెరుగుదల కనిపిస్తున్నట్టు ఆర్బీఐ తాజా నివేదిక పేర్కొన్నది. ఈ క్రమంలోనే అన్ని బ్యాంక్ గ్రూపుల వ్యాప్తంగా వ్యక్తిగత రుణాల్లో మొండి నిరర్థక ఆస్తుల క్షీణత కనిపిస్తున్నదని ఎఫ్ఎస్ఆర్‌లో సెంట్రల్ బ్యాంక్ తెలియజేసింది. ఇక పారిశ్రామిక రంగం పరంగా చూస్తే మౌలిక, ట్రాన్స్‌పోర్ట్ ఎక్విప్‌మెంట్ విభాగాలు తప్ప అన్ని ప్రధాన ఉప రంగాల్లో అసెట్ క్వాలిటీ మెరుగుపడినట్టు కూడా పేర్కొన్నది.

హోం లోన్లకు గిరాకీ

పర్సనల్ లోన్లలో గృహ రుణాలకు ఈ ఏడాది మార్చిలో గిరాకీ 36.5 శాతం పెరిగిందని ఆర్బీఐ చెప్పింది. 25.2 శాతంతో తర్వాతి స్థానంలో క్రెడిట్ కార్డులున్నాయి. 20.5 శాతంతో విద్యా రుణాలు 3వ స్థానంలో, 19.9 శాతంతో ఇతర వ్యక్తిగత రుణాలు 4వ స్థానంలో ఉన్నాయి. వాహన రుణాలకు 18.3 శాతం డిమాండ్ కనిపించింది. కాగా, ప్రైవేట్ రంగ బ్యాంకుల రుణాల వృద్ధిలో సూక్ష్మమైన వ్యక్తిగత రుణాలే ఉండటం గమనార్హం. ఇదిలావుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో క్రెడిట్ కార్డు రుణ బకాయిలు 23 శాతంగా ఉన్నాయి. అయితే నిరుడు ఇవి 31 శాతంగా ఉన్నాయి. ఈ ఏప్రిల్‌లో రిటైల్ రుణాల్లో వృద్ధి 17.1 శాతంగా ఉన్నది. నిరుడు 25.7 శాతం.

ఆర్బీఐ హెచ్చరికలు

భారీగా పెరుగుతున్న వ్యక్తిగత, అన్‌సెక్యూర్డ్ రుణాలపై బ్యాంకింగ్, ఇతర రుణదాతలను ఆర్బీఐ హెచ్చరిస్తూనే ఉన్నది. ఈ క్రమంలోనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అంతర్గత నిఘా వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు.

సోలార్ పథకంతో ఔత్సాహికుల ఇక్కట్లు

పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 29 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన పీఎం సూర్యఘర్-ముఫ్త్ బిజిలీ పథకం క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదని, దరఖాస్తు చేసుకోవాలనుకునే ఔత్సాహికులకు పోర్టల్ ముప్పుతిప్పలు పెడుతున్నదని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు బీ అశోక్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం ద్వారా ఇళ్ల పైకప్పులపై సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు వేలాది మంది ఆసక్తి చూపుతున్నా.. పథకంలో పొందుపరిచిన నిబంధనల కారణంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. ముఖ్యంగా నాలుగు నెలలు గడిచినప్పటికీ అధికారిక పోర్టల్లో సాంకేతిక లోపాల కారణంగా దరఖాస్తులు స్వీకరణ విధానం పనిచేయకపోవడంతో ఔత్సాహికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం



మాట్లాడుతున్న తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్

కింద అపార్ట్‌మెంట్లు, సొసైటీలు ఏర్పాటు చేసుకునేందుకు పోర్టల్ అనుమతించడం లేదని పలువురు ఔత్సాహికులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సులభతరమైన విధానాన్ని కేంద్రం అమలు చేయాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నది. దీనిపై చర్యలు తీసుకోపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక నిరాహార దీక్ష చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సిడ్బీ చీఫ్‌గా రవి అగర్వాల్

న్యూఢిల్లీ, జూన్ 29: ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) నూతన చైర్మన్‌గా రవి అగర్వాల్ నియమితులయ్యారు. 1988 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి రవి.. ప్రస్తుతం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నితిన్ గుప్తా స్థానాన్ని భర్తీ చేయనున్నారు. సీబీడీటీ చీఫ్‌గా జూన్, 2022లో నియమితులైన గుప్తా గతేడాది సెప్టెంబర్‌లోనే పదవీ విరమణ కావాల్సి ఉండగా, పదవీ కాలాన్ని తొమ్మిది నెలలు పొడిగించింది. దీంతో ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు.

టికెట్లపై ఆకాశ ఎయిర్ ఆఫర్

న్యూఢిల్లీ, జూన్ 29: చౌక విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్.. దేశీయంగా నడిచే విమాన టికెట్లపై 20 శాతం వరకు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. 'సేవర్ అండ్ ఫ్లెక్సీ' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్ దేశీయంగా నడుస్తున్న 22 రూట్లకు వర్తించనున్నది. ఈ ఆఫర్ జూలై 1 వరకు అందుబాటులో ఉండనున్నది. ఈ ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు జూలై 5 నుంచి సెప్టెంబర్ 30 లోగా ప్రయాణం చాల్సి ఉంటుందని తెలిపింది.

జూలైలో కెమెరా ముందుకు?



ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కల్యాణ్ చేతిలో ప్రస్తుతం మూడు సినిమాలున్నాయి. అందులో ఒకటి 'హరిహరవీరమల్లు' కాగా, రెండోది 'ఓజీ', మూడోది 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ మూడు సినిమాలు పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రస్తుతం పవన్‌పై ఉంది. జూలై నుంచి పవన్ షూటింగుల్లో పాల్గొంటారని ఫిల్మ్‌నగర్ టాక్. ముఖ్యంగా క్రిష్ దర్శకత్వంలో మొదలైన 'హరిహరవీరమల్లు' సినిమా 70శాతం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఆ మిగిలిన పార్ట్‌ని ఏ.ఎం.రత్నం తనయుడు జ్యోతికృష్ణ పూర్తి చేయనున్నారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలోని తొలి పార్ట్‌ను ఎట్టిపరిస్థితుల్లో ఈ ఏడాదే విడుదల చేయాలనే గట్టి తలంపుతో ఉన్నారు నిర్మాత ఏ.ఎం.రత్నం. పవన్ షూటింగులు మొదలుపెడితే.. తొలుత పూర్తి చేయాల్సిన సినిమా ఇదే కావడం గమనార్హం. ఈ సినిమా గురించి ఏ.ఎం.రత్నం మాట్లాడుతూ 'ప్రస్తుతం సీజీ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమాలో గ్రాఫిక్స్ అద్భుతంగా ఉంటాయి. ఇరాన్‌కి చెందిన ప్రముఖ కంపెనీతో మరికొన్ని ఇతర సంస్థలతో ఓవర్సీస్ సన్నివేశాలకు సీజీ వర్క్స్ చేయిస్తున్నాం. ఇందులో కుస్తీ పోటీల ఎపిసోడ్ ఉంది. దానికి సంబంధించిన సీజీవర్క్స్ బెంగళూరులో జరుగుతున్నది. అలాగే.. చార్మినార్ ఎపిసోడ్ సీజీ వర్క్స్ ఫ్లోరిడాలో జరుగుతున్నాయి. పవన్‌కల్యాణ్ పోరాట సన్నివేశానికి సంబంధించిన సీజీ వర్క్స్ ఇవన్నీ జరుగుతున్నాయి' అని తెలిపారు. డిప్యూటీ సీఎంగా ఉన్న పవన్‌కల్యాణ్ సినిమాలు చేస్తారా? లేదా? అనే ప్రశ్నలతో సతమతమవుతున్న అభిమానులకు ఏ.ఎం.రత్నం ఓ విధంగా శుభవార్త చెప్పారు.

'కల్కి'తో దీపికా రికార్డు



చిత్రం

ఐదేండ్ల క్రితం ముందుకొచ్చిన 'కల్కి' చిత్రం వెండితెరపై ఓ సరికొత్త ప్రపంచాన్ని సాక్షాత్కరింపజేస్తూ విజువల్ వండర్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల మన్ననలు అందుకుంటున్నది. తొలి రెండు రోజుల్లో 298కోట్ల కలెక్షన్స్ సాధించి బాక్సాఫీస్ వద్ద చిత్రం మార్క్‌ను దాటేస్తూ నెమ్మదిగా ప్రస్థానం కలిగిస్తున్నది. ఈ సినిమాలో సుమతి పాత్రలో దీపికా పదుకొనే అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. 'కల్కి' చిత్రం ద్వారా దీపికా పదుకొనే ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. దీపికా సినీ కెరీర్‌లోనే హయ్యెస్ట్ ఓపెనింగ్ డే కలెక్షన్లు సాధించిన చిత్రంగా 'కల్కి' నిలిచింది. ఇప్పటివరకు హిందీలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ చిత్రాలతో పాటు రోహిత్‌శెట్టి కాప్ యూనివర్స్ వంటి భారీ చిత్రాల్లో భాగమైంది దీపికా పదుకొనే. అయితే ఈ చిత్రాలను అధిగమిస్తూ తొలి రోజు అత్యధిక వసూళ్లతో 'కల్కి' రికార్డ్ సృష్టించింది. గత ఏడాది దీపికా పదుకొనే నటించిన 'పఠాన్' చిత్రం తొలి రోజు 106కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. తాజాగా 'కల్కి' తొలి రోజు 191 కోట్ల వసూళ్లతో రికార్డు క్రియేట్ చేసింది. తన కెరీర్‌లోనే హైయెస్ట్ అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా 'కల్కి' దీపికా పదుకొనే కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోనుంది. ఇదిలావుండగా భారతీయ సినిమాల్లో ఆర్ఆర్ఆర్ (223 కోట్లు), బాహుబలి-2 (231 కోట్లు) చిత్రాలు తొలి రోజు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలుగా నిలవగా, ఇప్పుడు మూడోస్థానంలో 'కల్కి' ఉండటం విశేషం.

అభిప్రాయాలను అడిగి తప్పుచేశాను



'సినిమాటిక్ యూనివర్స్' ఇప్పుడు ప్రపంచ సినిమాలో ఇదో ట్రెండ్. నిజానికి ఇది అవుట్ డేటెడ్ ట్రెండ్ అని చెప్పాడు శంకర్. సీక్వెల్ అంటే కథను కొనసాగించడం. 'సినిమాటిక్ యూనివర్స్' అంటే ఒక సినిమాలోని పాత్రలనో, లేక ఆ సినిమా ప్రపంచాన్నో మరో సినిమాలో కొనసాగించడం. హాలీవుడ్ సిరీస్ 'అవెంజర్స్' నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. చెప్పొచ్చు. తమిళంలో వచ్చిన ఖైదీ, విక్రమ్ సినిమాలు ఈ కోవకు చెందిన చిత్రాలే. అయితే.. ఈ ఆలోచన దర్శకుడు శంకర్‌కి 2008లోనే వచ్చిందట. కానీ కార్యరూపం దాల్చలేదు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా తెలిపారు. 'రోబో' టైమ్‌లో ఓ ఆలోచన వచ్చింది. భారతీయుడు, ఒకేఒక్కడు, శివాజీ.. ఈ మూడు సినిమాల్లోని హీరో పాత్రల్ని కలుపుతూ ఒక సినిమా చేస్తే ఎలా ఉంటుంది? అనేది నా ఆలోచన. వెంటనే నా అసిస్టెంట్లకు ఈ ఆలోచన చెప్పాను. వాళ్లు సమాధానం ఇవ్వరా? సరే నా భార్యకు చెప్పాను. వాళ్లకు ఈ ఆలోచన నచ్చలేదని అర్థమైంది. కానీ నాకు మాత్రం ఈ ఐడియా అద్భుతంగా అనిపించింది. అందుకే ఇంటికెళ్లి నా భార్యకు, పిల్లలకు చెప్పాను. వాళ్లనుంచి సరైన స్పందన లేదు. స్నేహితులతో చెప్పాను. నిరాకరించారు. నా ఆలోచన కార్యరూపం దాల్చలేదు. కొన్నాళ్లకు హాలీవుడ్‌లో 'అవెంజర్స్' వచ్చింది. మాలో చూశాక, 'మీకిదివరకు కొత్త ఆలోచన వస్తే ఎవర్నీ అడక్కండి. నా మనసు చెప్పింది. ఈ ప్రపంచంలో ఎవరో ఒకరు తీసేస్తారు.' అని నా అసిస్టెంట్లకు చెప్పాను. ఆ రోజు ఎవరి అభిప్రాయం అడక్కుండా నేను ఆ ప్రయోగం చేసుంటే.. ఇండియాలో 'సినిమాటిక్ యూనివర్స్' తీసుకొచ్చిన తొలి దర్శకుడిని అయ్యేవాణ్ని' అంటూ గతాన్ని నెమరువేసుకున్నారు శంకర్.

దసరా బరిలో కంగువ



తమిళ అగ్రనటుడు సూర్య నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కంగువ'. దిశాపటాని ఇందులో కథానాయిక. శివ ఈ చిత్రానికి దర్శకుడు. కేఈ జ్ఞానవేల్‌రాజా, వంశీ, ప్రమోద్ కలిసి అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. 'భారతీయ సినీ పరిశ్రమ నుంచి వస్తున్న మరో భారీ చిత్రమిది. ఇప్పటివరకూ తెరపై రాని కొత్త కాన్సెప్ట్‌తో దర్శకుడు శివ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. పది భాషల్లో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పలు అంతర్జాతీయ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. 'కంగువ' త్రీడీ వెర్షన్ కూడా ఉంటుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది. సినిమా అంతకు మించి ఉంటుంది' అని తెలిపారు నిర్మాతల్లో ఒకరైన జ్ఞానవేల్‌రాజా. బాబీ డియోల్ ప్రత్యేక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కథ: శివ, ఆదినారాయణ, మాటలు: మదన్ కార్కీ, కెమెరా: వెట్రి పళనిస్వామి.

'కూర్మనాయకి'లో శివాజీ



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, ఆతిరా రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కె.విజయరావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో శివాజీ ఓ కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. శనివారం ఆయన జన్మదినం సందర్భంగా ఆయన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. మహిమాన్విత అవతారాల్లోని కూర్మావతారం నేపథ్యంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, అత్యున్నత సాంకేతిక విలువలతో అలరిస్తుందని, ఈ సినిమాలో శివాజీ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో నటించనున్న ఓ స్టార్ హీరో వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర, రచన-దర్శకత్వం: హర్షవర్ధన్ కడియాల.

అవి తెలియక చేసిన తప్పులు



ఓ వైపు సినిమాలు చేస్తూ, మరో వైపు ప్రజలకు ఆరోగ్యానికి సంబంధించిన టిప్స్ ఇస్తున్నది అగ్ర కథానాయిక సమంత. తన ఫిట్‌నెస్ ట్రైనర్ అల్కేష్ షరోత్రతో కలిసి 'టేక్ 20' పేరుతో పాడ్‌కాస్ట్ వేదికగా ఆరోగ్య సూత్రాలను వెల్లడిస్తున్నది ఈ అందాలభామ. ఇందులో భాగంగా ఆరోగ్యకరమైన ఆహారాన్ని కూడా ప్రమోట్ చేస్తున్నది. ఇది లా ఉంటే.. సమంత ఇన్‌స్టాగ్రామ్‌పై ఓ నెటిజన్ ప్రశ్నల దాడి చేశాడు. 'ఇప్పుడే సూత్రాలను చెబుతున్నారు బాగానే ఉంది. గతంలో మీరు ఆరోగ్యానికి హానికరమైన బ్రాండ్లను ప్రమోట్ చేశారు. దానికేం సమాధానం చెబుతారు?' అని అడిగాడు. దాంతో కంగుతిన్న సామ్ వంత్తైంది. వెంటనే తను రియాక్ట్ అవుతూ 'గతంలో తప్పులు చేసిన మాట నిజమే. అవి తెలియక చేసిన తప్పులు. తెలుసుకున్న తర్వాత అలాంటి వాటిని ప్రమోట్ చేయడం పూర్తిగా ఆపేశాను. ప్రస్తుతం ఏదైతే ఆచరిస్తున్నానో.. వాటిని మాత్రమే చెబుతున్నాను' అని తెలిపారు. ప్రస్తుతం తన సొంత నిర్మాణ సంస్థలో 'మా ఇంటి బంగారం' అనే సినిమాను రూపొందిస్తున్నది సమంత.



సినీ ఇండస్ట్రీలో హిట్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవడం కష్టం. వచ్చిన పేరును నిలబెట్టుకోవడం మరింత కష్టం. బాలీవుడ్‌తోపాటు టాలీవుడ్‌లోనూ సూపర్ హిట్ సినిమాల్లో నటించి మంచి హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న భామ రిమి సేన్. 'ధూమ్' సినిమాలో అభిషేక్ బచ్చన్ సరసన నటించి హిట్ కొట్టిన ఈ భామ తెలుగులో మెగాస్టార్ చిరంజీవి 'అందరివాడు'లోనూ మెరిసింది. 2003లో 'హంగామా' సినిమాతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన రిమి సేన్ గరం మసాలా, ఫిర్ హెరా ఫెరీ, గోల్‌మాల్, బాగ్‌బాన్ సినిమాలతో స్టార్ హీరోయిన్ స్థాయికి ఎదిగింది. అయితే, ప్రాధాన్యం లేని పాత్రలు రావడం వల్లే అప్పట్లో కొన్ని సినిమాలు చేయలేదని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది రిమి. 'కొన్ని కథల్లో నా పాత్రకు పెద్దగా ప్రాధాన్యం ఉండేది కాదు. హంగామా, జానీ గద్దార్ లాంటి చిత్రాల్లో మంచి పాత్రలు చేశా. ఆ తర్వాత అలాంటి పాత్రలే వస్తే బాగుంటుందని కోరుకున్నా. కానీ వర్కవుట్ కాలేదు. అందుకే నా కెరీర్ అనుకున్నంత సక్సెస్ కాలేదు'ని రిమి వ్యాఖ్యానించింది. 'ఈ ఇండస్ట్రీలో టాలెంట్‌కు అంతగా ప్రాధాన్యం లేదు. ముందుగా వ్యక్తులను ఎలా మేనేజ్ చేయాలో తెలియాలి. లేకపోతే ఏ పనీ జరగదు. చాన్సుల కోసం అడుక్కోవడం, పీఆర్ చేయడం నాకు రాదు. స్నేహితులే నన్ను మోసం చేశారు' అని వాపోయింది రిమి సేన్.







కల్కితో లక్ష్యాన్ని చేరుకున్నాం

అగ్ర నిర్మాత సి.అశ్వనీదత్ నెలకొల్పిన వైజయంతీ మూవీస్ ఈ ఏడాదితో యాభై వసంతాలను పూర్తి చేసుకుంది. ఈ ప్రయాణంలో ఎన్నో కమర్షియల్ బ్లాక్‌బస్టర్స్‌ను అందించింది. వైజయంతీ మూవీస్ గోల్డెన్‌జూబ్లీ ఇయర్‌లోకి అడుగుపెట్టిన తరుణంలో 'కల్కి 2898' రూపంలో అపూర్వ విజయాన్ని దక్కించుకొని చరిత్ర సృష్టిస్తున్నది. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా రికార్డుస్థాయి వసూళ్లతో దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో నిర్మాత సి.అశ్వనీదత్ పంచుకున్న విశేషాలు..

మా చిత్రానికి తెలుగు రాష్ర్టాలతోపాటు దేశవ్యాప్తంగా అపూర్వ స్పందన లభిస్తున్నది. విదేశాల నుంచి కూడా పాజిటివ్ రిపోర్ట్స్ వస్తున్నాయి. మేము ఊహించినట్టుగానే సినిమా అఖండ విజయాన్ని సాధిస్తున్నది. ఈ సందర్భంగా 'కల్కి 2898' చిత్రం ద్వారా ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న దర్శకుడు నాగ్‌అశ్విన్ క్రియేటివ్ విజన్‌కు హ్యాట్సాఫ్ చెబుతున్నా. మాకు వచ్చిన రిపోర్ట్స్ ప్రకారం తొలి రెండు రోజుల్లో 298కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఈ సినిమా మేము అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం ఆనందంగా ఉంది.

కోరినవన్నీ సమకూర్చాను

దర్శకుడిగా నాగ్‌అశ్విన్ ఎంతటి ప్రతిభావంతుడో నాకు తెలుసు. 'మహానటి' తర్వాత ఎలాంటి భారీ ప్రాజెక్ట్‌నైనా తెరకెక్కించగలడనే నమ్మకం ఏర్పడింది. అతను ఏ కథ చెప్పినా నో చెప్పకుండా ముందుకువెళ్లమని మా అమ్మాయిలకు చెప్పాను. నేను ఇండస్ట్రీలోకి వచ్చి యాభై ఏళ్లయింది. నిర్మాతగా నా తొలి చిత్రం 'ఎదురులేని మనిషి' నుంచి 'కల్కి' వరకు దర్శకుడు చెప్పింది వినడం, తనకు కావాల్సింది సమకూర్చడం తప్ప డిస్టర్బ్ చేయను. 'కల్కి' విషయంలోనూ నాగ్‌అశ్విన్ కోరినవన్నీ సమకూర్చాను.



> ఈ కథ అనుకున్నప్పుడే రెండో భాగం కూడా తీయాలనే ఆలోచన వచ్చింది. కమల్‌హాసన్‌గారు ఈ ప్రాజెక్ట్‌లోకి ఎంటరైన తర్వాత సెకండ్ పార్ట్ పక్కాగా తీయాలని డిసైడయ్యాం. ప్రతినాయకుడు సుప్రీం యాస్కిన్ పాత్ర కోసం తొలుత కమల్‌హాసన్‌ను అనుకోలేదు. అద్భుతమైన విజువలైజేషన్ సహా మిగతా అర్టిస్టులందరినీ మొదటినుంచే అనుకున్నాం.

విజయంపై కాన్ఫిడెంట్‌గా ఉన్నాం

ఈ సినిమా విషయంలో మొదటినుంచీ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. తొలుత మే 9న

సమ్మర్‌లో విడుదల చేస్తే బాగుంటుందని అనుకున్నాం. తర్వాత జూన్ 27 లాక్ అయింది. నాగ్, స్వప్న, ప్రియాంక ఫస్ట్ కాపీ చూశారు. విజయంపై ఎలాంటి సందేహం లేదన్నారు. నాగ్ అశ్విన్ ఈ కాన్సెప్ట్ గురించి చెప్పిన రోజు ఓ కొత్త ప్రపంచంలో విహరించబోతున్నామనే అనుభూతి కలిగింది. ప్రతి అంశాన్ని

కాలంకషంగా వర్క్ చేసింది. తనదైన సృజనాత్మకతతో స్క్రిప్ట్ సిద్ధం చేశాడు. ఈ సినిమా మొదలు పెట్టే ముందు లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావుతో మాట్లాడాం. కథ విషయంలో ఆయన మంచి సలహాలు ఇచ్చారు. అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

600 కోట్లు ఖర్చు పెట్టాం

సినిమా నిర్మాణ సమయంలో రిజల్ట్స్ గురించి ఆలోచించలేదు. ఓ అత్యద్భుతమైన చిత్రాన్ని అందించాలనే తపనతో టీమ్ అందరమూ కష్టపడ్డాం. ప్రభాస్, అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, నాగ్ అశ్విన్ వెండితెరపై ఓ వండర్ క్రియేట్ చేశారు. వారి ప్రోత్సాహంతోనే సినిమాకు 600కోట్లు ఖర్చు పెట్టే ధైర్యం వచ్చింది. ప్రభాస్ అందించిన కో ఆపరేషన్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన నిజంగా డార్లింగే. ముంబయిలో జరిగిన ప్రచార కార్యక్రమంలో అమితాబ్ గారు నాకు పాదాభివందనం చేసినప్పుడు నా తలకాయ కొట్టేసినంత పనైంది (నవ్వుతూ). మేము కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం. అయితే ఆ రోజు స్టేజీ మీద ఆయన అలా చేయడం అస్సలు ఊహించలేదు. అమితాబ్ గారు లెజెండ్. ఆయనకు హ్యాట్సాఫ్.

తండ్రిగా గర్వపడుతున్నా

ఈ సినిమా సెకండ్‌పార్ట్‌కు సంబంధించిన షూటింగ్ కొంతమేర పూర్తయింది. వీఎఫ్ఎక్స్ వర్క్ ఎక్కువగా ఉంటుంది కాబట్టి పూర్తి చేయడానికి ఏడాదిన్నరైగా పట్టొచ్చు. రెండో భాగం రిలీజ్ డేట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అన్నీ అనుకూలిస్తే వచ్చే ఏడాది ఇదే సమయానికి రావొచ్చు. మా అమ్మాయిలు ప్రపంచస్థాయి సినిమా తీసినందుకు తండ్రిగా గర్వపడుతున్నా. మా సంస్థను వారు గొప్ప శిఖరాలకు తీసుకెళ్తున్నారు. 'కల్కి' సినిమాటిక్ యూనివర్స్ నుంచి ప్రస్తుతం రెండు సినిమాలు మాత్రమే తీసుకురావాలని అనుకున్నాం. తర్వాత ఫ్రాంఛైజ్ లోని మిగతా భాగాల గురించి ఆలోచిస్తాం. వైజయంతీ మూవీస్ బ్యానర్ కింద త్వరలో శ్రీకాంత్ తనయుడు రోషన్‌తో 'ఛాంపియన్' సినిమా చేయబోతున్నాం. అలాగే దుల్కర్ సల్మాన్‌తో ఓ సినిమా చేస్తున్నాం.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

నిర్మాతగా యాభై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. మా వైజయంతీ మూవీస్ సంస్థలో మొదటి చిత్రం 'ఎదురులేని మనిషి' నుంచి 'కల్కి' వరకు పనిచేసిన ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ అందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెబుతున్నా. నా విజయాల్లో వారందరికీ భాగస్వామ్యం ఉంది. ముందుముందు కూడా అందరూ గర్వించే చిత్రాలతో ప్రేక్షకులు మాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

... సినిమా డెస్క్

సిస్టమ్‌పై పిస్టల్

సేనాపతి 2.0

శంకర్ యాక్షన్ అంటే..

ప్రేమికుడు 'టేకిటీజీ పాలసీ' అంటాడు.

'జెంటిల్ మెన్' హంటర్ మ్యాన్ అవుతాడు.

'శివాజీ'.. వాహ్ జీ అనిపిస్తాడు.

అదే శంకర్ రీ యాక్షన్ అంటే..

ఆయన యాక్షన్‌లోంచి పుట్టిన 'భారతీయుడు' ఊరుకుంటాడా!

28 ఏండ్ల కిందట మందుపేసవిలో దడపుట్టించిన 75 ఏండ్ల సేనాపతి...

103 ఏండ్లప్పుడు పూనకంతో ఊగిపోతున్నాడు. ఇంతకీ ఈ రెండో

ఇండియన్ ఏం చేయబోతున్నాడు.. ఫస్ట్ ఇండియన్ ఏం చేశాడు..

1996 మే 9.. 'భారతీయుడు' రిలీజైంది. అంతకుముందే ఆ సినిమా పాటలు విడుదలయ్యాయి. ఏ నోట విన్నా ఆ పాటలే! ఏ టేప్ రికార్డర్‌లో చూసినా భారతీయుడు క్యాసెట్టే..! ఆ పాటలతో వీనులవిందు చేసుకొని.. థియేటర్‌కు వెళ్లినవాళ్లకు మొదటి ఆట నుంచే కన్నులపండుగ మొదలైంది. సేనాపతి అలియాస్ భారతీయుడిగా కమల్ హాసన్ విశ్వరూపం. దండుగా అల్లరి వేషం. ఏం చేశాడు సేనాపతి. కలుపు తీశాడు. పచ్చని పైరును నాశనం చేసే కలుపును మూకటివేళ్లతో పెకిలించాడు. అవినీతిని అంతం చేయడానికి కన్నకొడుకు అని కూడా చూడకుండా కడతేర్చాడు.

కొడుకును తండ్రి చంపడం ఏంటి? సెంటిమెంట్‌గా వర్కవుట్ అయ్యే ఫార్ములా కాదు! ఈ ఎండింగ్ చూసి ఐయ్యర్లు బిత్తరపోయారు. కానీ, దర్శకుడు శంకర్ దాన్ని ఒప్పించగలిగాడు. కథ, కథనాలతో ప్రేక్షకులనూ మెప్పించగలిగాడు. క్లాస్ ఏ సెంటర్ నుంచి సీ సెంటర్ సినిమా అభిమానులతోనూ ఆమోదింపజేసుకున్నాడు. పైగా చందు పాత్ర తక్కువదేం కాదు! ఆ పాత్ర లేకుంటే.. సినిమా ఉండేదో లేదో, ఉన్నా ఆడేదో కాదో..! మనీషాతో పాటలు, ఊర్మిళతో ఆటలు.. ఏఆర్ రెహమాన్ సంగీతం... అన్నీ ఈ సినిమాను వండర్‌గా నిలబెట్టడంలో చందు పాత్ర వేసిన చిందులూ కారణమే! చిన్న ఫ్లాష్‌బ్యాక్.. లంచం ఇవ్వనన్న తండ్రి పంతమే తన చెల్లి చావుకు కారణమని చందూ కోపం. లంచం ఇవ్వలేని తండ్రి.. లంచం పుచ్చుకునే కొడుకు. తన నేరం బయటపడొద్దని తండ్రినే పోలీసులకు పట్టించిన

> భారతీయుడు విజయంలో పాటల పాత్రా ఉంది. అందులోని 'పచ్చని చిలుకలు తోడుంటే..' పాట ఇప్పటికీ పాడే కోయిలలు ఎన్నో. 'టెలిఫోన్ ధ్వనిలా నవ్వేదానా..', 'మాయామచ్ఛీంద్ర మచ్చని చూడగ వచ్చావా..', 'అదిరేటి డ్రస్సు మేమేస్తే..', 'తెప్పలెక్కిపోయాక ముప్పు తొలిగిపోయిందే..' ఐదు పాటలూ అదిరిపోయాయి. రెహమాన్ మ్యూజిక్ ఆల్బమ్ ఎవర్‌గ్రీన్ హిట్ జాబితాలో చోటు దక్కించుకుంది. అనిరుద్ సంగీతం అందించిన 'భారతీయుడు 2' పాటలు ఇప్పుడిప్పుడే వైరల్ అవుతున్నాయి. సినిమా విడుదల వేళకు ఎంత మేరకు పుంజుకుంటాయో చూడాలి!

అన్నీ హిట్టే..




కొడుకు పాత్రలో కమల్ హాసన్ ఉన్నా... ఆ పాత్రపై ప్రేక్షకులకు రిగ్రెట్లా చేయడంలో దర్శకుడిదే పైచేయి అయింది. ఎయిర్‌పోర్ట్ రన్‌వే మీద కనిపించిన కొడుకు సేనాపతి నిర్దయగా కత్తి పోట్లు పొడుస్తుంటే సీట్లకు అతుక్కుపోయారు ప్రేక్షకులు. ఆ తర్వాత బ్లాస్టింగ్‌లో సేనాపతి చనిపోయాడు అనుకొని అయ్యో అనుకున్నారు. సింగపూర్‌లో తేలిన ఆ పెద్దాయన.. పోలీసులకు ఫోన్ చేసి అవినీతి పడగ విప్పితే.. దాని అంతానికి మళ్లీ వస్తానని చెప్పినప్పుడు ఈలలు మోగాయి. అప్పుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన సేనాపతి 28 ఏండ్లకు మళ్లీ వస్తున్నాడు.


భారతీయుడు 2 చాలాకాలం కిందటే సెట్స్‌పైకి వెళ్లింది. ఎన్నోసార్లు షూటింగ్‌కు ముహూర్తాలు పెట్టుకున్నారు. మరెన్నోసార్లు వాయిదాలు పడ్డాయి. నిర్మాతలు మారారు. టెక్నీషియన్లూ మారారు. కథానాయికలు కొత్తవాళ్లు. మారనిది ఇద్దరే! ఒకరు దర్శకుడు శంకర్, మరొకరు హీరో కమల్ హాసన్. ఈ కథ వచ్చినా.. చేయొద్దనుకున్నాడట కమల్. ప్రాజెక్ట్ నుంచి తప్పించుకోవడానికి రెమ్యునరేషన్ అధికంగా అడిగానని ఆయనే ఇటీవల చెప్పుకొచ్చారు. కానీ, శంకర్ మాత్రం భారతీయుడు అంటే కమల్ హాసన్ ఒక్కరే అని ఫిక్సయ్యారు. హీరో షరతులకు అంగీకరించారు. షూటింగ్ మొదలైంది. సెట్‌లో ఏదో ప్రమాదం. షూటింగ్‌కు బ్రేక్! కొన్నాళ్లకు మళ్లీ మొదలైంది. కరోనా వచ్చింది. మళ్లీ గ్యాప్!! ఈ శతాధిక భారతీయ వృద్ధ పాత్ర విన్యాసాలు చూడాలని భారతీయులకు రాసిపెట్టి ఉందేమో..! అన్ని కార్యక్రమాలూ విజయవంతంగా పూర్తి చేసుకొని ఇండియన్-2... జూలై 12న బాక్సాఫీస్ దగ్గర తన మర్మకళ చూపించడానికి సిద్ధంగా ఉన్నాడు.

మొదటి సినిమాలో లంచం అంతానికి పాటుపడిన సేనాపతి.. ఇప్పుడు ఎవరి పనిపడతాడు? 'అది రెండో స్వతంత్ర పోరాటం.. గాంధీజీ మార్గంలో మీరు.. నేతాజీ మార్గంలో నేను..' ఈ డైలాగ్ సినిమా ఎలా ఉండబోతున్నదో చెప్పకనే చూపింది. 'అందరినీ దీక్ష బెందాకే ఓ హంటింగ్ డాగ్ రావాలి' సిద్ధార్థ్ పాత్ర పలికే డైలాగ్ ఇది. ఆ వేటకుక్క ఎంత డేంజరో పార్ట్ వన్‌లో చూసేశాం. తప్పు చేస్తే దాన్నుంచి తప్పించుకోలేమని భయం పుట్టించడానికి వేటాడబో తున్నాడు. ఎలా

అన్నది తెరమీద చూడాల్సిందే!

సిద్ధార్థ్ పాత్ర సేనాపతి మనవడిది అని ఊహించొద్దు. ఎందుకంటే... భారతీయుడులో మనీషా పాత్ర గర్భంతో ఉన్నట్టుగా చూపించాడు దర్శకుడు శంకర్. ఆమె కడుపులో ఎదిగిన చందూ ప్రతిరూపం సిద్ధార్థ్ పాత్ర. తండ్రిని చంపిన తాతపై అతనికి ఎలాంటి ఫీలింగ్స్ ఉన్నాయన్నది ఇప్పటికైతే సస్పెన్స్. ట్రైలర్‌లో అయితే.. తాతకు తగ్గ మనవడిలాగే కనిపించాడు. 'భారతీయుడు'లో చందూ కూడా తండ్రికి తగ్గ తనయుడిగానే అనిపిస్తాడు. శంకర్ మార్క్ ట్విస్టులు సినిమాను ఏ క్షణంలో అయినా విలక్షణంగా మార్చేయొచ్చు. చూడబోతూ వివరాలు ఎందుకు. ఇంకో పన్నెండు రోజుల్లో 'భారతీయుడు-2' బాక్సాఫీస్ దండయాత్ర మొదలుకానుంది. మర్మకళతో మెస్మరైజ్ చేస్తాడో, మెరుపు స్టంట్లతో మాయ చేస్తాడో చూద్దాం. 103 ఏండ్ల మనిషి స్టంట్లు చేయడమేంటని కొందరి పెదవి విరుపు. మార్షల్ ఆర్ట్స్‌లో సుశిక్షితుల్ని, గుండె బలం కలిగిన యోధులకు వయసు అడ్డంకి కాదని శంకర్ మాట. నిజ జీవితంలోనూ ఇలాంటి యోధులు ఉన్నారని చెప్పుకొచ్చాడు. చివరిగా సేనాపతి మాటల్లో చెప్పాలంటే.. 'టామ్ అండ్ జెర్రీ ఆట ఆరంభమైంది. నో పారిపోనూ లేదు. దాక్కోనూ లేదు'. వెలకమ్ టు సేనాపతి 2.0. ఆయన అవినీతిలో కూరుకుపోయిన సిస్టమ్‌పై ఎక్కుపెట్టిన పిస్టల్!





థ్రిల్లింగ్.. విన్నింగ్..

లూ (Lou)

ఓటీటీ హిట్

ఓటీటీ: నెట్‌ఫ్లిక్స్

నటీనటులు: అలిసన్ జానీ, జర్నీ ఫ్లోలెట్, రిడ్లీ ఆషా, లోగన్ మార్షల్

డైరెక్టర్: అన్నా ఫోర్‌స్టర్

ఆసక్తికర మలుపులు, ఆశ్చర్యం కలిగించే ట్విస్ట్‌లతో రూపొందే థ్రిల్లర్ సినిమాలంటే సినీ ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారు. నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్‌లో ఉన్న లూ అలాంటి చిత్రమే. లూ అనే వృద్ధురాలు ఇంట్లో ఒంటరిగా నివసిస్తుంది. ఓ రోజు బ్యాంక్‌లోంచి పెద్ద మొత్తంలో డబ్బు విత్ డ్రా చేసుకుని ఇంటికి వస్తుంది. తనకు సంబంధించిన కొన్ని ఫొటోలను, పేపర్లను మంటల్లో తగలబెట్టి టబ్బులో కూలబడుతుంది. పెద్ద తుపాకీ అందుకుని చనిపోవడానికి సిద్ధమవుతుంది. అదే సమయంలో హన్నా అనే మహిళ తన ఇంట్లోకి పరుగున వస్తుంది. తన కూతురు వీ తప్పిపోయిందని చెప్తుంది. ఆ చిన్నారిని క్షేమంగా తీసుకొస్తానని మాటిచ్చిన లూ ఆత్మహత్య ఆలోచన విరమించుకుంటుంది. మరి లూ మాట మీద నిలబడిందా? చిన్నారిని కిడ్నాప్ చేసింది ఎవరు? ఆమెను వృద్ధురాలు కాపాడిందా? లేదా? అసలు ఆమె ప్రాణాలు తీసుకోవడానికి ఎందుకు సిద్ధపడింది? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే!



లూ విచిత్రంగా ప్రవర్తించినప్పుడే తన వెనుక ఏదో ఫ్లాష్‌బ్యాక్ ఉందని అర్థమైపోతుంది. పొరుగింట్లో ఉండే చిన్నారి వీని కనీసం ఒక్కసారైనా పలకరించని లూ.. ఆమె కోసం ప్రాణాలకు తెగించి పోరాడటం, ప్రయత్నించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. లూగా అలిసన్ జానీ నటన అద్భుతంగా ఉంది. హన్నాగా జర్నీ ఫ్లోలెట్, వీగా రిడ్లీ ఆషా నటన ఆకట్టుకుంటుంది. ప్రీ క్లైమాక్స్, కథను మలుపు తిప్పే ట్విస్టు బాగుంటుంది. మీరూ థ్రిల్లర్ మూవీస్‌ని ఇష్టపడేవాళ్లయితే నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగులో అందుబాటులో ఉన్న 'లూ' చూసేయండి!



భారత్ అద్వితీయం

17 ఏండ్ల తర్వాత భారత్‌కు టీ20 ప్రపంచకప్

రెండో సారి కప్ ముద్దాడిన టీమ్‌ఇండియా • ఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఉత్కంఠ విజయం

కోహ్లీ, హార్దిక్ పాండ్యా విజృంభణ • క్లాసెన్, డికాక్ పోరాటం వృథా

అద్భుతం ఆవిష్కృతమైంది! ఒకటా..రెండా 17 ఏండ్లుగా అందని ద్రాక్షగా ఊరిస్తూ వస్తున్న పొట్టి ప్రపంచకప్ ఎట్టకేలకు మన వెంట చేరింది. 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్ష ఫలించిన వేళ..కరీబియన్ గడ్డపై త్రివర్ణ పతాకం సగర్వంగా రెపరెపలాడింది. విజయమో, వీరస్వర్గమో అన్న రీతిలో సరిహద్దుల్లో సైనికుల్లాగా మన క్రికెటర్లు పోరాడిన తీరు చిరకాలం అభిమానుల మదిలో నిలిచిపోనుంది. మెగా టోర్నీలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ..అప్రతిహత విజయాలతో ఆఖరి పోరులో నిలిచిన రోహిత్‌సేన..దక్షిణాఫ్రికాపై చారిత్రక విజయంతో కదంతొక్కింది. కెన్సింగ్టన్ ఓవల్ మైదానంలో కొత్త చరిత్ర లిఖిస్తూ రెండో సారి టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడింది.

శనివారం ఆఖరి బంతి వరకు నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన పోరులో సఫారీలపై భారత్‌దే పైచేయి అయ్యింది. రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ సాధికారిక అర్ధసెంచరీకి తోడు..అక్షర్‌పటేల్, దూబే బ్యాటింగ్‌తో భారత్ పోరాడే స్కోరు అందుకుంది. లక్ష్యఛేదనలో క్లాసెన్, డికాక్ భయపెట్టినా..భారత్ తలవంచలేదు. పోరాడితే పోయేదేమీ లేదన్న తీరులో కడదాకా కొట్లాడుతూ ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఒకానొక దశలో క్లాసెన్ వీరబాదుడుతో కోట్లాది మంది అభిమానుల గుండెలు దడేల్ మన్నాయి. ఇక్కడే హార్దిక్ పాండ్యా అద్భుతం చేశాడు. ఆఖరి ఓవర్లో సూర్యకుమార్‌యాదవ్ సూపర్ క్యాచ్‌తో సఫారీల ప్రపంచకప్ ఆశలు ఆవిరయ్యాయి.



టీ20లకు కోహ్లీ గుడ్‌బై

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికారు. ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం సాధించిన తర్వాత కోహ్లీ ఈ విషయాన్ని వెల్లడించారు. జట్టు విజయంలో కీలకమైన నేపథ్యంలో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందుకున్న కోహ్లీ మాట్లాడుతూ 'ఇది నా కెరీర్‌లో చివరి టీ20 ప్రపంచకప్. ఏదైతే సాధించాలనుకున్నామో అది అందుకున్నాం. భారత్ తరఫున టీ20ల్లో ఇదే చివరి మ్యాచ్. ఇందులో ఎలాంటి రహస్యం లేదు. టీ20లను ముందుకు తీసుకెళ్లేందుకు యువ క్రికెటర్లు సిద్ధంగా ఉన్నారు. ఐసీసీ ట్రోఫీ కోసం ఎంతో ఎదురుచూశాం. రోహిత్‌కు ఇది తొమ్మిదో టీ20 ప్రపంచకప్ అయితే..నాకిది ఆరోది. భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతున్నాం. ఇది చిరకాలం మా మదిలో నిలిచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు' అని అన్నారు.

3 వెస్టిండీస్, ఇంగ్లండ్ తర్వాత రెండుసార్లు టీ20 వరల్డ్ కప్ గెలిచిన మూడో జట్టు భారత్.

1 టీ20 ప్రపంచకప్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా ట్రోఫీ నెగ్గిన జట్టు భారత్

1 టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో ఇదే అత్యధిక స్కోరు. 2021 ఎడిషన్‌లో ఆస్ట్రేలియా.. న్యూజిలాండ్‌పై 173 పరుగులు సాధించడమే ఇప్పటిదాకా అత్యుత్తమం.

50 టీ20 కెప్టెన్‌గా రోహిత్‌కు ఇది 50వ విజయం. పొట్టి ఫార్మాట్‌లో ఇదే రికార్డు.



ప్రైజ్‌మనీ
విజేత:
భారత్
రూ.20.40 కోట్లు
రన్నరప్:
దక్షిణాఫ్రికా:
రూ.10.67 కోట్లు

బ్రిడ్జ్‌టౌన్: భారత్ చిరకాల కల నెరవేరింది! అందినట్టే అంది దూరమవుతూ వస్తున్న ప్రపంచకప్ ఎట్టకేలకు మన చెంతకు చేరింది. శనివారం ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా ఏడు పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై చిరస్మరణీయ విజయం సాధించింది. తొలుత విరాట్ కోహ్లీ(59 బంతుల్లో 76, 6ఫోర్లు, 2సిక్స్‌లు), అక్షర్‌పటేల్(31 బంతుల్లో 47, ఫోర్, 4సిక్స్‌లు) బ్యాటింగ్‌తో భారత్ తొలుత 20 ఓవర్లలో 176/7 స్కోరు చేసింది. మహరాజ్, నోర్జె రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 169/8 స్కోరు చేసింది. క్లాసెన్(27 బంతుల్లో 52, 2ఫోర్లు, 5సిక్స్‌లు), డికాక్(39) రాణించారు. హార్దిక్ పాండ్యా(3/20) మూడు వికెట్లతో విజృంభించగా, అర్ష్‌దీప్‌సింగ్(2/20), బుమ్రా(2/18) రెండేసి వికెట్లతో సత్తాచాటారు. అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', 15 వికెట్లతో అదరగొట్టిన బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' గా నిలిచాడు.

కోహ్లీ, అక్షర్ అదుర్స్:

తొలుత టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకున్నది. మెగాటోర్నీలో ఫామ్‌లేమితో సతమతమైన విరాట్ కోహ్లీ ఫైనల్ పోరులో సత్తాచాటాడు. జాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లో మూడు ఫోర్లు బాది తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన లెఫ్టార్మ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్..టీమ్‌ఇండియాను ఆదిలోనే దెబ్బకొట్టాడు. వరుసగా రెండు ఫోర్లతో జోరు మీద కనిపించిన కెప్టెన్ రోహిత్‌శర్మ(9)తో పాటు వికెట్‌కీపర్, బ్యాటర్ పంత్(0)ను వెంట వెంటనే ఔట్ చేసి సఫారీ శిబిరంలో ఆనందం నింపాడు. తొలి రెండు ఓవర్లు ముగిసే సరికి టీమ్‌ఇండియా రెండు కీలక వికెట్లు కోల్పోయి 23 పరుగులు చేసింది. అప్పటికే కష్టాల్లో ఉన్న ఇండియాను రబాడ మరింత ఇబ్బందుల్లోకి నెట్టాడు. భారీ షాట్ ఆడబోయిన 'మిస్టర్ 360' సూర్యకుమార్(3)..క్లాసెన్ క్యాచ్‌తో మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. 34 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయిన తరుణంలో బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందువచ్చిన అక్షర్‌పటేల్..కోహ్లీకి జతకలిశాడు. ఇక్కడినుంచి టీమ్‌ఇండియా ఇన్నింగ్స్ గాడిలో పడింది. వీరిద్దరు సఫారీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. ఒకవైపు సహచరులు నిష్క్రమించినా..కోహ్లీ పరిణతి కనబరిచాడు. ఇన్నింగ్స్ గాడిలో పడి ఊపందుకుంటున్న తరుణంలో అనవసర పరుగు కోసం ప్రయత్నించిన అక్షర్..క్వింటన్ డికాక్ డైరెక్ట్ త్రోతో భారంగా పెవిలియన్‌కు వెళ్లాడు. దీంతో నాలుగో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే(27) అడపాదడపా భారీ షాట్లు ఆడే ప్రయత్నం చేశాడు. హాఫ్ సెంచరీ తర్వాత బ్యాటు ఝుళిపించిన విరాట్..రబాడ 18వ ఓవర్లో ఓ భారీ సిక్స్, ఫోర్‌తో ఆకట్టుకున్నాడు. అదే ఊపులో జాన్సెన్‌ను అరుసుకుంటూ 19వ ఓవర్లో కోహ్లీ 4, 6 జోరు కనబరిచాడు. మరో భారీ షాట్ ఆడే క్రమంలో బౌండరీ వద్ద రబాడ క్యాచ్‌తో కోహ్లీ ఔట్ కావడంతో ఐదో వికెట్‌కు 57 పరుగుల పార్ట్‌నర్‌షిప్ ముగిసింది. 20వ ఓవర్ వేసిన నోర్జె..దూబే, జడేజా(2)ను ఔట్ చేసి తొమ్మిది పరుగులే ఇవ్వడంతో టీమ్‌ఇండియా 7 వికెట్లకు 176 పరుగుల వద్ద ఇన్నింగ్స్‌కు తెరపడింది.

క్లాసెన్, డికాక్ పోరాడినా:

భారత్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికాకు సరైన శుభారంభం దక్కలేదు. 12 పరుగులకే ఓపెనర్ హెండ్రిక్స్(4), కెప్టెన్ మార్క్‌రమ్(4) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఒకవైపు సహచరులు నిష్క్రమించినా..డికాక్ పోరాటాన్ని నమ్ముకున్నారు. ఈ తరుణంలో కెప్టెన్ రోహిత్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్‌తో గత మ్యాచ్‌లో విజృంభించిన స్పిన్నర్లు అక్షర్‌పటేల్, కుల్దీప్‌యాదవ్ ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయారు. 13వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయిన డికాక్..కుల్దీప్ క్యాచ్‌తో ఔటయ్యాడు. ఆ తర్వాత క్లాసెన్ విశ్వరూపం ప్రదర్శించాడు. అక్షర్ పటేల్ వేసిన 15వ ఓవర్‌లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లతో ఏకంగా 24 పరుగులతో దుమ్మురేపాడు. మ్యాచ్ పూర్తిగా చేజారిందన్న తరుణంలో హార్దిక్..క్లాసెన్‌తో పాటు మిల్లర్‌ను ఔట్ చేసి మ్యాచ్‌ను మన వైపునకు తిప్పాడు.

సంక్షిప్త స్కోర్లు:

భారత్: 20 ఓవర్లలో 176/7(కోహ్లీ 76, అక్షర్ 47, మహరాజ్ 2/23, నోర్జె 2/26), దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 169/8(క్లాసెన్ 52, డికాక్ 39, హార్దిక్ 3/20, బుమ్రా 2/18)



సూర్య సూపర్ క్యాచ్

చివరి ఓవర్ తొలి బంతికి హార్దిక్ వేసిన ఫుల్‌టాస్‌ను మిల్లర్ లాంగాఫ్ దిశగా భారీ షాట్ ఆడాడు. అక్కడికి కొద్దిదూరంలో ఫీల్డింగ్ చేస్తున్న సూర్య పరిగెత్తుకుంటూ వచ్చి బౌండరీ లైన్‌కు ఇంచు దూరంలో బంతిని క్యాచ్ పట్టాడు. బ్యాలెన్స్ తప్పుతూ రన్నింగ్ క్యాచ్‌ను అందుకున్నాడు. కానీ అప్పటికే బౌండరీ లైన్ అవతలకు వెళ్తున్నానని గ్రహించిన సూర్య వెంటనే బంతిని గాల్లోకి ఎగరేసి బౌండరీ లైన్ అవతలకు వెళ్లి మళ్లీ లోపలికి వచ్చి పట్టిన క్యాచ్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

> 'ప్రపంచకప్ గెలిచినందుకు భారత జట్టుకు అభినందనలు. క్లిష్ట పరిస్థితుల్లో టోర్నీ ఆసాంతం జట్టు అత్యుత్తమ నైపుణ్యాలను ప్రదర్శించింది. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడారు. వెల్ డన్, టీమ్‌ఇండియా'
>
> - ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

> 'చాంపియన్స్! టీ20 ప్రపంచకప్‌ను భారత్ స్వదేశానికి తీసుకొచ్చింది. మిమ్మల్ని చూసి దేశం గర్విస్తోంది. ఈ మ్యాచ్ చరిత్రాత్మకం'
>
> - ప్రధాని మోదీ

> భారత జట్టు సంచలనాత్మక ప్రదర్శనతో అన్ని విభాగాల్లో సత్తా చాటింది. 'కింగ్' విరాట్ కోహ్లీతోపాటు టీమ్‌ఇండియా బౌలర్లంతా సందర్భోచితంగా రాణించారు. 17 ఏండ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ రెండో సారి టైటిల్‌ను సాధించి కోట్లాది మంది భారతీయుల కల నెరవేర్చిన రోహిత్ సేనకు ధన్యవాదాలు''
>
> - కేటీఆర్ (బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్)

అమ్మాయిలు భళా

- తొలి ఇన్నింగ్స్ 603/6 డిక్లేర్
- టెస్టు క్రికెట్ చరిత్రలో భారత్ రికార్డు స్కోరు

చెన్నై: స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఏకైక టెస్టులో భారత మహిళల జట్టు రికార్డు స్కోరు చేసింది. 90 ఏండ్ల మహిళల క్రికెట్ చరిత్రలో అత్యధిక స్కోరు (603) నమోదు చేసిన జట్టుగా రికార్డులకెక్కింది. తొలి రోజే రికార్డుల దుమ్ముదులిపిన మన అమ్మాయిలు.. రెండో రోజూ అదే జోరు కొనసాగించి 115.1 ఓవర్లలో 603/6 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. రిచా ఘోష్ (90 బంతుల్లో 86, 16 ఫోర్లు) శతకం మిస్ చేసుకోగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (115 బంతుల్లో 69, 4 ఫోర్లు) రాణించడంతో టీమ్‌ఇండియా భారీ స్కోరు సాధించింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన సఫారీలు బంతితో విఫలమైనా బ్యాట్‌తో దీటుగా బదులిస్తున్నారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 236 పరుగులు చేసింది. సునె లూస్ (164 బంతుల్లో 65, 6 ఫోర్లు, 1 సిక్స్), మరిజానె కాప్ (125 బంతుల్లో 69 నాటౌట్, 8 ఫోర్లు) అర్ధ శతకాలతో కదం తొక్కారు.

రిచా, కౌర్ అర్ధ శతకాలు:

ఓవర్ నైట్ స్కోరు 525/4 వద్ద రెండో రోజు ఆరంభించిన భారత్ మొదటి రోజు దూకుడునే కొనసాగించింది. ఆట మొదలైన కొద్దిసేపటికే కౌర్ టెస్టుల్లో తన తొలి అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. డిక్లెర్క్ 104వ ఓవర్లో బౌండరీతో రిచా సైతం 54 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించింది. డెర్క్‌సెన్ వేసిన 109వ ఓవర్లో రిచా బౌండరీ బాదడంతో ఆస్ట్రేలియా పేరిట ఉన్న అత్యధిక స్కోరు రికార్డును భారత్ అధిగమించింది.



భారత యువ రెజ్లర్ల పతక జోరు

అండర్-23 ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్

అమ్మన్: అండర్-23 ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్లు పతకాల పంట పండించారు. అమ్మన్ (జోర్డాన్) వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో పోటీపడ్డ ముగ్గురు మహిళలు బంగారు పతకాలు సాధించగా గ్రీకో రోమన్‌లో బరిలోకి దిగిన పురుష రెజ్లర్లు రజత, కాంస్యాలతో మెరిశారు. మహిళల 50 కిలోల విభాగంలో మీనాక్షి స్వర్ణం సాధించగా పుష్ప యాదవ్, ప్రియా మాలిక్ పసిడి పతకాలు దక్కించుకున్నారు. గ్రీకో రోమన్‌లో ఏడుగురు రజతాలు గెలుచుకున్నారు.

సారథిగా విఫలమై.. కోచ్‌గా గెలిచి..



ద్రవిడ్ హెడ్‌కోచ్‌గా భారత్

	మ్యా	వి	ఓ	టై	డ్రా/ఫ.తే	వి.శాతం
టెస్టులు	24	14	7	0	3	58.33
వన్డేలు	53	36	14	0	3	72
టీ20లు	71	52	16	0	2	75

నోట్: మ్యా:మ్యాచ్‌లు, వి:విజయాలు, ఓ: ఓటములు, వి.శాతం:విజయాల శాతం

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

2007 మార్చిలో వెస్టిండీస్ గడ్డ మీదే జరిగిన వన్డే ప్రపంచకప్ భారత క్రికెట్ చరిత్రలో ఓ చీకటి అధ్యాయం. దిగ్గజాలతో కూడిన టీమ్‌ఇండియా ఈ టోర్నీలో గ్రూప్ దశలోనే ఓడిపోవడం ఒకటైతే అప్పటికే పసికూనగా ఉన్న బంగ్లాదేశ్ చేతిలో పరాభవం భారత అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. నాడు భారత జట్టుకు సారథిగా వ్యవహరించిన రాహుల్ ద్రవిడ్.. సరిగ్గా 17 ఏండ్ల తర్వాత తాను పోగొట్టుకున్న చోటే వెతుక్కున్నట్టు సారథిగా విఫలమైనా హెడ్ కోచ్‌గా ట్రోఫీ అందుకున్నాడు. సుమారు దశాబ్దంన్నర పాటు 'మిస్టర్ డిపెండబుల్'గా భారత బ్యాటింగ్ భారాన్ని తన భుజాలపై మోసిన ద్రవిడ్.. ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించాక బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో యువ క్రికెటర్లను సానబెట్టే బాధ్యతను తీసుకున్నాడు. రవిశాస్త్రి నుంచి 2021లో భారత క్రికెట్ జట్టు హెడ్‌కోచ్ పగ్గాలు అందుకున్న ద్రవిడ్.. మూడున్నరేండ్ల పాటు 'మెన్ ఇన్ బ్లూ'ను విజయవంతంగా నడిపించాడు. ద్రవిడ్ మార్గదర్శకత్వంలోని భారత జట్టు మూడు ఫార్మాట్లలో నంబర్‌వన్‌గా నిలిచింది. ఈ మూడేండ్ల కాలంలో రోహిత్ శర్మ సారథ్యాన భారత జట్టు అద్భుతాలు సృష్టించింది. ద్రవిడ్ హయాంలో భారత్.. మూడు సార్లు (2023 టెస్టు చాంపియన్‌షిప్, 2023 వన్డే వరల్డ్ కప్, 2024 టీ20 వరల్డ్ కప్) ఐసీసీ టోర్నీల్లో ఫైనల్ చేరగా 2022 టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ దాకా వెళ్లింది. వాస్తవానికి గతేడాదే ద్రవిడ్ పదవీకాలం ముగిసినా బీసీసీఐ దానిని టీ20 వరల్డ్‌కప్ దాకా పొడిగించింది. కోచ్‌గా తన ఆఖరి మ్యాచ్‌ను ద్రవిడ్ విజయవంతంగా ముగించడం విశేషం.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078. Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9, Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.